


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

26.08.2026

బుధవారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 105

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి ఆత్మహత్య

- శ్రీశైలంలో విషాదకర ఘటన
- ప్రైవేట్ సత్రంలో రూమ్ తీసుకుని..
- ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు
- ఆరోగ్య సమస్యలు, తీవ్ర ఆర్థిక ఇబ్బందులే కారణం



2లో..

## సుజ్లాన్ రాకతో ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ పెరిగింది

- పవన విద్యుత్ రంగంలో సుజ్లాన్‌కు ప్రపంచ ఖ్యాతి
- 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం
- ఏపీ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీలో 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం
- రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్

7లో..



**రాయదుర్గం ఆగస్టు 25,అనంత జనశక్తి న్యూస్**

పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఏపీ నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు అనంతపురం జిల్లాలో మీ అందరి మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యాయానికి నాంది. ఈ రోజు సుజ్లాన్, ఏపీ మధ్య రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బంధాన్ని పునరుద్ధరించుకునే సందర్భం కూడా. సుజ్లాన్ తొలినాళ్లలోనే ఏపీకి వచ్చి, తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసి, బలమైన విండ్ ఎనర్జీ ఎకో సిస్టమ్ నిర్మించింది. సుజ్లాన్ గురించి మాట్లాడేటప్పుడు దివంగత తులసి తంతి గారిని మనం స్మరించుకోవాలి. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే ఆయన పునరుత్పాదక ఇంధనంపై నమ్మకం ఉంచారు.

## హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి కాదు!

- అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు 2లో..



**అలహాబాద్, ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్**

పాఠశాల యూనిఫామ్‌తో పాటు హిజాబ్ లేదా తలపై స్కార్ఫ్ ధరించేందుకు అనుమతించాలని కోరుతూ ఓ ముస్లిం విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. తరగతి గదిలో హిజాబ్ ధరించడం ఇస్లాంలో తప్పనిసరి మతపరమైన ఆచారం అని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని కోర్టు పేర్కొంది. ఆగస్టు 21న జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇందర్‌జీత్ శుక్లాలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

# 30 ఏండ్ల కింద తీసుకున్న సంకల్పం నెరవేరింది




**అమరావతి, ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్**

వెలిగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం ప్రాంత రూపురేఖలు మారనున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. 30 ఏళ్ల క్రితం తాను తీసుకున్న సంకల్పం నెరవేరిందంటూ 'ఎక్స్' వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లను అధిగమించి భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసి కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నామని చెప్పారు. 1996 మార్చి 5న వెలిగొండకు శంకుస్థాపన చేసిన తానే.. మూడు దశాబ్దాల తర్వాత ఈనెల 31న ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్లు సీఎం తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు శంకుస్థాపన నాటి ఫొటోను ఆయన షేర్ చేశారు.

- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- వెలిగొండ ప్రాజెక్టుతో రూపురేఖలు మారుతాయి
- పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి మహర్దశ
- ఎన్నో అవాంతరాలు, సవాళ్లను అధిగమించి.. 2లో..
- భగీరథ ప్రయత్నంతో వెలిగొండ ఫేజ్-1..
- కరవు నేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నాం
- అఖండ గోదావరి పుష్కరాలకు ప్రపంచస్థాయి ఏర్పాట్లు!
- ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు

"వెలిగొండ ఫేజ్ 1 ద్వారా 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్ 2తో 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు లక్షలాది మందికి తాగునీరు అందించడమే లక్ష్యం. ఈ నెల 31న 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు విడుదల చేయనున్నాం. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి పశ్చిమ ప్రకాశం ప్రజల ఆకాంక్షను నెరవేర్చాం. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం ప్రాంతాలను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తాం. బెంగళూరుఅమరావతి హైవే, రామాయపట్నం పోర్టుతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించి ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం" అని చంద్రబాబు పేర్కొన్నారు.



## డీఆర్డీఓ టెక్నాలజీ దేశీయ పరిశ్రమలకు బదిలీ

- ఆమోదం తెలిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- భారత్‌కు ఇక క్షిపణుల కొరత ఉండదు
- కేంద్రం సంచలన నిర్ణయం 2లో..



## 2 వారాల్లో లొంగిపోవాలి

- మాజీ తెహెల్కా ఎడిటర్ తేజ్‌పాల్‌కు ఆదేశం
- 2013 నాటి అత్యాచారం కేసులో దోషి
- అత్యాచారం కేసులో సుప్రీంకోర్టు షాక్ 2లో..



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

2013 నాటి అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## ఫీజు బకాయిలపై కాంగ్రెస్ సర్కార్‌కు డెడ్‌లైన్

- ఫీజు బకాయిలపై బండి సంజయ్ ఫైర్
- వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్
- 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన 2లో..



## లిఫ్ట్‌లో సీఎం.. సడన్‌గా ఫస్ట్‌ఫ్లోర్‌లో స్టాప్

- మెట్ల మార్గంలో మీడియా హాల్‌కు రేవంత్ రెడ్డి
- సెక్యూరిటీ సిబ్బందిలో ఒక్కసారిగా కలకలం
- భద్రతా లోపంపై అధికారుల ఆగ్రహం



2లో..

## 22A భూములపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి

- 22A భూములపై హరీశ్ రావు ఫైర్
- దశాబ్దాల నాటి పట్టా భూములూ నిషేధిత జాబితాలో

**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

22A నిషేధిత భూముల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. కమీషన్ల కక్కుర్తి కోసమే సామాన్య ప్రజల ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి నెట్టిందని హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



2లో..

## వైసీపీ నేతలకు జగన్ సీరియస్ వార్నింగ్

- ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో..
- ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వను
- ప్రతి చోటా అభ్యర్థిని నిలబెట్టాలి
- పార్టీ నేతలకు కీలక సూచనలు
- 60 రోజుల పాటు స్థానిక నేతలు
- నియోజకవర్గం వదిలి వెళ్లకూడదు 2లో..



## సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

- హైకోర్టు కీలక ఆదేశాలు
- డిమాండ్లపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన 2లో..



# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి ఆత్మహత్య

**శ్రీశైలం, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో అత్యంత విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు లాడ్జి గదిలో అనుమానాస్పద స్థితిలో శవాలై కనిపించారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, నిరంతరం వేధిస్తున్న ఆర్థిక ఇబ్బందులే ఈ దారుణమైన నిర్ణయానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన పల్లపు సుధాకర్ (36) అనే వ్యక్తి తన ముగ్గురు సోదరీమణులు, 15 ఏళ్ల మేనల్లుడితో కలిసి జూలై 28న శ్రీశైలం చేరుకున్నారు. వీరంతా సుధాకర్‌కు చెందిన ఆటోలోనే వచ్చి.... ఓ ప్రైవేట్ సత్రంలోని గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మంగళవారం రోజున సత్రం సిబ్బంది గది తలుపులు ఎంతకీ తెరుచుకోకపోవడం, లోపలి నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గమనించారు. అనుమానం వచ్చి కిటికీలోంచి చూడగా.... గదిలో ఉన్న ఐదుగురు కూడా ఉరివేసుకుని కనిపించారు. ఈ భయానక దృశ్యాన్ని చూసిన సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే సుధాకర్, అతనిద్దరు అక్కలు, చెల్లెలు, మేనల్లుడు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. దీనికితోడు సుధాకర్ పెద్ద అక్కలు ఇద్దరూ తమ భర్తల నుంచి విడిపోయి జీవిస్తున్నారు. కుటుంబంలో ఏకైక ఆధారమైన సుధాకర్ ఆటో నడుపుతూ వచ్చిన కొద్దిపాటి ఆదాయంతోనే వీరందరినీ పోషిస్తున్నాడు. అయితే... రోజురోజుకు పెరిగిపోతున్న వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ భారంగా మారడం, మరోవైపు ఆర్థిక పరిస్థితులు ఎంతకూ మెరుగుపడకపోవడంతో వీరంతా తీవ్ర మనోవేదనకు గురైనట్లు తెలుస్తోంది. జీవితంపై తీవ్ర విరక్తి చెంది, వేరే దారి లేక అందరూ కలిసి ఈ దారుణమైన నిర్ణయం తీసుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి... అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరుపుతున్నారు.

# 22A భూములపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో 22A భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న తదితరులతో కలిసి బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**ఏ-1 రేవంత్ రెడ్డి, ఏ-2 పొంగులేటి.. కమీషన్ల కోసమే ఈ దోపిడీ**

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. 22A కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉందన్న ఆయన, ఈ అక్రమాల్లో ఏ1గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏ2గా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. 5050 కమీషన్ల కోసమే లక్షలాది మంది ప్రజలను నిద్రలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. 98 శాతం భూములను 22A జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. తప్పు చేసింది ప్రభుత్వం అయితే, దానిని సరిదిద్దుకోవడానికి దరఖాస్తుల పేరుతో సామాన్యులు ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలని నిలదీశారు.

**దశాబ్దాల నాటి పట్టా భూములు కూడా బ్లాక్.. అక్రమ వసూళ్ల పర్వం**

58 ఏళ్ల క్రితం ఏర్పడిన పద్మారావు నగర్ ఫేజ్ 1, 1950ల నాటి స్ప్రింగ్ ఫీల్డ్, నిజాంపేట్ లాంటి కాలనీల్లోని దశాబ్దాల క్రితం నాటి పట్టా భూములను కూడా 22Aలో చేర్చడం తుగ్లక్ చర్య కాక మరేమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో విల్లాకు, ఫ్లాట్‌కు రూ.30 వేలు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇస్తేనే పని అవుతుందని బాధితులు బహిరంగంగా వాపోతున్నారని తెలిపారు. అమీన్‌పూర్ నుంచి వచ్చిన బాధితుడిని ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్ అని తిప్పించుకుని, చివరకు బయట బ్రోకర్లను కలిస్తేనే పని అవుతుందని బెదిరిస్తున్నారన్నారు. ఈ సమస్య కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములను 22Aలో పెట్టారని, దీనివల్ల రైతులకు రైతుబంధు, ఎరువులు, విద్యుత్ కనెక్షన్లు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**సీఎం తమ్ముడికి వందల కోట్లు.. ప్రజల ఆస్తులేమో నిషేధిత జాబితాలో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తమ్ముడికి మాత్రం వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కట్టబెడతారని, సామాన్య ప్రజల ఆస్తులను మాత్రం 22Aలో పెట్టి ఇబ్బందుల పాలు చేస్తారని హరీశ్ రావు విమర్శించారు. చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎం ఇల్లు కూడా 22A నిషేధిత జాబితాలోనే ఉన్నాయంటే ఈ ప్రభుత్వ పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారని, ఇలా అమ్ముకుంటూ పోతే రేపు బడికి, గుడికి, చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదని ధ్వజమెత్తారు.

**శ్వేతపత్రం విడుదల చేయాలి.. అసెంబ్లీని స్తంభింపజేస్తాం**

ఈ మొత్తం 22A నిషేధిత భూముల అక్రమాలపై తక్షణమే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అసలు ఈ భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో నిజాలు బయటపడాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, నిషేధిత జాబితాను వెబ్‌సైట్‌లో ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలని కోరారు. బాధితుల పక్షాన నిలబడి సెప్టెంబర్ 7న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగేలా పోరాడతామని స్పష్టం చేశారు.

# లిఫ్ట్‌లో సీఎం.. సడన్‌గా ఫస్ట్‌ఫ్లోర్‌లో స్టాప్

**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతలో తీవ్ర లోపం బయటపడటం కలకలం రేపింది. సచివాలయ గ్రౌండ్ ఫ్లోర్‌లోని 29వ నెంబర్ హాల్‌లో సీఎం మీడియా సమావేశానికి ఏర్పాట్లు చేయగా, అక్కడికి చేరుకునేందుకు ముఖ్యమంతంత్రితో పాటు ఇతర ముఖ్య నేతలు లిఫ్ట్ ఎక్కారు. అయితే, నిర్ణీత గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆగాల్సిన లిఫ్ట్ సాంకేతిక సమస్యతో హఠాత్తుగా ఫస్ట్‌ఫ్లోర్‌లో ఆగిపోయింది. దీంతో వేరే దారి లేక సీఎం నేరుగా ఫస్ట్ ఫ్లోర్‌లోని 32 నెంబర్ గదికి వెళ్లి, ఆ తర్వాత మెట్ల మార్గంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని మీడియా హాల్‌కు చేరుకోవాల్సి వచ్చింది. ఈ అనూహ్య పరిణామంతో ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. అత్యున్నత భద్రత ఉండాల్సిన ప్రదేశంలో ఇలాంటి లోపం తలెత్తడంపై ఇంటెలిజెన్స్, ఈఎస్డబ్ల్యూ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సీఎస్ఓ నిర్లక్ష్యం వల్లే ఈ భద్రతా వీక్‌నెస్ బయటపడిందని మండిపడుతూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.

# వైసీపీ నేతలకు జగన్ సీరియస్ వార్నింగ్

**అమరావతి, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. స్థానిక స్థంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవం జరిగితే.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాండిడేట్ కాలేరని తేల్చి చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీ చేయాల్సిందేనని.. ఎక్కడా ఏకగ్రీవాలకు ఆస్కారం ఉండకూడదన్నారు. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడున్న నియోజకవర్గ ఇంఛార్జ్ పార్టీ అభ్యర్థులు కాలేరన్నారు. తాడేపల్లిలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఎక్కడెక్కడ అభ్యర్థులను నిలబెట్టారో నివేదికలు తెప్పించుకుంటానని.. అభ్యర్థులను నిలబెట్టడంతో పాటుగా వారికి ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంత బలంగా మద్దతిచ్చారన్నదానిపైనా రిపోర్ట్‌లు తీసుకుంటానన్నారు. ప్రతి నేత ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని జగన్ సీరియస్‌గా చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తే కూటమికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇస్తారని జగన్ వ్యాఖ్యానించారు. ఏపీ ప్రభుత్వం స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతోందని.. ఈ నిర్ణయం వైఎస్సార్‌సీపీకి అనుకూలమని వ్యాఖ్యానించారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన అభ్యర్థుల్ని పోటీ చేయించాలని సూచించారు.. ఒకవేళ అవసరం అనుకుంటే కార్యకర్తలకు అండగా నిలిచేందుకు పార్టీ నేతల కుటుంబ సభ్యులను పోటీకి దింపడానికీ వెనకాడొద్దని సూచించారు. ప్రతి స్థానంలో ప్రజల గొంతు వినిపించేలా, పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేలా పోటీ చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తల కోసం నేతలు గట్టిగా నిలబడితేనే.. సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు నేతల కోసం గట్టిగా నిలబడతారన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు గెలుపోటములకు సంబంధించినవి కావని.. కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలని జగన్ చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్ని నిష్పక్షపాతంగా జరగనివ్వరని.. స్థానిక నేతలు ఈ విషయాన్ని తేలికగా తీసుకోకుండా బలమైన అభ్యర్థుల్ని పోటీ చేయించాలని సూచించారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన, కూటమి ప్రభుత్వ పాలనకు తేడాను వివరించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లేందుకు అవసరమైన సమాచారంతో పాటుగా అవసరమైన ప్రచార సామగ్రిని పార్టీ అందిస్తుందన్నారు. త్వరలోనే పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు.. గ్రామస్థాయి కమిటీలు, అనుబంధ విభాగాల కార్యకర్తల వరకు పంపిణీ చేస్తామన్నారు. సెప్టెంబరు 5,6,7 తేదీల్లో జిల్లా స్థాయి సమావేశాలు.. 8,9,10,11 తేదీల్లో అసెంబ్లీ నియోజవకర్గాల స్థాయి సమావేశాలు నిర్వహించాలన్నారు. సెప్టెంబరు 12 నుంచి 22 వరకు మండల, వార్డు, డివిజన్ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మీడియా, లీగల్ సెల్‌లను యాక్టివేట్ చేయాలని సూచించారు జగన్. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పార్టీ కేడర్‌పై దౌర్జన్యాలు చేసే అవకాశం ఉందని.. కాబట్టి కార్యకర్తల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సోషల్ మీడియాను యాక్టివ్ చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నిక అభ్యర్థుల ఎంపిక సమయంలో ఈగోలకు అవకాశం ఇవ్వకూడదని.. అందర్నీ కలుపుకుని ముందుకు సాగాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో నేతలు మరో రెండు నెలల పాటూ కేడర్‌కు అందుబాటులో ఉండాలని.. నియోజకవర్గం దాటి వెళ్లకూడదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులు న్యాయంగా వ్యవహరించాలని.. ఒకవేళ అలా జరగకుండా కార్యకర్తల్ని వేధించేవారిని, అన్యాయం చేసేవారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై భవిష్యత్‌లో చర్యలు తీసుకుంటామన్నారు.

# హిజాబ్ ఇస్లాంలో తప్పనిసరి కాదు!

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు తలపై స్కార్ఫ్ ధరించడం ఇస్లాం మతంలో అత్యవసరమైన ఆచారం కాదని గతంలో పలు హైకోర్టులు అభిప్రాయపడిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

**కర్ణాటక హైకోర్టు తీర్పు ప్రస్తావన**

కర్ణాటక హైకోర్టు విద్యాసంస్థల్లో హిజాబ్‌పై ఆంక్షలను సమర్థిస్తూ ఇచ్చిన తీర్పుకు ప్రస్తుతం కూడా ప్రాధాన్యత ఉందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో గతంలో భిన్నాభిప్రాయాలతో తీర్పు వెలువడిందని, తుది నిర్ణయం ఇంకా రాలేదని తెలిపింది. అందువల్ల కర్ణాటక హైకోర్టు తీర్పు తమకు ముఖ్యమైన మార్గదర్శకంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. హిజాబ్ ధరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద రక్షణ పొందే అత్యవసర మతపరమైన ఆచారం అని విద్యార్థిని చేసిన వాదనను కోర్టు అంగీకరించలేదు. హిజాబ్ ధరించడం తప్పనిసరి అని నిరూపించేందుకు తగిన మతపరమైన ఆధారాలు లేదా ప్రామాణిక గ్రంథాలను పిటిషనర్ సమర్పించలేదని కోర్టు పేర్కొంది.

**పాఠశాల డ్రెస్ కోడ్‌పై కోర్టు వ్యాఖ్యలు**

పాఠశాల యూనిఫామ్ నిబంధనలు సమానంగా, వివక్ష లేకుండా, నిజాయితీగా అమలు చేస్తూ సంస్థలో క్రమశిక్షణ, గుర్తింపును కాపాడేందుకు ఉద్దేశించినవిగా ఉంటే, డ్రెస్ కోడ్‌ను నిర్ణయించే అధికారం ప్రధానంగా పాఠశాల యాజమాన్యానిదేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను ప్రయాగ్‌రాజ్‌లోని అత్తర్సుయా ప్రాంతంలోని టాగోర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని దాఖలు చేసింది. తాను ఆరో తరగతి నుంచి హిజాబ్ ధరిస్తున్నానని, 11వ తరగతిలో ప్రవేశం సమయంలో పాఠశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసిందని ఆమె పేర్కొంది. అయితే గతంలో ఎలాంటి అభ్యంతరం లేకుండా హిజాబ్ ధరించేందుకు అనుమతించినంత మాత్రాన అదే విధానాన్ని కొనసాగించాలని పాఠశాలపై చట్టపరమైన బాధ్యత ఏర్పడదని కోర్టు స్పష్టం చేసింది. గతంలో హిజాబ్ ధరించినందుకు అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం వల్ల యూనిఫామ్ నిబంధనలను మార్చాలని లేదా సడలించాలని కోరే హక్కు ఏర్పడదని పేర్కొంటూ విద్యార్థిని పిటిషన్‌ను కొట్టివేసింది..

# సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

**అమరావతి, ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్లు ఎట్టకేలకు సమ్మెను విరమించారు. తాము సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు జూనియర్ డాక్టర్ల సంఘం తెలియజేసింది. అదే సమయంలో తమ డిమాండ్లను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టును కోరారు. రెండు వారాల్లోగా జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఏపీలో జూనియర్ డాక్టర్లు సమ్మె చేయడంపై హైకోర్టులో పిల్ దాఖలైంది.. ఇవాళ కోర్టు విచారణ చేపట్టగా.. జూనియర్ డాక్టర్లు తాము సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సమ్మెను సవాల్ చేస్తూ ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన సామాజిక కార్యకర్త రవీంద్ర కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాష్ట్రంలో 9వేలమంది జూనియర్ డాక్టర్లు సమ్మెలో పాల్గొంటున్నారని.. వెంటనే వారిపై ఎస్మా అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ తరఫున లాయర్ కోర్టును కోరారు. రాష్ట్రంలో సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుందన్నారు. జూనియర్ డాక్టర్లు డిమాండ్లపై హైకోర్టు ధర్మాసనం ఆరా తీయగా.. ఇతర రాష్ట్రాల్లో చెల్లించే స్టైఫండ్ కంటే ఎక్కువ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఏజీ తెలిపారు. వారి డిమాండ్‌ను ఆమోదిస్తే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందన్నారు. ఈ వాదనల తర్వాత జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ స్పందన ఏంటో తెలియజేయాలని హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వం ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సేవలకు ఇబ్బంది లేకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు.. జూనియర్ డాక్టర్లతో సమ్మె విరమించజేయడానికి ఏం చేస్తున్నారో తెలియజేయాలని కూడా ఆదేశించింది. అయితే ఇవాళ విచారణ జరగ్గా.. తాము సమ్మె విరమిస్తున్నట్లు జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. జూనియర్ డాక్టర్లు ప్రధానంగా మూడు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. స్టైఫండ్ 20శాతం పెంచాలని.. ప్రొఫెసర్ల పదవీవిరమణ వయసు 65 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను విరమించాలని.. నాన్ క్లినికల్ పోస్టుల్ని ఎంఎస్సీ పీహెచ్‌డీలతో కాకుండా అర్హులతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఎనిమిది నెలలుగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగామని జూనియర్ డాక్టర్లు చెబుతున్నారు. జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపినా ఫలించలేదు.. ఇంతలో ఈ అంశం హైకోర్టుకు చేరగా.. జూనియర్ డాక్టర్లు సమ్మెను విరమించారు. అయితే ఏపీ హైకోర్టు జూనియర్ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని ఆదేశించడంతో ఏపీ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది చూడాలి.

# డీఆర్డీఓ టెక్నాలజీ దేశీయ పరిశ్రమలకు బదిలీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయ పరిశ్రమకు బదిలీ చేయడానికి ఆయన ఆమోదం తెలిపారు. ఈ టెక్నాలజీ బదలాయింపుతో దేశంలోనే క్షిపణుల ఉత్పత్తికి మార్గం సుగమమైంది. గతంలో ప్రభుత్వం రంగ సంస్థల వద్ద ఉన్న ఈ టెక్నాలజీని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం ద్వారా క్షిపణుల ఉత్పత్తి మరింత పెరగనుంది. ఇదే సమయంలో కంపెనీల అర్హత, ధ్రువీకరణ, నియంత్రణ అసవరాలను బట్టి, కంపెనీలు అన్ని ప్రమాణాలు పాటించిన తర్వాతే ఈ టెక్నాలజీ షేరింగ్ ఉంటుంది. దేశంలోనే అధునాతన క్షిపణుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. అత్యవసర పరిస్థితుల్లో ఆయుధాల సరఫరాకు అంతరాయం కలగకుండా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం కీలకంగా మారనుంది. కేంద్రం నిర్ణయం వల్ల రక్షణ తయారీ వ్యవస్థ మరింత విస్తరిస్తుంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ఇతర సాంకేతిక భాగస్వాములు కూడా క్షిపణుల సప్లై చైన్‌లో భాగస్వామం అయ్యే అవకాశం ఉంది. ఇదే కాకుండా, అధునాతన రక్షణ వ్యవస్థల కోసం భారత్ విదేశీ సరఫరాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇప్పుడు డీఆర్డీవో సాంకేతికను అందించడం ద్వారా ఈ ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. దేశంలో క్షిపణి వ్యవస్థల్ని తయారు చేయడం వల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా చేయడంతో పాటు అవసరమైన సమయంలో ఆయుధాల లభ్యతను వేగంగా పెంచే అవకాశం ఉంది. ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం వల్ల రక్షణ తయారీ రంగంలో పోటీ, సాంకేతిక ఆవిష్కరణలు కూడా సాధ్యం అవుతాయి. అంతర్జాతీయ ఎగుమతి చేసే సామర్థ్యం పెరుగుతుంది.

# 30 ఏండ్ల కింద తీసుకున్న సంకల్పం నెరవేరింది

(మొదటి పేజీ తరువాయి)

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకమయ్యేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. పుష్కరాల ఏర్పాట్లపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

**10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం**

2015 మహా పుష్కరాల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించగా, 2027 పుష్కరాలకు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రోజుకు కోటి మంది వరకు పుణ్యస్నానాలు చేసే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రద్దీ నియంత్రణ, భద్రత, రవాణా, వసతి, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా మొత్తం 440 ఘాట్లను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు మరో 181 కొత్త ఘాట్లను నిర్మించనున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82, పశ్చిమగోదావరిలో 40, కోనసీమలో 175, ఏలూరులో 44, కాకినాడలో 88, పోలవరంలో 11 ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు.

**రూ.4,026 కోట్లతో 4,932 పనులు**

పుష్కరాల కోసం మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్అండ్‌బీ, జలవనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన పనులు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే రూ.899 కోట్లను ఆర్థిక శాఖ కేటాయించినట్లు వివరించారు.

జిల్లాల వారీగా చూస్తే తూర్పుగోదావరిలో 1,869, పశ్చిమగోదావరిలో 625, కోనసీమలో 1,501, ఏలూరులో 426, కాకినాడలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. పుష్కరాలకు మరో పది నెలల సమయం మాత్రమే ఉన్నందున పనుల వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని ఆదేశించారు. అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి పెట్టాలని, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా పొందాలని సూచించారు.

**ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలను పుష్కరాలతో అనుసంధానం చేస్తూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. పిఠాపురంలోని శక్తిపీఠం, పంచారామాల్లో నాలుగు క్షేత్రాలు, ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రముఖ ఆలయాలను కలుపుతూ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలతో పాటు రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా హోమ్‌స్టేలను ప్రోత్సహించాలని చెప్పారు. కొత్త హోటళ్ల నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**రాజమహేంద్రవరంలో భారీ కార్యక్రమాలు**

పుష్కరాల సందర్భంగా రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని సీఎం సూచించారు. దేశ, విదేశాల్లోని ప్రముఖులను పుష్కరాలకు ఆహ్వానించాలని, రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహించేందుకు దేవాదాయ, పర్యాటక శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పుష్కరాలను కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగా కాకుండా రాష్ట్ర ప్రతిష్టను పెంచే అంతర్జాతీయ స్థాయి వేడుకగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**రహదారులు, వంతెనలకు ప్రత్యేక ప్రాధాన్యం**

పుష్కర ఘాట్లను అనుసంధానించే రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో ఏ రహదారిపైనా గుంతలు కనిపించకూడదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును భక్తులు, పర్యాటకులు సందర్శించేలా రహదారుల అభివృద్ధి చేయాలని చెప్పారు. వంతెనల సామర్థ్యాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. హేవ్‌లాక్ బ్రిడ్జి, దాని పరిసర ప్రాంతాల్లోని దీవుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం-పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

**ఏపీ లోకాయుక్తగా మల్లిఖార్జునరావు.. చంద్రబాబు హాజరు**

ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు మంగళవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై, లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు ప్రత్యేకంగా పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

**పారదర్శకతపై చర్చ మరియు అల్పాహార విందు**

ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తయిన తర్వాత జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కొంతసేపు పరస్పరం ముచ్చటించారు. ఈ సందర్భంగా పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడం, అవినీతిని సమూలంగా నిర్మూలించడంలో లోకాయుక్త వ్యవస్థ పోషించే కీలక పాత్రను వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక అల్పాహార విందు కార్యక్రమంలో గవర్నర్, సీఎం పాల్గొని ప్రముఖులతో ముచ్చటించారు. హాజరైన ప్రముఖులు మరియు భవిష్యత్ అంచనాలు ఈ ప్రమాణ స్వీకార వేడుకకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, అలాగే న్యాయశాఖకు చెందిన ప్రముఖులు ఘనంగా హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకం ద్వారా రాష్ట్రంలో పాలన మరింత జవాబుదారీతనంతో సాగుతుందని, ప్రజా సమస్యలకు సత్వర స్పందన లభిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫీజు బకాయిలపై కాంగ్రెస్ సర్కార్‌కు డెడ్‌లైన్

**హైదరాబాద్, ఆగస్ట్ 25, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక విద్యాసంస్థలకు కనీస బకాయిలు చెల్లించడం చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ విశ్వవిద్యాలయాలను రప్పిస్తామనడం అత్యంత హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ. 15 వేల కోట్లకు చేరుకోవడంతో వేలాది ప్రైవేట్ కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని, లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం**

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని బండి సంజయ్ పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో వీరంతా ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. బకాయిలు రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులు వివక్షను, అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని మండిపడ్డారు.

**మాట తప్పడంలో బీఆర్ఎస్‌ను మించిపోయిన కాంగ్రెస్**

వన్ టైమ్ సెటిల్‌మెంట్ (OTS) కింద ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లిస్తామని, నిర్ణీత వ్యవధిలోనే నిధులు విడుదల చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించారు. హామీలిచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించిపోయిందని విమర్శించారు. కళాశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చుకోలేక, మెయింటెనెన్స్ చార్జీలు భరించలేక తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, ఫీజులు అడిగితే బెదిరింపులకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని హితవు చెప్పారు.

**"ఫీజు బకాయి – బీజేపీ లడాయి".. పోరాటం ఉధృతం చేస్తాం**

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన "ఫీజు బకాయి - బీజేపీ లడాయి" దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, ప్రజా సంఘాల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 15 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రామచంద్రరావు నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# 2 వారాల్లో లొంగిపోవాలి

(మొదటి పేజీ తరువాయి)



తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని.. లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు.

అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు.

ఆగస్టు 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి.. తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.

2013 నవంబర్‌లో గోవాలో తెహెల్కా నిర్వహించిన ఓ కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనతో పనిచేసిన జూనియర్ మహిళా ఉద్యోగిపై తేజ్‌పాల్ రెండుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. అదే నెలలో ఆయనను అరెస్టు చేశారు. 2014 జూలైలో బెయిల్ లభించింది. 2017లో విచారణ ప్రారంభం కాగా.. 2021 మేలో గోవా సెషన్స్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాల్ చేసింది. 81 పేజీల తీర్పులో హైకోర్టు ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని "వక్రీకృతమైనది"గా అభివర్ణించింది. విచారణ సందర్భంగా ఫిర్యాదుదారురాలిని వ్యవహరించిన తీరుపై కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లైంగిక దాడికి గురైన మహిళ "పర్ఫెక్ట్ బాధితురాలు"లా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే భావనకు ట్రయల్ కోర్టు లోనైందని హైకోర్టు పేర్కొంది. ఆమె వ్యక్తిగత జీవితంపై డిఫెన్స్ చేసిన వాదనలపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

**తేజ్‌పాల్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష**

బాంబే హైకోర్టు భారతీయ శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చింది. విశ్వాసం లేదా అధికార స్థితిని ఉపయోగించి అత్యాచారానికి పాల్పడినందుకు సంబంధించిన సెక్షన్ 376(2)(f)తో పాటు లైంగిక వేధింపులు, దుస్తులు విప్పే ఉద్దేశంతో దాడి లేదా క్రిమినల్ ఫోర్స్‌కు సంబంధించిన సెక్షన్లు 354(a), 354(b) కింద కూడా దోషిగా నిర్ధారించింది. ఆయనకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షలకు పైగా జరిమానా విధించింది. తొలుత రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించిన హైకోర్టు.. ఆయన న్యాయవాదుల అభ్యర్థన మేరకు ఆ గడువును నాలుగు వారాలకు పొడిగించింది. దీంతో సెప్టెంబర్ మొదటి వారంలో ఆయన లొంగిపోవాల్సి ఉంది. సెక్షన్ 376(2)(f) కింద గరిష్ఠంగా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. తేజ్‌పాల్‌కు విధించిన శిక్షను జీవిత ఖైదుకు పెంచాలని కోరుతూ గోవా ప్రభుత్వం విడిగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ శిక్ష పరిమాణానికి మాత్రమే పరిమితమైంది. అలాగే శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని కూడా ప్రభుత్వం సవాల్ చేసింది. అయితే సంఘటన జరిగి చాలా కాలం గడిచిపోవడం, ఆ తర్వాత ఎలాంటి నేరపూరిత ప్రవర్తనకు పాల్పడినట్లు

ఆధారాలు లేకపోవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు జీవిత ఖైదు విధించేందుకు నిరాకరించింది. శిక్ష ఖరారు చేసే సమయంలో తేజ్‌పాల్ తనకు క్షమాభిక్ష చూపాలని కోరుతూ.. తాను "రాజకీయ బాధితుడిని" అని పేర్కొన్నారు. తాను ఇద్దరు కుమార్తెలకు తండ్రినని కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే గోవా ప్రభుత్వం తరఫున తుషార్ మెహతా గరిష్ఠ శిక్ష విధించాలని కోరుతూ.. "నో అంటే నో" అనే సందేశం బలంగా వెళ్లాల్సిన అవసరం ఉందని వాదించారు.

# గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్‌తో
# జెన్‌జీ సమావేశం..

**- యువత ప్రశ్నలకు ఆలోచింపజేసేలా 'కూల్ గురు' సమాధానాలు..!**



భయంగా ఉన్నప్పటికీ ఏదైనా స్థిరమైన నిర్ణయం తీసుకోవాలంటే ఏం చేయాలి? విజయం సాధించాలనే పరుగు పందెంలో చిక్కుకోకుండా ఆశయాలను ఎలా కొనసాగించాలి? మన ఆలోచనలను తల్లిదండ్రులు అర్థం చేసుకోలేకపోతే వారికి అర్థమయ్యేలా ఎలా వివరించాలి? డబ్బు, విలాసవంతమైన జీవితం, విజయవంతమైన కెరీర్.. ఇవన్నీ కోరుకుంటూనే ఆధ్యాత్మికంగా ఉండటం సాధ్యమేనా? నేటి యువత మదిలోని ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ సమాధానాలు చెప్పారు. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయం కేంద్రం దీనికి వేదికైంది.

బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో శనివారం 2,000 మందికి పైగా జెన్‌జి యువత గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను వారు ఆధ్యాత్మిక గురువుతో పంచుకున్నారు. యువతరం 'కూల్ గురు' అని ప్రేమగా సంబోధించే గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ వారి ప్రశ్నలకు ఎంతో సూటిగా, చమత్కారంగా, అదే సమయంలో లోతైన ఆలోచనలను రేకెత్తించేలా సమాధానాలు ఇచ్చారు. గురుదేవ్ తన సమాధానాలతో యువత ముఖాల్లో చిరునవ్వులు పూయించడంతోపాటు.. వారిలో స్ఫూర్తిని నింపారు.

సాధారణ ఆధ్యాత్మిక సమావేశాలకు భిన్నంగా.. పాటలు, కేరింతలు, నవ్వులు, సంగీతం మధ్య ఈ సమావేశం ఎంతో ఉత్సాహంగా సాగింది. డబ్బు సంపాదించడం, మానవ సంబంధాలు, ఆశయాలు, జీవితంలో పైకి ఎదగడం లాంటి ఎన్నో అంశాలపై యువత గురుదేవ్‌ను ప్రశ్నలు అడిగి తమ అనుమానాలు నివృత్తి చేసుకున్నారు.

భయం లేకుండా స్థిరమైన నిర్ణయం తీసుకోవడం గురించి గురుదేవ్ మాట్లాడుతూ.. కఠినత్వానికి తావు ఇవ్వవద్దని జెన్‌జీకి సూచించారు. "మీరు ఒక నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అదే సమయంలో మారేందుకు కూడా అనువుగా ఉండాలి" అని సూచించారు. 'మన తర్కం మన జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది, అయితే మన జ్ఞానం ఎప్పుడూ పరిమితమే. జ్ఞానం పెరిగే కొద్దీ మన దృక్కోణం కూడా మారుతుంది. మనకు తెలిసిన విషయాలపై దృఢంగా నిలబడుతూనే.. కొత్త విషయాలను తెలుసుకునేందుకు మన మనసును తెరిచి ఉంచడమే సమతుల్యత' అని ఆయన వివరించారు.

ఎప్పుడూ ఏదో ఒకటి సాధించాలనే ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరానికి, అంతర్గత ప్రశాంతతను కోల్పోకుండా ఆశయాలను కొనసాగించడం ఎలా? అనే ప్రశ్నకు.. ధ్యానం ద్వారా ఇది సాధ్యపడుతుందని గురుదేవ్ సమాధానం ఇచ్చారు.

తల్లిదండ్రులను బాధపెట్టకుండా, తాము ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా తమ ఆలోచనలను వారికి అర్థమయ్యేలా ఎలా చెప్పాలనే ప్రశ్నకు గురుదేవ్ స్పందిస్తూ.. పూర్తిగా తమ మాటే నెగ్గాలనే పంతం కంటే, పట్టు విడుపులు ఉండాలని సూచించారు. "కొన్నిసార్లు వాళ్ల మాట నెగ్గనీయండి, కొన్నిసార్లు మీది కూడా," అని ఆయన అన్నారు. "అదే మీ బలం" అని ఆయన చమత్కరించారు.

ఆధ్యాత్మికతకు, విజయానికి మధ్య ఏదైనా విరోధం ఉందా? అనే ప్రశ్నకు.. ఈ రెండింటి మధ్య అసలు విరోధం లేదని గురుదేవ్ స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత మనలో స్థైర్యాన్ని, అంతర్ దృష్టిని, వైఫల్యాల నుంచి తిరిగి కోలుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది. తద్వారా వృత్తిపరమైన విజయాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన చెప్పారు. మన ఆశయాలకు నైతికమైన మార్గదర్శకత్వాన్ని, దిశను కూడా ఆధ్యాత్మికత అందిస్తుందన్నారు. 'మిమ్మల్ని ఎవరైనా మోసం చేయాలని మీరు కోరుకోరు కదా? అలాంటప్పుడు మీరు కూడా ఇతరులను ఎందుకు మోసం చేయాలి?' అని గురుదేవ్ ప్రశ్నించారు.

ఇష్టమైన రంగంలో కొనసాగడమా? లేకపోతే ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాన్ని ఎంచుకోవడమా? అనే జెన్‌జీ తరం ప్రశ్నకు ఆయన ఆచరణాత్మకంగా సమాధానం ఇచ్చారు. "మీ అభిరుచిని మీ నుంచి ఎవరూ లాగేసుకోలేరు. కానీ ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగం లభించడం కూడా కష్టమే. కాబట్టి ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాన్ని ఎంచుకొని.. మీ అభిరుచిని కూడా కొనసాగిస్తూ.. మీరు చేయాలని అనుకున్నది చేయండి'' అని ఆయన సూచించారు.

**ఆర్ట్ ఆఫ్ లివింగ్‌పై ఆరోపణలను కొట్టేసిన సుప్రీంకోర్టు..**

ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 2016లో నిర్వహించిన 'వరల్డ్ కల్చర్ ఫెస్టివల్' సమయంలో యమునా నదీ మైదాన ప్రాంతాల పర్యావరణానికి నష్టం వాటిల్లిందనే ఆరోపణలపై గత పదేళ్లుగా జరిగిన విచారణలో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థపై వేసిన ఆరోపణలను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గతంలో వెలువరించిన తీర్పును, దానికి సంబంధించిన మధ్యంతర ఉత్తర్వులను పూర్తిగా నిలిపేసింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిర్వహించిన కార్యక్రమం వల్ల యమునా నది వరద మైదానాలకు ఎలాంటి నష్టం వాటిల్ల లేదని పేర్కొన్న సుప్రీం కోర్టు.. ఆ కార్యక్రమం కోసం డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్లను పూర్తిగా తిరిగి పొందేందుకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు హక్కు ఉందని స్పష్టం చేసింది. ఆ డిపాజిట్ మొత్తాన్ని అపరాధ రుసుముగా చూపడాన్ని కూడా న్యాయస్థానం తప్పుబట్టింది.

2016వ సంవత్సరంలో యమునా నది తీరంలో జరిగిన ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం (వరల్డ్ కల్చర్ ఫెస్టివల్) అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 155 దేశాలకు చెందిన 35 లక్షల మందికిపైగా ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సి. లహోటి అధ్యక్షత వహించారు. ఆధ్యాత్మికత, వృత్తిపరమైన విజయాల మధ్య సంబంధంపై గురుదేవ్ చెప్పిన సమాధానం పట్ల మీ అభిప్రాయం ఏమిటి? మీ ఆలోచనలను కామెంట్లలో తెలియజేయండి.

# దొంగతనానికి వెళ్లి మధ్యలో టీ పెట్టుకున్న దొంగ..
# గిన్నెలు కూడా కడిగి పరార్



పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా ధూరి పట్టణంలో అత్యంత వింతైన, వినూత్నమైన దొంగతనం సంఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా దొంగలు.. ఎవరైనా చూస్తారనే భయంతో చోరీ చేసి వీలైనంత త్వరగా పారిపోవాలని చూస్తారు. కానీ ఈ కేడీ దొంగ మాత్రం ఏమాత్రం హడావుడి లేకుండా, చాలా ప్రశాంతంగా నాలుగు షాపుల్లో దొంగతనానికి పాల్పడ్డాడు. కేవలం రెండు గంటల వ్యవధిలోనే నాలుగు దుకాణాల్లో వరుస చోరీలకు పాల్పడటమే కాకుండా.. దొంగతనం మధ్యలో హాయిగా టీ కాచుకుని తాగి తన దాహాన్ని తీర్చుకున్నాడు. అంతేకాకుండా ఆ గిన్నెలు కడిగేసి మరీ వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

**ఫ్రిజ్ తెరిచి పాలు తీశాడు.. చాయ్ పెట్టుకుని గిన్నెలు కూడా కడిగి!**

శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. దొంగ పక్కపక్కనే ఉన్న షాపుల పైకప్పుల గుండా వచ్చి, పైన ఉన్న గేటును పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. మొదట స్వరణ్‌జిత్ సింగ్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో చొరబడి దాదాపు రూ. 27,000 నగదుతో పాటు వ్యవసాయ పరికరాలను ఎత్తుకెళ్లాడు. ఆ తర్వాత సిమ్రన్‌జిత్ సింగ్ అనే వ్యాపారికి చెందిన షాపులోకి చేరుకున్నాడు. సిమ్రన్‌జిత్ సింగ్ షాపులో చోరీ చేస్తున్న సమయంలో ఆ దొంగకు టీ తాగాలనిపించింది. దీంతో ఏమాత్రం భయం లేకుండా అక్కడ ఉన్న ఫ్రిజ్ తెరిచి పాలు బయటకు తీశాడు. ఆ తర్వాత స్టవ్ వెలిగించి.. సొంతంగా టీ తయారు చేసుకుని ప్రశాంతంగా కూర్చుని తాగాడు. టీ తాగడం పూర్తయ్యాక.. తాను ఉపయోగించిన పాత్రలను శుభ్రంగా కడిగి యథాస్థానంలో ఉంచడం గమనార్హం. అనంతరం మళ్లీ తన దొంగతనాన్ని కొనసాగించాడు. ఈ దృశ్యాలన్నీ అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డు అయ్యాయి.

సొత్తుతో పాటు సీసీటీవీ హార్డ్ డిస్క్‌ల అపహరణ

ఈ విచిత్ర చోరీపై షాపు యజమాని సిమ్రన్‌జిత్ సింగ్ మాట్లాడుతూ.. తన దుకాణంలోని కౌంటర్లను పగలగొట్టి సుమారు రూ. 1,500 నగదుతో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను దొంగ ఎత్తుకెళ్లాడని తెలిపాడు. ఈ విధంగా వరుసగా

నాలుగు షాపుల్లోకి చొరబడిన ఆ చోరశిఖామణి భారీగా నగదు, మొబైల్ ఫోన్లు, డ్రిల్లింగ్ మెషీన్లు ఇతర విలువైన వస్తువులను ఊడ్చేశాడు. తన ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు రెండు షాపుల్లోని సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేయడమే కాకుండా.. అన్ని షాపులకు చెందిన హార్డ్ డిస్క్‌లను కూడా తనతో పాటు పట్టుకెళ్లాడు. ఈ ఘటనపై ధూరి ఎస్‌హెచ్‌ఓ రమణ్‌దీప్ సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా ఆ గుర్తు తెలియని దొంగను గుర్తించేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# రిజర్వేషన్ల అంతానికి మోదీ సర్కారు కుట్ర

8.2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను ప్రస్తావిస్తూ ఖర్గే ఆరోపణ

దిల్లీ: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి.

2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. 'ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉంద'ని పేర్కొన్నారు.

విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.



## ఉత్తరాఖండ్ అడవుల్లో అరుదైన సాలీడు లభ్యం

ఉత్తరాఖండ్‌లోని పశ్చిమ హిమాలయ అడవుల్లో ఒక కొత్త సాలీడు జాతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ స్పైడర్ (సాలీ పురుగు) శరీరంపై నవ్వుతున్న మనిషి ముఖాన్ని పోలిన రంగురంగుల గుర్తులు ఉన్నాయి. అందుకే ఈ సాలీడుకు 'హిమాలయన్ హ్యాపీ ఫేస్ స్పైడర్'(థెరిడియన్ హిమాలయానా) అని శాస్త్రవేత్తలు నామకరణం చేశారు. ఈ సాలీడులో 32 రకాల రంగుల వేరియేషన్స్ (మార్పులు) గుర్తించారు. ఇది చూడటానికి హవాయి దీవుల్లో ఉండే హ్యాపీ ఫేస్ సాలీడులా ఉన్నప్పటికీ, డీఎన్ఏ పరీక్షల ద్వారా ఇది వేరే జాతికి చెందినదిగా తేలింది. డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రీజినల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ సైంటిస్టులు ఈ అరుదైన సాలీడును గుర్తించారు. ముఖ్యంగా దీని ఉదరంపై ఎరుపు, నలుపు, తెలుపు గుర్తులు ఉన్నాయి. చమోలి జిల్లాలోని హిమాలయ అడవుల్లో ఒక సర్వే చేపడుతుండగా ఈ కొత్త సాలీడు బయటపడింది. సైంటిస్టులు మగ, ఆడ జాతులకు చెందిన మొత్తం 61 సాలీడు నమూనాలను అధ్యయనం చేశారు. అయితే ఈ హ్యాపీ ఫేస్ స్పైడర్ సుమారు 2,000 2,200 మీటర్ల ఎత్తులో ఉన్న అడవిలో కనిపించింది.



## ఈవీఎంలకు ఇంటర్నెట్‌తో అనుసంధానం ఉండదు: జ్ఞానేశ్ కుమార్

భారత ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)పై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఈవీఎంలను ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని, వీటికి ఇంటర్నెట్, బ్లూటూత్, వైఫై కనెక్టివిటీ లాంటి సదుపాయాలు ఏవీ ఉండవని స్పష్టం చేశారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, సోమవారం లఖ్‌నవూలోని చారిత్రాత్మక కాల్విన్ తాలూక్‌దార్ కాలేజీ విద్యార్థులతో ముచ్చటించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల విశ్వసనీయత, యువ ఓటర్ల ప్రాధాన్యంపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు సంబంధించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశంలో సుమారుగా 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల సంఘంతో కోటి 80 లక్షల మంది పనిచేస్తున్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో, విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు, లేదా ఇతరులతో దాన్ని పంచుకునే ముందు, కచ్చితంగా దాని మూలాలను, ప్రామాణికతను సరిచూసుకోవాలని సీఈసీ సూచించారు.



## లోహ మిశ్రమాల కోసం 'ఏఐ' ఇంటెలిజెన్స్ ప్లాట్ఫామ్

**- రూపొందించిన ఐఐటీఎం పరిశోధకులు**



**ఈవీ, ఏరోస్పేస్, పునరుత్పాదక ఇంధన రంగాల కోసం లోహ మిశ్రమాలను కనుగొనడానికి 'అలాయ్ తత్వసర్' అనే సరికొత్త ఏఐ ప్లాట్ఫామ్‌ను ఐఐటీ మద్రాస్ (ఐఐటీఎం) పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఇందుకోసం లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) సాయంతో 10వేలకు పైగా పరిశోధనాపత్రాల్లోని వివరాలతో భారీ డేటాబేస్‌ను రూపొందించారు. ఈ ఏఐ ఫ్రేమ్‌వర్క్ ద్వారా శాస్త్రవేత్తలు, తయారీదారులు చాలా వేగంగా పర్యావరణ అనుకూలమైన, అధిక సామర్థ్యం కలిగిన లోహాలను గుర్తించవచ్చు. డేటాబేస్‌లు, సహాయక సాఫ్ట్‌వేర్‌లను అల్లాయ్ తత్వసర్ ప్లాట్ఫామ్ https://alloy.tattvasar.com, గిట్ హబ్ ద్వారా ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐఐటీ మద్రాస్ ఫ్యాకల్టీ డాక్టర్ రోహిత్ బాత్రా నేతృత్వంలో డ్యూయల్ డిగ్రీ విద్యార్థి అరవిందన్ కామాక్షి సుందరం, రీసెర్చ్ ఇంటర్న్ మోహిత్ చక్రబర్తి, సాయి మణికుమార్ దేవతి, డాక్టోరల్ స్కాలర్ బి. పబిత్రామోహన్ ప్రుస్టీ ఈ పరిశోధనలో పాలుపంచుకున్నారు.**

## రాజకీయ సన్యాసం తీసుకోను



భారతీయ జనతా పార్టీని కనుమరుగు చేసే వరకూ విశ్రమించబోనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. రాజకీయ సన్యాసం స్వీకరించబోననీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల లోపే భాజపా నిజ స్వరూపం ఏమిటో ప్రజలకు అర్థమయ్యిందని తెలిపారు. ఆర్థిక సాయం అందించే 'అన్నపూర్ణ భండార్' పంపిణీలో జాప్యంపై మహిళల నిరసనల సందర్భంగా 'ఫేస్‌బుక్' ద్వారా నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో మమత మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## భిక్షాటన చేస్తూ రూ.8.40 లక్షలు దాచిన వృద్ధురాలు.. చివరికి!



భిక్షాటన చేస్తూ ఓ వృద్ధురాలు రూ.8.40 లక్షలు దాచిపెట్టిన ఘటన కర్ణాటకలోకి మాండ్య జిల్లాలో చోటుచేసుకుంది. ఆమె చనిపోయాక ఇంట్లో డబ్బు సంచులు చూసి అంతా ఆశ్చర్యపోయారు. హూర్ (28) అనే వృద్ధురాలు తన సోదరితో కలసి భిక్షాటన చేస్తూ జీవించేవారు. వీరిద్దరూ వివాహం చేసుకోలేదు. రెండేళ్ల కిందట తన సోదరి చనిపోగా అప్పటినుంచి హూర్ ఒంటరిగానే ఉంటున్నారు. ఆదివారం ఆమె కన్నుమూశారు. దీంతో ఆమె ఇంటికి వెళ్లిన బంధువులు రూ.10 రూ.20 నోట్లతో 30 సంచుల్లో డబ్బు, వేల సంఖ్యలో నాణేలు గుర్తించారు. చివరికి ఆమ డబ్బంతా బంధువుల పాలైంది.

## భారత సంస్కృతిని నిందించడం జన్మహక్కుగా భావిస్తున్న రాహుల్

**- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆక్షేపణ**



మనుస్మృతిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించడాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా తప్పుపట్టారు. దేశ సంస్కృతిని నిందించడం తన జన్మహక్కుగా రాహుల్ భావిస్తున్నారని ఆక్షేపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఆయన తన బాధ్యతలను విస్మరిస్తున్నారన్నారు. అర్బన్ నక్సల్స్ విధానంతో దేశ యువత భవిష్యత్తును ఎందుకు నాశనం చేయాలని కోరుకుంటున్నారని ప్రశ్నించారు. ''వ్యక్తిగతంగా మీ నుంచి దేశం ఏమీ ఆశించడంలేదు. కానీ పార్లమెంటులో ప్రతిపక్షనేత ఉన్న మీరు దేశ ప్రజాస్వామ్యానికి జవాబుదారీగా ఉండాలి. రాజ్యాంగంపై మీరు ప్రమాణం చేశారు. ఆపై దేశ సంప్రదాయాలు, సంస్కృతిని నిందించటం మీ జన్మహక్కుగా భావిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ వెలుపల ఈ రాష్ట్రాన్ని అవమానిస్తారు. విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ మన దేశాన్ని విమర్శిస్తారు. సరిహద్దుల్లో శత్రువులపై భారత సైన్యం పోరాడుతుంటే సైనికులను రుజువులు కోరతారు. ఉగ్రవాదంపై దేశం పోరాడుతుంటే.. మీరు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జాతి వ్యతిరేకులను ప్రోత్సహిస్తారు. అయోధ్య విషయానికి వస్తే.. రాముడి అస్తిత్వంపై ప్రశ్నలు సంధిస్తారు. ప్రజాస్వామ్యం పట్ల మీ నిబద్ధత ఏంటి? 1975 అత్యవసర పరిస్థితి సమయంలో మీపార్టీ వైఖరిని దేశం చూసింది. మీరు (రాహుల్) మను, రాముడు, దేశ సంస్కృతిని విమర్శించారు. మీరు మను గురించి తెలుసుకోవాలనుకుంటే అథర్వణవేదం, శతపథ బ్రాహ్మణ, మత్స్యపురాణం వంటి గ్రంథాలు చదవండి. అప్పుడు మీకు తగిన సమాచారం లభిస్తుంది'' అని యోగి సూచించారు.



## ఏఐ ఎలా ఆలోచిస్తోంది?

కృత్రిమ మేధ మనిషికంటే వేగంగా రాసేస్తోంది, విశ్లేషిస్తోంది, పరిశోధనలకు తోడ్పడుతోంది, తర్కంతో ప్రతిస్పందిస్తోంది. ఏఐ గురించి ఇంతకాలం చర్చకు వచ్చిన అంశాలు దాని సామర్థ్యాలు మాత్రమే. ఇటీవలి ఉదంతాలతో ఏఐపై చర్చ మరో దిశకు మళ్లింది. ఏఐ ఎంత తెలివైనది? అన్న ప్రశ్న స్థానంలో అసలు కృత్రిమ మేధ ఎలా ఆలోచిస్తోంది, ఎలా ప్రవర్తిస్తోంది? వంటి ప్రశ్నలు ముఖ్యమవుతున్నాయి.

ఒక పని అప్పగిస్తే, ప్రతి దశలో మనిషి పర్యవేక్షణ లేకుండా, స్వయంగా ఆలోచించి, నిర్ణయాలు తీసుకుని, ఆ పనిని పూర్తి చేయడానికి ప్రయత్నించే కృత్రిమ మేధ ప్రతినిధి వ్యవస్థను 'ఏఐ ఏజెంట్' అంటారు. సైబర్ భద్రతా సామర్థ్యాలను పరీక్షించేందుకు చాట్ జీపీటీ మాతృసంస్థ 'ఓపెన్ ఏఐ' ప్రయోగాలు చేస్తున్న సమయంలో ఒక ఏఐ ఏజెంట్ తన పరిమిత ప్రయోగ క్షేత్రం నుంచి బయటికి వెళ్లిపోయింది. ఆ సమస్యకు సంబంధించిన సమాచారం సులభంగా దొరుకుతుందని భావించి, ప్రముఖ ఏఐ వేదిక 'హగ్గింగ్ ఫేస్' వ్యవస్థల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. అంటే- తనకు ఇచ్చిన సమస్యలను నిజాయతీగా పరిష్కరించకుండా దొడ్డిదారి వెతికిందన్న మాట. పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించాలనే లక్ష్యంతో తాను స్వయంగా చదవకుండా, జవాబు పత్రం కోసం టీచర్ గదిలో వెతికిన విద్యార్థిలా ప్రవర్తించిందా ఏఐ ఏజెంట్. మేధస్సు వేరు, వివేకం వేరు అనే సత్యాన్ని గుర్తుచేసిన ఈ ఘటన ఏఐ భద్రత, నైతికత, నియంత్రణలపై కొత్త చర్చకు తెరతీసింది. ఆ మధ్య మరో ప్రముఖ ఏఐ సంస్థ తమ ప్రయోగాత్మక నమూనాలను పరీక్షించే క్రమంలో అవి వాస్తవ సంస్థల కంప్యూటర్ వ్యవస్థల్లోకి ప్రవేశించిన సందర్భాలను వివరించింది. కొన్ని ఏఐ నమూనాలు తమ అస్తిత్వానికి భంగం కలిగించే ప్రయత్నాలను అడ్డుకునేందుకు వ్యూహాలు అన్వేషించాయని, లక్ష్యసాధన కోసం అవి అనూహ్య మార్గాలను ఎంచుకున్నాయని తెలిపింది. ఇవన్నీ నియంత్రిత ప్రయోగ వాతావరణంలో జరిగినవే అయినప్పటికీ, ఏఐ పురోగతి సరికొత్త దశలోకి ప్రవేశిస్తోందనడానికి వీటిని సూచికలుగా చూడవచ్చు.

### మనిషి ప్రవర్తనతో పోలికలు

ప్రాణ చైతన్యం, జీవితానుభవం లేకపోయినా, కొన్ని అంశాల్లో కృత్రిమ మేధకూ, మనిషి ఆలోచనా విధానానికీ పోలికలు కనిపిస్తాయి. సమాచారంలోని క్రమాన్ని గుర్తించడం, తర్వాత రాగల పదాన్ని ఊహించడం, లేని విషయాన్ని ఉన్నట్లుగా భ్రాంతి చెంది తప్పు సమాధానాన్ని ఇవ్వడం వంటివి ఏఐ మౌలిక లక్షణాలు. మనిషిలో కూడా ఇలాంటివి కనిపిస్తాయి. కొన్నిసార్లు ఆకాశంలో మేఘాల అమరిక తెలిసిన ఆకారాల్లా కనిపించడం, యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనల్లో కూడా ఏదో ఒక సంబంధాన్ని వెతకడం, పూర్తి సమాచారం లేకపోయినా ఏదో ఒక నిర్ణయానికి వచ్చేయడం, పక్షపాత వైఖరి, నిర్ణయాలను ప్రభావితం చేయడం మొదలైనవి అలాంటివే. తెర వెనక జరిగే ప్రక్రియ భిన్నమైనప్పటికీ ఇవన్నీ మనిషి మనసుకూ, కృత్రిమ మేధకూ ఉన్న సామ్యాలు అని చెప్పవచ్చు. ఇంకా లోతైన అంశం ఏంటంటే- ఎలాగోలా లక్ష్యాన్ని సాధించడమే ముఖ్యం అని భావించి; దాన్ని చేరుకునే మార్గం సక్రమమైనదా, నైతికమైనదా అన్న కీలక ప్రశ్నను విస్మరించడం. ఫలితంపైనే దృష్టిపెట్టి సాధించే మార్గం ఎలాంటిదనే కీలక విషయాన్ని పక్కన పెట్టడమన్నమాట. కొన్నిసార్లు ఏఐ నమూనాలు కూడా ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. ఏఐకి ఏ స్వార్థం, దురుద్దేశాలు లేకున్నా, లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో రకరకాల షార్ట్‌కట్‌లను వెదుకుతోంది. ఏఐని మనిషి మేధస్సే సృష్టించింది. అది మనిషి అందించిన సమాచారంపైనే శిక్షణ పొందింది. అందుకే దానిలో కనిపిస్తున్న కొన్ని లక్షణాలు మనిషి ప్రవర్తనను ప్రతిబింబించడంలో ఆశ్చర్యం లేదు. దీని విపరిణామాలను మనిషే భరించాల్సి ఉంటుంది. పాశ్చాత్య సాహిత్యంలోని ఫ్రాంకిన్‌స్టయిన్ నవల, మన పురాణాల్లోని భస్మాసురుడి కథ- ఈ రెండూ వేర్వేరు సంస్కృతులకు చెందినవైనా అవి ఇచ్చే సందేశం ఒకటే. అసలు ఇబ్బంది సృష్టించిన శక్తితో కాదు; దాని రూపకర్త నిర్దేశించిన విలువలు, పరిమితులు, బాధ్యతలతోనే. స్వయంచాలకంగా పనిచేసే అత్యాధునిక కృత్రిమ మేధపై అదుపు కోల్పోతే మానవాళికి దీర్ఘకాలిక ప్రమాదాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### నేర్పించడమే సవాలు

సాంకేతిక ప్రగతి అనేది నైతిక చర్చలు, నియంత్రణ చర్యలకంటే వేగంగా ముందడుగు వేస్తుందనే విషయాన్ని చరిత్ర గుర్తుచేస్తుంటుంది. అణు శక్తి, పారిశ్రామిక విప్లవం, సోషల్ మీడియా వంటి సాంకేతిక శక్తులు మొదట్లో అద్భుతంగా కనిపించాయి. సామర్థ్యం పెరుగుతూ వెళ్లింది. వాటి దుష్ఫలితాలపై అవగాహన, చర్చ మొదలవ్వడానికి దశాబ్దాలు పట్టింది. ఆ తర్వాతే బాధ్యత, నియంత్రణ వైపు అడుగులు పడ్డాయి. ఏఐ విషయంలో ఈ అంతరం బాగా తగ్గింది. నేడు ప్రపంచవ్యాప్తంగా ఏఐ నియంత్రణపై చర్చలు, చర్యలు వేగం పుంజుకున్నాయి. శక్తిమంతమైన ఏఐ నమూనాలకు స్వతంత్ర భద్రతా పరీక్షలు, ప్రయోగ ఫలితాలు, ఘటనలపై పారదర్శక నివేదికలు, బాధ్యతాయుత ఏఐ అభివృద్ధి వంటి అంశాలపై అనేక దేశాల్లో చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు, ఏఐని అతిగా నియంత్రిస్తే పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఎదుగుదల మందగించే ప్రమాదం ఉందనే వాదనలూ ఉన్నాయి. ఏఐ మనిషిని అనుకరిస్తోందా అనే ప్రశ్నకంటే, మనిషి తనకు తెలియకుండానే తనలోని ఎలాంటి లక్షణాలను కృత్రిమ మేధలో నాటుతున్నాడనే ప్రశ్న ముఖ్యమైనది. యుద్ధాలు, కాలుష్యం, వాతావరణ మార్పులు, అసత్య సమాచార వ్యాప్తి లాంటి సమస్యలతో మానవాళి నేడు సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో మనిషి తానే పూర్తిగా ఆచరించలేకపోతున్న విలువలు, పారదర్శకత, బాధ్యత, నైతికత, వివేకం వంటివాటిని కృత్రిమ మేధకు ఎలా నేర్పాలన్నదే అసలైన సవాలు. దీనికి మనమిచ్చే సమాధానం- ఏఐ భవితనే కాదు, మానవ నాగరికత దిశను, గమ్యాన్నీ నిర్ణయించే అవకాశం ఉంది.



# ఏఐతో ముప్పు మన జ్ఞానానికి కాదు..!

**మనిషికి ఒక గొప్ప చెత్త లక్షణం ఉంది. తను ఒకటి సృష్టిస్తాడు. దానికే భయపడతాడు. దాన్ని నిర్మూలించాలనుకుంటాడు. దానికే బానిసవుతాడు. మనిషిది విజయాల చరిత్ర కాదు. భయాల చరిత్ర. నిప్పును, యంత్రాన్ని, కరెంటును, టెలిఫోన్‌ను, కంప్యూటర్‌ను, మొబైల్ ఫోన్‌ను, రోబోను చూసి భయపడ్డాడు. ఇప్పుడు ఏఐని చూసి భయపడుతున్నాడు. ప్రతి కొత్త ఆవిష్కరణ మనిషిని అనివార్యంగా అభద్రతలోకే నెట్టింది. ఇది వచ్చాక నేను ఏమవుతాను? అని ప్రతిసారీ మనిషి భయం. కానీ విచిత్రమేమిటంటే కొన్ని వేల సంవత్సరాలుగా ఆ ప్రశ్న పదే పదే అడుగుతూనే మనిషి ఇంకా అదే వలయంలో చిక్కుకున్నాడు. మారింది అతని పని, పనిముట్టు, వేగం, జీవన విధానం. కానీ మనిషి ఏ దశలోనూ ధ్వంసం కాలేదు. ముద్రణ యంత్రం, రైలు, విద్యుత్తు, ఫోటోగ్రఫీ, సినిమా, ఏటీఎం, ఇంటర్నెట్, గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ వరకూ ప్రతి దశలో అదే భయం.ఏఐ గురించిన చాలా భయాలు మనకు వినపడుతున్నాయి. అయితే, అనవసరంగా తీవ్రంగా భయపడుతున్నారు. నిజంగా భయపడాల్సిన కోణం అది తాగుతున్న నీరు గురించి. ఏఐ నీటి వాడకం పర్యావరణానికి చేయబోతున్న ముప్పు గురించి. అది సర్వర్లను చల్లబరచడానికి తాగుతున్న నీళ్ల క్వాంటిటీ గురించి భయపడాలి. కొన్ని లక్షల టీఎంసీల నీరు ఏఐ తాగేస్తోందన్నది చాలామందికి తెలియని నిజం. ఆ నీళ్లు లేకుంటే ఏఐ సమాధానాలు చెప్పలేదన్నదీ నిజం. అయితే ఆ నీళ్ల వినియోగం వల్ల వచ్చే ముప్పు ఎంత, దానికి పరిష్కారం ఏమిటి?**

నిజానికి ఏఐ నీటిని తాగడం సమస్యేనా? మనిషి తాగే నీటినే ఏఐకి ఇవ్వాల్సి వచ్చే విధంగా దాన్ని నిర్మిస్తే అది సమస్య కాదా? సముద్రంలోని ఉప్పు నీటిని ఈ చల్ల బరచడానికి వాడడం సాధ్యమా అనే విషయాల గురించి ఆలోచించాలి. తాగు నీరు కాకుండా, భూజలం కాకుండా ఏ నీటిని సర్వర్ల కోసం వాడాలి అనేది తెలుసుకోవల్సిందీ తేల్చాల్సిందీ మనిషే. సాంకేతికతకు దాహం ఉండదు. దాన్ని ఎక్కడ నిర్మించాలి, ఏ నీటితో చల్లబరచాలి, మనిషి అవసరానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి అనేది నిర్ణయించేది మనిషే. అంటే ఏఐ నుంచి వచ్చే ముప్పు కూడా చివరికి ఏఐ తెలివిలో కాదు, మనిషి తీసుకునే తెలివి తక్కువ నిర్ణయాల్లో ఉందనమాట!

ఇక ఏఐ గురించిన మనిషి ఇంకో భయం దాని జ్ఞానం. అయితే భయాన్ని జయించడం అంటే దాన్ని నాశనం చేయడం కాదు, అర్థం చేసుకోవడం. నిప్పు మనిషి మొదటి భయం, మొదటి స్నేహితుడు కూడా. మొదట దాన్నుంచి పారిపోయాడు. తర్వాత అర్థం చేసుకున్నాడు. చివరకు అదే నిప్పుతో ఆహారం వండుకున్నాడు, చలిని తరిమాడు, చీకటిని జయించాడు. చక్రం మనిషి కాళ్లకు సవాలుగా వచ్చింది. కానీ కాళ్లను నిరుపయోగం చేయలేదు. చేరలేని దూరాలకు తీసుకెళ్లింది. యంత్రానికి వేగం ఉండొచ్చు, గమ్యం మాత్రం మనిషిదే. పారిశ్రామిక విప్లవంతో యంత్రాలు వచ్చాక ఉద్యోగాలు పోతాయని కార్మికులు భయపడ్డారు. Luddites యంత్రాలను ధ్వంసం చేశారు. వారి భయం యంత్రాల మీద మాత్రమే కాదు. జీవనోపాధి కోల్పోతామన్న ఆందోళన మీద.

ఇప్పుడు ఏఐ విషయంలోనూ అదే ప్రశ్న- మా ఉద్యోగాలేమవుతాయి అని. చరిత్ర చెప్పేది మాత్రం స్పష్టం. కొన్ని పనులు పోతాయి, కొత్త పనులు పుడతాయి. ప్రొక్లెయిన్ వందమంది పని ఒక్క యంత్రంతో చేసింది. కానీ అదే యాంత్రీకరణ రోడ్లు, కాలువలు, ఆనకట్టలు, భారీ నిర్మాణాలను వేగవంతం చేసింది. యంత్రం మనిషిని అవమానించలేదు. అతని కఠిన శ్రమను తగ్గించింది. రాత వచ్చినప్పుడు జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని భయపడ్డారు. ఇప్పుడు గూగుల్, స్మార్ట్ ఫోన్, ఏఐ గురించి కూడా అదే భయం. వ్యంగ్యం ఏమిటంటే రాత జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుందని చెప్పిన మాట కూడా మనకు రాత ద్వారానే తెలిసింది. టెలిఫోన్ సంబంధాలను చంపుతుందని అనుకున్నాం. కానీ అది దూరాన్ని చంపింది. కంప్యూటర్ ఉద్యోగాలను మింగేస్తుందని భయపడ్డాం. కొన్ని ఉద్యోగాలు తగ్గాయి, కానీ సాఫ్ట్‌వేర్, డేటా, డిజిటల్ వ్యాపారాల వంటి కొత్త ప్రపంచాలు పుట్టాయి. ప్రతి కొత్త సాంకేతికత ముందూ మనిషి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకున్నాడు. చివరకు తన సాధనంగా మార్చుకున్నాడు. ఏఐ కూడా ఆ చరిత్రలో మరో అధ్యాయం మాత్రమే.

ఏఐ ఇప్పుడు మన ముందున్న కొత్త భయం. ఇది పాత వస్తువుల కంటే కొంచెం భిన్నంగా కనిపిస్తోంది. ఎందుకంటే పాత యంత్రాలు ప్రధానంగా మనిషి శరీరానికి పోటీ. ఏఐ మాత్రం మనిషి మెదడుకు పోటీ. ఇది మనిషికి కొత్త అనుభవం. అందుకే ఎక్కువ భయం. ఏఐ రచన చేస్తోంది. బొమ్మ గీస్తోంది. సంగీతం స్వరపరుస్తోంది. కోడ్ రాస్తోంది. భాషలు అనువదిస్తోంది. రోగ నిర్ధారణలో సహాయపడుతోంది. డేటాను విశ్లేషిస్తోంది. మనిషితో సంభాషిస్తోంది. అందుకే ఈసారి ప్రశ్న మరింత భయపెట్టేదిగా ఉంది. యంత్రం ఆలోచించగలిగితే మనిషి ఎందుకు? అనేది తాజా ప్రశ్న. అయితే తెలివి ఒక్కటే మనిషిని మనిషిగా చేయలేదు. ఏఐ సమాధానం తెలుసుకుంటుంది. మనిషికి ప్రశ్న తడుతుంది.

ఒక ఏఐ లక్షల పుస్తకాల్లోని సమాచారాన్ని ప్రాసెస్ చేయగలదు. కానీ నేను ఎవరు అని మొదట అడిగింది యంత్రం కాదు, మనిషి. నక్షత్రాలను లెక్కపెట్టే కంప్యూటర్ ఉండొచ్చు. కానీ రాత్రి ఆకాశాన్ని చూసి అక్కడ ఇంకెవరైనా ఉన్నారా? అని ఆశ్చర్యపోయింది మనిషి. ఏఐ చెత్తదో డొక్కుదో ప్రేమ కవిత రాయగలదు. కానీ ప్రేమించిన మనిషి కోసం రాత్రంతా నిద్రపోకుండా ఎదురుచూడదు. విరహగీతం తయారు చేయగలదు. విరహాన్ని అనుభవించదు. సమాచారం అనుభవం కాదు. లెక్కించడం జీవించడం కాదు. సమాధానం చెప్పడం జ్ఞానం కాదు. మరి ఈ కోణంలో ఏఐ ప్రమాదం కాదా? అంటే కాదనలేం. ఏఐతో ఉద్యోగాలు మారవచ్చు. కొన్ని ఉద్యోగాలు తగ్గవచ్చు. నకిలీ సమాచారం, మోసాలు, పర్యవేక్షణ, అధికార కేంద్రీకరణ, సృజనాత్మక హక్కులు వంటి తీవ్రమైన సమస్యలు రావచ్చు. అందువల్ల ఏఐ గురించి ప్రశ్నించాలి. చట్టాలు కావాలి. నైతిక పరిమితులు కావాలి. నియంత్రణ కావాలి. కానీ భయం వల్ల దాన్ని తిరస్కరించడం పరిష్కారం కాదు.

ఒకప్పుడు యంత్రాలను పగలగొట్టడం వల్ల పారిశ్రామిక విప్లవం ఆగలేదు. ఏఐని తిడితే ఏఐ ఆగదు. దాన్ని అర్థం చేసుకోవాలి. దాని మీద అధికారం ఎవరిదో ప్రశ్నించాలి. దాని ప్రయోజనాలు కొద్దిమంది కంపెనీలకే కాక సమాజానికి ఎలా అందాలో నిర్ణయించాలి. మనిషి పని పోకుండా మాత్రమే కాదు, మనిషి గౌరవం పోకుండా చూసుకోవాలి. ఎందుకంటే యంత్రానికి ఒక పరిమితి ఉంది. ప్రొక్లెయిన్ కొండను తవ్వగలదు. కానీ ఆ కొండను తవ్వాలా వద్దా అని నిర్ణయించాల్సింది మనిషే. కంప్యూటర్ కోట్ల లెక్కలు చేయగలదు. కానీ ఏ లెక్క న్యాయమైనదో నిర్ణయించాల్సింది మనిషే. రోబో తుపాకీ పేల్చగలదు. కానీ ఎవరి మీద తుపాకీ ఎత్తకూడదో చెప్పాల్సింది మనిషే. ఏఐ ఒక తీర్పుకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించగలదు. కానీ న్యాయం అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాజం సమాధానం చెప్పాలి. ఇక్కడే మనిషి ఆధిక్యం ఉంది. అది ఐక్యూలో కాదు. వేగంలో కాదు. జ్ఞాపకశక్తిలో కాదు. లెక్కల్లో కాదు. విలువలను సృష్టించగలగడంలో ఉంది.

అందుకే ఏఐ యుగంలో మనిషి అడగాల్సిన ప్రశ్న 'ఏఐ మనిషిని మించిపోతుందా?' అని కాదు. ఏఐని ఉపయోగించి మనల్ని మనం ఎంత మెరుగుపరుచుకుంటాం? అన్నది. ఎందుకంటే నిప్పు గొప్పది కాదు. దాన్ని అదుపులోకి తెచ్చిన మనిషి గొప్పవాడు. చక్రం గొప్పది కాదు. దానికి గమ్యం ఇచ్చిన మనిషి గొప్పవాడు. యంత్రం గొప్పది కాదు. దానికి పని చెప్పిన మనిషి గొప్పవాడు. కంప్యూటర్ గొప్పది కాదు. దానికి భాష నేర్పిన మనిషి గొప్పవాడు. ఏఐ శ్రీశ్రీని తయారు చేయలేదు, డావిన్సీని పుట్టించలేదు. మనిషి కంటే తెలివైన యంత్రం ఉంటుంది, మనిషి కంటే గొప్ప యంత్రం ఉండదు. తన తెలివిలోంచి తనకే పోటీ అయ్యే మరో తెలివిని సృష్టించగలిగిన మనిషే గొప్పవాడు.

బహుశా మానవ నాగరికత మొత్తాన్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే 'మనిషి ప్రతి కొత్త శక్తిని చూసి మొదట భయపడ్డాడు. తర్వాత దాన్ని తన పనిముట్టుగా మార్చుకున్నాడు' అని చెప్పాలేమో. ఏఐ విషయంలోనూ జరగాల్సింది అదే. ఏఐ మనిషికి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం లేదు. అది మనిషి చేతిలో మరో పరికరం కావచ్చు. ఎందుకంటే యంత్రానికి తెలివి, వేగం, జ్ఞాపకశక్తి, భాష ఇవ్వగలం. కానీ మనిషి దగ్గర ఉన్న ఒక అత్యంత విలువైన విషయం యంత్రానికి ఇవ్వడం అంత సులభం కాదు. 'నేను ఏం చేయాలి?' అని తనను తాను ప్రశ్నించుకునే నైతిక చైతన్యం మాత్రం ఇవ్వలేం. ఆ ప్రశ్న ఉన్నంతకాలం మనిషి అవసరం తీరదు. మనిషి కథ ముగియదు. మరో కొత్త సాంకేతికత వస్తుంది. మనిషి మళ్లీ భయపడతాడు. కొంతకాలం దాన్ని తిడతాడు. తర్వాత దాన్ని అర్థం చేసుకుంటాడు. చివరకు దానితోనే చేయి కలిపి 'సరే... ఇప్పుడు మనం మనం భాయి భాయి' అంటాడు. అక్కడి నుంచి నాగరికత మరో అడుగు ముందుకు వేస్తుంది.

# ఒంట్లోకి చేరిపోతున్న విషం!

**తినే ఆహారం ఎంత మంచిదైతే అంతగా శరీరానికి సత్తువ అందుతుంది. రోగనిరోధకశక్తి పెరిగి పనిపాటల్లో చురుగ్గా పాల్గొనేందుకు అవకాశముంటుంది. అదే ఆహార ఉత్పత్తుల్లో విష రసాయనాల ఉనికి కట్టుతప్పితే జాతి భవితే ప్రమాదంలో పడుతుంది. దేశీయంగా నేడు అలాంటి దారుణావస్థే నెలకొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 67వేల టన్నులకు పైగా క్రిమిసంహారకాలను పంటపొలాల్లో విరజిమ్మినట్లు అంచనా. పదేళ్ల కిందటితో పోలిస్తే ఈ గుమ్మరింత ఇరవైశాతం అధికమైంది. ఇలా పురుగుమందులను విచ్చలవిడిగా వినియోగిస్తుండటం- ఆహార ఉత్పత్తులను రోగకారకాలుగా మార్చుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండటం కలవరపరుస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2023-26 మధ్య దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పండ్లు, కూరగాయల నమూనాలు సేకరించి విశ్లేషించింది. వాటిలో హరియాణా తరవాత అత్యధికంగా ఏపీ, తెలంగాణల్లో**



**సేకరించిన వాటిలో పురుగుమందుల అవశేషాలు పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర్ ప్రదేశ్ వంటిచోట్లా రసాయనాల జాడ ఎక్కువగానే ఉంది. క్రిమిసంహారకాల వాడకంలో అదుపు లేకపోవడం ప్రజారోగ్యంతోపాటు దేశార్థికానికీ చేటుచేస్తోంది!**

తెగుళ్లు త్వరగా నశించిపోయి, దిగుబడులు బాగా వస్తాయనే భ్రమతోనే చాలామంది రైతులు శాస్త్రీయ సిఫార్సులకు మించిన స్థాయిలో రసాయనాలు చల్లుతున్నారు. పైగా అంతర్జాతీయంగా నిషేధానికి గురైన వాటితో సహా అనేక రకాల క్రిమిసంహారకాలను కలగలిపి గుమ్మరిస్తుండటంతో సమస్య మరింత తీవ్రతరమవుతోంది. పురుగుమందు చల్లిన తరవాత నిర్దిష్ట సమయం ఆగకుండానే పచ్చిమిర్చి, బెండ, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, టమాటా వంటి వాటిని కోసేసి మార్కెట్లకు తరలిస్తుండటం వల్లా వ్యాధులు ముమ్మరిస్తున్నాయి. విచక్షణా రహితంగా వాడుతున్న కీటకనాశనులు నేలలోకి, భూగర్భ జలాల్లోకి చేరి తరవాత పంటల్లోకి ప్రవేశిస్తున్నాయి. వాటి అవశేషాలు ఎక్కువగా పోగుపడిన ఆహారాన్ని తింటున్నవారిలో వివిధ రకాల క్యాన్సర్లు, శ్వాసకోశ సమస్యలు, గుండెజబ్బులు, అల్జీమర్స్ వంటివి కోరచాస్తున్నాయి. పురుషుల్లో వంధ్యత్వం, స్త్రీలలో గర్భస్రావాలు, పిల్లల్లో ఎదుగుదల లోపాలు ఎక్కువవుతున్నాయి. పురుగుమందుల వినియోగంపై అన్నదాతలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల మన సాగు ఉత్పత్తులు అంతర్జాతీయంగా తరచూ తిరస్కారానికి గురవుతున్నాయి. దానివల్ల రైతుల ఆదాయాలకు గండి పడటమే కాకుండా, వ్యవసాయ ప్రధానమైన భారతదేశ ప్రతిష్ఠా దెబ్బతింటోంది!

పురుగుమందుల అవశేషాలు మోతాదుకు మించి ఉన్నాయనే కారణంతో భారత మిరప కంటైనర్లు కొన్నింటిని చైనా ఇటీవల తిరస్కరించింది. ప్రమాదకర అఫ్లోటాక్సిన్‌తో పాటు తేమ శాతం అధికంగా ఉందంటూ శ్రీలంక సైతం తాజాగా అదే పనిచేసింది. తెగుళ్ల నివారణ ప్రక్రియలో లోపాలను చూపి జపాన్ మన మామిడి దిగుమతిని మళ్లీ నిలిపేసింది. గతంలో సౌదీ అరేబియా, ఈయూ వంటివీ మన ఉద్యాన ఉత్పత్తులపై విముఖత ప్రదర్శించాయి. పండ్లూ కూరగాయల ఫలసాయంలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో మాత్రం ఇండియా వాటా దాదాపు ఒకశాతానికే పరిమితమైంది. మన ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండాలంటే పురుగుమందుల వాడకం, సరైన సమయంలో కోత తదితరాలపై రైతులకు అవగాహన కల్పించాలి. అవసరానికి తగినట్లు ల్యాబ్‌లు నెలకొల్పి, నాణ్యతా ధ్రువీకరణను కట్టుదిట్టం చేయాలి. చీడపీడల నివారణలో ఫెరమోన్ ట్రాప్ వంటి సహజ పద్ధతులను ప్రోత్సహిస్తూ, ప్రధాని మోదీ మొన్న పిలుపిచ్చినట్లుగా రైతాంగాన్ని రసాయన రహిత వ్యవసాయం దిశగా నడిపించాలి!

# మానవతా సంక్షోభంలో అఫ్గాన్

**ఉగ్రవాద భూతాన్ని భూస్థాపితం చేస్తానంటూ భీష్మప్రతిజ్ఞ చేసి 2001లో అఫ్గానిస్థాన్‌లో అడుగుపెట్టిన అమెరికా అంతిమంగా సాధించిందేంటి? బ్రౌన్ విశ్వవిద్యాలయ అంచనా ప్రకారం- మిలటరీ ఆపరేషన్లు, పునర్నిర్మాణ పనులు తదితరాలకు ఇరవై ఏళ్లలో రెండు లక్షల కోట్ల డాలర్లకు పైగా ధారపోసిన అగ్రరాజ్యం, చివరికి ఉత్త చేతులతో వెనక్కి తిరిగింది. లక్షల కొద్దీ ఆయుధాలు, సైనిక ఉపకరణాలు, సాయుధ శకటాలను అక్కడే వదిలేసి, అఫ్గాన్‌ను తిరిగి తాలిబన్లకు అప్పగించి తన దారి తాను చూసుకుంది. అలా అయిదేళ్ల క్రితం కాబూల్‌ను మళ్లీ కైవసం చేసుకున్న తాలిబన్లు- దేశవ్యాప్తంగా తమ అధికారాన్ని సుస్థిరం చేసుకున్నారు. గడచిన అర్ధ దశాబ్దంలో భద్రతాపరంగా అఫ్గాన్ స్థితిగతులు కాస్త మెరుగుపడినట్లు కనిపిస్తున్నాయి కానీ, కరకు ఆంక్షల కారణంగా అక్కడి మహిళలు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారు. ప్రతి నలుగురు అఫ్గాన్ ప్రజల్లో ముగ్గురు ప్రాథమిక జీవన వసతులకు నోచుకోని పేదరికంలో మగ్గిపోతున్నట్లు**



**అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విదేశాల నుంచి సహాయ సహకారాలూ తరిగిపోవడంతో స్థానికుల జీవితాలు ఇప్పుడు అల్లకల్లోలమవుతున్నాయి!**

నిరంతర యుద్ధాలు, మాదకద్రవ్యాలూ ఉగ్రవాదుల ఉత్పత్తికి నెలవు కాని సుస్థిర అఫ్గాన్‌ను ప్రపంచ దేశాలెన్నో కోరుకుంటున్నాయి. ఆ మేరకు తాము ఐసిస్ ముష్కర మూకలపై ఉక్కుపాదం మోపామంటున్న తాలిబన్ వర్గాలు విదేశాలతో శాంతియుత వాణిజ్య దౌత్య సంబంధాలను ఆశిస్తున్నామని పేర్కొంటున్నాయి. వాస్తవానికి 2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే నల్లమందులో ఎనభైశాతం అఫ్గాన్ నుంచే వచ్చేది. ఆ పంటపై తాలిబన్లు నిషేధం విధించడంతో నల్లమందు నివారణలో పరిస్థితులు చాలా మెరుగుపడ్డాయి. సంబంధిత రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించడంతో తాలిబన్ శ్రేణులు సఫలీకృతమయ్యాయి. కానీ, వాతావరణ విపరిణామాలతో ఇటీవలి కాలంలో అక్కడి వ్యవసాయ రంగం బాగా దెబ్బతింది. నిరుడు 64శాతం భూభాగం కరవు గుప్పిట్లో చిక్కుకుంది. ఇరాన్, పాకిస్థాన్‌ల నుంచి దాదాపు యాభైలక్షల మంది వట్టి చేతులతో స్వదేశానికి వచ్చేయడం, ఉపాధి మార్గాలు కుంచించుకుపోవడం, దిగుమతుల బిల్లు పెరిగిపోవడం, విదేశాల్లోని నిధులు స్తంభించిపోవడంతో అఫ్గానిస్థాన్ భవిత అగమ్యగోచరమవుతోంది. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఆ దేశ జనసామాన్యం ఇప్పుడు విదేశీ ఆపన్నహస్తాలకోసం ఆశగా ఎదురు చూస్తోంది!

సుమారు నలభై దేశాలు తాలిబన్ ప్రభుత్వంతో మంత్రాంగం నెరపుతున్నప్పటికీ ప్రస్తుతం రష్యా ఒక్కటే ఆ సర్కారును అధికారికంగా గుర్తించింది. గాంధారభూమితో బొడ్డుపేగు అనుబంధం కలిగిన భారతావని అఫ్గాన్‌లో అభివృద్ధి ప్రాజెక్టులకు లోగడ విశేషంగా సాయం చేసింది. పాకిస్థాన్‌తో నిమిత్తం లేకుండా ఇరాన్‌లోని చాబహార్ రేవు ద్వారా మధ్యాసియాతో అనుసంధానమవ్వడానికి అఫ్గానిస్థాన్ కీలకమైన దృష్ట్యా తాలిబన్లతో అనివార్యంగా మాటామంతీ జరుపుతోంది. ముష్కర మూకల ముప్పును తగ్గించడం, కాబూల్‌లో చైనా ప్రభావాన్ని పరిమితం చేయడం తదితర వ్యూహాత్మక అవసరాల రీత్యానూ అఫ్గాన్‌తో ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణలో భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. తమపై పెత్తనం చలాయించాలనుకున్న పాకిస్థాన్ పన్నాగాలను తాలిబన్లు పారనివ్వని నేపథ్యంలో మన విదేశాంగ విధానానికి జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలి. అఫ్గాన్ ప్రజలకు మానవతా సాయమందిస్తూ, భారత వ్యతిరేక కుట్రలకు ఆ దేశం ఎప్పటికీ సురక్షిత స్థావరం కాకుండా చూసుకోవాలి!

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

బుధవారం ⁞ అనంతపురం ⁞ 26.08.2026 ⁞ 01


## భక్తిశ్రద్ధలతో భగవాన్ శ్రీ జిహ్వేశ్వర జయంతి వేడుకలు

**- శ్రీ అంబాభవాని దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన హరీశ్ బాబు....**

**ధర్మవరం ఆగష్టు 25 అనంత జనశక్తి న్యూస్ :**

స్వకుళసాలి సమాజ బాంధవులకు భగవాన్ శ్రీ జిహ్వేశ్వర జయంతి శుభాకాంక్షలు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శ్రీ అంబాభవాని దేవి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన భగవాన్ జిహ్వేశ్వర జయంతి ఉత్సవాల్లో మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సూచన మేరకు నియోజకవర్గ ఇంచార్జ్ హరీశ్ బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వకుళసాలి సమాజ బాంధవులకు జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భగవాన్ శ్రీ జిహ్వేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సౌభ్రాతృత్వం మరింత బలోపేతం కావాలని భగవంతుడిని ప్రార్థించారు.



# హలో... నాయకులు ఉన్నారా





**- ప్రజల గోడు పట్టదా**
**- ఓటర్లుగా మాత్రమే చూస్తారా ....**
**- ఎన్ని ప్రాణాలు పోవాలి....**
**- రోడ్డుకు మట్టిని వేయలేని దీనస్థితిలో కూటమి ప్రభుత్వం..**

**యల్లనూరు, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్;**

కచ్చితంగా చెప్పాలంటే గత 15 సంవత్సరాల క్రితం అప్పటి మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ పుణ్యమా అని యల్లనూరుతాడిపత్రి గ్రామాల మధ్య గల ఆర్ అండ్ బి రహదారికి మోక్షం లభించింది. మూడు భాగాలుగా విభజించి డబుల్ రోడ్డు నిర్మానానికి ఆయన హయాంలో బీజం వేశారు. తాడిపత్రి నుండి శనిగల గూడూరు వరకు డబల్ రోడ్డు నిర్మించారు. తర్వాత ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది ఈ రోడ్డు దుస్థితి. డబల్ రోడ్డు మంజూరు వ్యవహారం ఇక్కడి నాయకులకు పురిటి నొప్పులుగా మారిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి . పక్క నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడో మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుంటే యల్లనూరు మండల కేంద్రానికి వచ్చే రోడ్లు మాత్రం మృత్యు ఘోషగా మారి ప్రజల ప్రాణాల హరించేలా తయారయ్యాయి. ఈ రహదారి ఇక్కడి నాయకుల పనితీరుకు అద్దం పడుతుంది.

**ఎన్ని ప్రాణాలు పోవాలి ....**

ఇప్పటికి వరకు ఈ మార్గంలో గత ఐదు సంవత్సరాలలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే నారాయణ పల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డు పై గోతులను తప్పించే తరుణంలో వెనుక కూర్చున్న మరో వృద్ధుడు క్రింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే. గత రెండు నెలల క్రితం కడప జిల్లాకు చెందిన కుటుంబీకులు కారులో వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చి రోడ్డు ఎక్కే క్రమంలో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైంది. అలాగే కోడుమూర్తి గ్రామానికి చెందిన మోహన్‌నాయుడు కూడా గూడూరు గ్రామం సమింలో రెండు కిలోమీటర్లు రాగానే ఓ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చే క్రమంలో వాహనం అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకెల్లడం ఆయన తీవ్ర గాయాల పాలై చావు బ్రతుకుల నుండి బయటపడ్డాడు. గత వారం రోజుల క్రితం చిలమకూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు పని నిమిత్తం తాడపత్రి కి వెళ్లి తన గ్రామానికి వెళుతుండగా గూడూరు గ్రామం దాటిన వెంటనే ఎదురుగా వస్తున్న టిప్పర్ కు సైడ్ ఇచ్చే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి ఆయన కూడా ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లారు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు పదుల సంఖ్యలో ప్రమాదాల బారినపడి కొందరు ప్రాణాలు కోల్పోగా పోగా మరికొందరి కుటుంబాలు ఆర్థికంగా చిద్రమాయ్యాయి. ఇన్ని ప్రాణాలు పోతున్న నేతలు మాత్రం ఇక్కడి వారిని కేవలం ఓటర్లగానే చూస్తున్నారే తప్ప వారి సమస్యకు పరిష్కారం చూపడంలో మాత్రం పూర్తిగా చతికిల పడ్డారని చెప్పవచ్చు.

**ప్రస్తుతం రోడ్డు ఎలా ఉందంటే...**

ప్రస్తుతం శనిగల గూడూరు నుండి యల్లనూరు వరకు రోడ్డు దుస్థితి వర్ణనాతీతం. రోడ్డుపై ఏర్పడ్డ గోతులను పక్కన పెడితే రోడ్డు ఇరువైపులా బర్మ్‌లు పూర్తిగా దెబ్బ తినడంతో వాహనదారులు రోడ్డు దిగాలంటే తీవ్ర స్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారు. బర్మ్‌లకు ఇరువైపులా మట్టి కోతకు గురవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అంతేకాక రోడ్డు అంచులు కూడా పూర్తిగా దెబ్బ తినడంతో బర్మ్‌కు దెబ్బతిన్నరోడ్డుకు మధ్య అర్థ అడుగుపైగా ఎత్తు పల్లాలు ఉండడంతో రోడ్డు ఎక్కాలన్న, దిగాలన్న వాహనదారులు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. మండల వ్యాప్తంగా ఇసుక రీచులకు అనుమతులు ఇవ్వడంతో ఇసుక రవాణా టిప్పర్ డ్రైవర్లు సైతం అధికలోడుతో ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వకపోవడంతో వాహనదారులకు నరకం తప్పడం లేదు.

**నాయకులు ఉన్నారా.....**

యల్లనూరు మండలాన్ని పట్టించుకునే నాయకులు ఉన్నారా అంటే ఏమో... అన్న ప్రశ్నలే అధికంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే శైలజ తన పదవిని కోల్పోయిన తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది, తదనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రస్తుతం మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ మండలపై మాత్రం ప్రతి ఒక్కరూ సవతి ప్రేమనే చూపిస్తున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మండలంలోని ప్రజలను నాయకులు వారి ఆధిపత్యం కోసము, వర్గాన్ని బలపరుచుకోవడం కోసం తప్ప వారి సమస్యల పరిష్కారానికి మాత్రం నాంది పలకడం లేదనడానికి ఈ రహదారే నిలువెత్తు నిదర్శనం.

**అధికారులు ఏమంటున్నారంటే....**

ఈ రోడ్డు దుస్థితిపై డి ఈ గారిని అడుగగా రోడ్డు మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా బర్మ్‌లకు మట్టి వేయడానికి రూ.పది లక్షల అవసరమని ప్రతిపాదనలు పంపమన్నారు. మరి అధికారులకు పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అవుతాయా....? లేక ఈ ప్రాంత మరణ మృదంగాల నివారించేందుకు నిధులు మంజూరు అవుతాయో.. వేచి చూడాలి మరి

## జూనియర్ సైకిల్ పోలో యశోద బాలికల హవా...!




**- ద్వితీయ స్థానం సాధించిన యశోద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్.**
**- కరస్పాండెంట్ మల్లికార్జున.**

**ధర్మవరం ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్:**

ఏపీ జూనియర్ సైకిల్ పోలో బాలికల విభాగంలో పట్టణంలోని యశోద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ద్వితీయ స్థానం సాధించిందని కరెస్పాండెంట్ మల్లికార్జున, ప్రిన్సిపాల్ అనూప్ కుమార్, డైరెక్టర్ పృధ్విరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించడం పాఠశాలకు గర్వంగా ఉందని తెలిపారు. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ సాయి జూనియర్ సైకిల్ పోలో బాలికల బాలుర పోటీల్లో పాఠశాల బాలికల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నదని ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థినీల క్రీడా ప్రతిభను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ప్రతిభ ఘనపరిచిన విష్ణువర్ధన్ రెడ్డి నైన్త్ క్లాస్, గగన సింధు 9వ తరగతి, యశ్మిత రాణి ఎనిమిదో తరగతి, తృతీయ కృష్ణ ఏడవ తరగతి, హ్యాషిత ఎనిమిదో తరగతి, మోక్షిత ఏడవ తరగతి లను అభినందిస్తూ క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని వారు ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థుల విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

## సెలవు పై విఆర్ఓ




**- తాసిల్దార్ ను ముట్టడించిన ప్రజలు**

**యల్లనూరు, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్;**

మండలంలోని మల్లాగుండ్ల రెవెన్యూలో విధులు నిర్వహిస్తున్న మహిళా విఆర్వో సెలవు పై వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం మండల వ్యాప్తంగా జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఈ నెల శనివారం తాసిల్దార్ బిందు మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. ఇందులో భాగంగా మల్లా గుండ్ల గ్రామపంచాయతీకి వెళ్లి సర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తుండగా అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రజలు విఆర్ఓ తో వాదనకు దిగేందుకు సిద్ధమయ్యారు. అయితే వీఆర్వో లేకుండా తాసిల్దార్ ఒక్కరే వెళ్లడంతో ఆమెను చుట్టుముట్టారు. ఆగ్రహ ఆవేశాలతో తాసిల్దార్ పై దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న విఆర్ఓ రైతులు, ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ప్రతి పనికి రూ.500 డబ్బులు డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే తమ పనులు జరగవు అంటూ ప్రజలు తాసిల్దార్ తో వాదనకు దిగారు. అలాగే విధులకు సరిగా హాజరు కాకపోవడం వంటి విషయాలను తాసిల్దార్ దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ విచారించి చర్యలు తీసుకుంటామంటూ అక్కడి ప్రజలకు సర్ది చెప్పి కార్యాలయం చేరుకున్నారు. విఆర్వో ను పిలిపించి జరిగిన సంఘటనపై అడుగగా సదరు విఆర్ఓ పది రోజులు సెలవుపై వెళ్ళినట్లు సమాచారం.

# ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు నమోదు చేసుకోవాలి

**- ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి**
**- ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులే స్వయంగా ఈ పంట నమోదు చేసుకోవచ్చు.**

**అగళి ఆగష్టు 25,అనంత జనశక్తి న్యూస్:**

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రాగేలింగనహళ్లి, కోడిపల్లి గ్రామాలలో ఎల్ నినో ప్రభావ కార్యచరణ ప్రణాళిక, ఫార్మర్ రిజిస్ట్రీ, ఈ పంట నమోదు, పంటల బీమా,ఏపీ ఎయిమ్స్ యాప్, పియండియస్ గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని మండల వ్యవసాయదికారి నాగరాజు తెలిపారు. మండలంలో దాదాపు ఇప్పటిదాకా 5630 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవడం జరిగిందని, ఫార్మర్ ఐడి పెండింగ్ ఉన్న రైతుల వివరాలు రైతు సేవా కేంద్రాల దగ్గర అందుబాటులో ఉన్నాయని భూమి ఉన్న ప్రతి రైతు కూడా రైతు సేవా కేంద్రాలను సంప్రదించి వాళ్ళ పట్టాదారు పాసుపుస్తకం, 1 బి ,ఆధార్ కార్డు, మరియు ఆధార్ కార్డు కి లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉండే ఫోన్ తీసుకొని వెళ్లి ఆధార్ ఓటిపి లేదా బయోమెట్రిక్ ద్వారా కానీ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నట్లయితే రైతుకు 11 సంఖ్యలు ఉన్నటువంటి విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది ఇది రాబోయే రోజులలో పిఎం కిసాన్‌అన్నదాత సుఖీభవ పదాలన్నా మరియు రైతులకు సంబంధించిన టువంటి ఎరువులు,విత్తనాలు, పంట నమోదు, యంత్ర పరికరాలు, బ్యాంకు ఋణాలు, రైతులు వివిధ ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందాలంటే ఫార్మర్ ఐడి కచ్చితంగా ఉండాలి కాబట్టి పెండింగ్ ఉన్న రైతులందరూ కూడా త్వరగా నమోదు చేసుకోవాల్సిందిగా, అలాగే రైతులు పొలాలను బీడు పెట్టకుండా పెల్లటైజేషన్ చేసిన పిఎండిఎస్ విత్తనాలు వేసి పంటలు సాగు చేయాలని, ఈ పంట నమోదు ఖచ్చితంగా చేసుకోవాలని, ఏపీ ఎయిమ్స్ యాప్ డౌన్లోడ్ చేసుకుని ఆ యాప్ ద్వారా కూడా రైతులే స్వయంగా 30 రోజులు దాటిన పంటను రైతు అతని పొలంలోనే ఉండి ఈ పంట నమోదు కూడా చేసుకోవచ్చని రైతులకు తెలియజేసి, రాగి,మొక్కజొన్న,వేరుశనగ పొలాలను రైతులతో కలిసి సందర్శించి యూరియా మరియు మిగతా ఎరువుల వాడకాన్ని తగ్గించి అవసరమైన వరకు మాత్రమే వాడాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ఘన, ద్రవ జీవామృతాలు వాడాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు ఈ కార్యక్రమంలో తహసీల్దారు హరి కుమార్, యం పి పి రేణుకా కామరాజు, ప్రజాప్రతినిధులు, రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.




## బాలల హక్కులు, చట్టాలపై ఉపాధ్యాయులకు శిక్షణ.

**కొత్తచెరువు రూరల్ఆగష్టు 25 అనంత జన శక్తి న్యూస్.**

బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నోడల్ ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని కొత్తచెరువులోని ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్‌లో మంగళవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ, ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి టి సి పి ఓ మహేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాలల న్యాయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల హక్కులు , కిశోర వికాసం తదితర అంశాలపై నోడల్ టీచర్లకు అవగాహన కల్పించారు.ప్రతి శనివారం నిర్వహించే కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా 12 ముఖ్యమైన అంశాలను వారానికి ఒక అంశం చొప్పున విద్యార్థులతో చర్చించి, వారికి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లల సమస్యలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో సంబంధిత శాఖల సహకారంతో వారికి రక్షణ, మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.ఈ సందర్భంగా కొత్తచెరువు సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ, పిల్లలు చిన్న చిన్న సమస్యలకు తీవ్ర నిర్ణయాలు తీసుకోకుండా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు వారికి నిరంతరం మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తూ, సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించుకుని, నైతిక విలువలతో విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా ఈగల్ సబ్ఇన్స్పెక్టర్ హరి, జీసీడీఓ, సర్వశిక్ష అభియాన్ అధికారులు, ప్రొటెక్షన్ ఆఫీసర్లు నాగలక్ష్మి, మురళీధర్, మేనేజర్ సునీత, డీసీపీయూ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన నోడల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన పుట్టపర్తి విద్యార్థులు



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 25 అనంత జన శక్తి న్యూస్.**

బెంగళూరులో ఈ నెల 23న నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పుట్టపర్తికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. స్థానిక ట్రిబుల్ ఎస్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటారు.

అండర్-21 కేజీ విభాగంలో తేజేష్, జయాన్స్ గోల్డ్ మెడల్స్ సాధించగా.. హవిష్ కృష్ణ సిల్వర్, పార్థు బ్రాంజ్ మెడల్ సాధించారు.

అండర్-28 కేజీ విభాగంలో పృథ్వి, ముకేశ్ కుమార్ రెడ్డి గోల్డ్ మెడల్స్, లోహిత్ సిల్వర్ మెడల్ సాధించారు.

35 కేజీల విభాగంలో సూర్య గోల్డ్ మెడల్, అలేఖ్య సిల్వర్ మెడల్ సాధించగా.. 75 కేజీల విభాగంలో వేదవర్ధన్ రెడ్డి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు.

విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడంపై సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మాస్టర్ దినేష్‌ను కూడా అభినందిస్తూ విద్యార్థులను మరింత ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మాస్టర్ దినేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమన్నారు. తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల ఘన విజయం పుట్టపర్తికి గర్వకారణంగా నిలిచిందని తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
బుధవారం | అనంతపురం
26.08.2026


# పశువుల దాహం తీరలేదు....
# కాంట్రాక్టర్ దాహం తీరింది.



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 25 అనంత జన శక్తి న్యూస్.**

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నీటి తొట్టిల నిర్మాణం పుట్టపర్తి మండలంలో చేపట్టారు. కానీ ఈ తొట్టిల నిర్మాణంలో కాంట్రాక్టర్ల, అవినీతి అధికారుల పర్యవేక్షణ లోపం వలన పశువులు దాహం తీరలేదు కానీ కాంట్రాక్టర్ దాహం మాత్రం తీరినట్లు ఉంది. పల్లె పండుగ పథకం కింద ప్రతి గ్రామంలో పశువుల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని 2005 సంవత్సరంలో ఈ పథకం కింద పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాల్లో 45 నీటి తొట్టెలు ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. అందులో ఆరు తొట్టెలు మాత్రమే అసంపూర్తిగా నిలిచిపోయాయి. పూర్తి అయిన వాటిలో కూడా అక్కడక్కడ మాత్రమే నీటితో నింపడం జరుగుతున్నది. ఒకటిన్నర సంవత్సరం గడచిన, పూర్తి అయిన నీటి తొట్టిలకు పైపులైన్ అమర్చి నీటిని సరఫరా చేయలేదు.వాటికి అవసరమైన పైపులను అమర్చకుండానే పనులు పూర్తయినట్లు చూపించి బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువులకు ఉపయోగపడే విధంగా నీటి తొట్టెలకు పైపుల ద్వారా నీటి సరఫరా కల్పించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని గ్రామాల్లో ఆ పనులు చేపట్టలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క నీటి తొట్టికి 18వేల నుండి 24 వేల వరకు బిల్లులు మంజూరయ్యాయి. బిల్లులు చెల్లింపు విషయంలో పథకంలో పనిచేసే సిబ్బంది వారి వారి బంధువులు ఖాతాల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. కానీ పైప్ లైన్ వేసి నీటి తొట్టిలకు నీటి సరఫరా ఎందుకు చేయలేదనీ పలువురు ప్రశ్నిస్తున్నారు. .దీంతో ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించబడ్డాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పనుల నాణ్యత, పూర్తి స్థాయి, బిల్లుల చెల్లింపులపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా నీటి తొట్టెల సంరక్షణ , పశుపక్షాదులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ లు వీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని ప్రజలు కోరడమైనది

## యువతకు ఉద్యోగాల కల్పనే
# కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- యువత బాగా కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి...మంత్రి**

**- 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్–2026 విడుదలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం**

**విజయవాడ ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**



యువత కలలు కన్న భవిష్యత్ ను చంద్రబాబు నాయుడు సాకారం చేస్తున్నారని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం మరో తీపికబురు అందించడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్-2026 విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన సంతోషంగా ఉదన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పలు ఉద్యోగాల నోటిఫికేషన్లు వెలువడనున్నాయని పేర్కొన్నారు.జాబ్ క్యాలెండర్‌లో గ్రూప్-1, గ్రూప్-2తో పాటు పోలీసు, ఫైర్, జైళ్లు, అటవీ, పశుసంవర్ధక, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ తదితర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. డీఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారని తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి అంకితభావంతో సేవలందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. జాబ్ క్యాలెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను goir.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు.

## ఫిజియోథెరపీ క్యాంపు
# విజయవంతం



**- డాక్టర్ సత్య నిర్ధారన్**

**ధర్మవరం ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని 37 వార్డు నందు 25 మంది వయోవృద్ధులకు వారి మోకాళ్ళ సమస్యల ఉపశమనం కోసం ఫిజియోథెరపీ కార్యక్రమం విజయవంతం అయిందని డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎస్పి వి. జగన్నాథ్ రాజు, లాయర్ సుమలత, పట్టణ బిజెపి అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. వార్డ్ సచివాలయం ఏఎన్ఎంఎల్ ద్వారా ఫిజియోథెరపీ చేయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఫిజియోథెరపిస్ట్ నజీమా, మసాజ్ నిపుణురాలు హారిక ఉచిత సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమం గొడుగు వారి సంస్థ వారి ఆధ్వర్యంలో జరిగింది. మున్ముందు పట్టణంలోని అన్ని వార్డులలో ఫిజియోతెరపి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మోకాళ్ళ బాధితుల సంక్షేమ సమితి అధ్యక్షులు పుచ్చ గింజల మల్లికార్జున మాట్లాడుతూ.... రెండవసారి ఏర్పాటు చేసే ఫిజియోథెరపీ క్యాంపులో ఆర్థోపెడిక్ విభాగం ఇతర విభాగాల వైద్య సేవలను వయోవృద్ధులకు అందజేస్తామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రమణారెడ్డి, బాలాజీ నాయక్, విశ్వనాథ్, ఓబులేష్, దంపట్ల చెర్లపల్లి మాజీ సర్పంచ్ వెంగముని తదితరులు పాల్గొన్నారు.

# సుజలాన్ ప్రాజెక్టులతో జిల్లా అభివృద్ధికి కొత్త ఊపిరి

**- పవన విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్**

**- కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**రాయదుర్గం ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**




అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు సమీపంలో సుజలాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బ్లేడ్ తయారీ యూనిట్, 1200 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయడం సంతోషకరమైన విషయమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ , ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు , ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ , కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా పారిశ్రామిక, ఇంధన రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందేందుకు ఈ ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. సుజలాన్ బ్లేడ్ తయారీ యూనిట్, పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు భారీ పెట్టుబడులు రావడంతో పాటు స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ గారి చొరవతో రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న అపారమైన పునరుత్పాదక ఇంధన వనరులను సద్వినియోగం చేసుకుంటూ మరిన్ని పరిశ్రమలు, భారీ పెట్టుబడులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పచ్చ ఇంధనం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలతో అనంతపురం జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే కీలకమైన పారిశ్రామిక, పునరుత్పాదక ఇంధన కేంద్రంగా ఎదుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# శ్రీశైల విషాద ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి

**- ధర్మవరం నియోజకవర్గానికి చెందిన కుటుంబ సభ్యుల మృతి తీవ్రంగా కలచివేసింది.**

**- మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం**

**- జీవితం అమూల్యం.. ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు.**

**- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్:**



శ్రీశైలంలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన కుటుంబ సభ్యులు మృతి చెందిన విషాదకర ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి, ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలంలో చోటుచేసుకున్న ఈ ఘటన తెలిసిన వెంటనే మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గానికి చెందిన కుటుంబ సభ్యులు దురదృష్టవశాత్తూ ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో స్పందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఘటనకు సంబంధించి మృతదేహాల తరలింపు, ఇతర అధికారిక లాంఛనాలు, కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ చర్యలు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్ నంద్యాల జిల్లా కలెక్టర్‌తో, నంద్యాల జిల్లా ఎస్పీతో స్వయంగా మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, అధికారిక ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని వారిని కోరారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అదేవిధంగా, జీవితంలో ఎలాంటి సమస్య ఎదురైనా దానికి పరిష్కారం ఉంటుందని మంత్రి సూచించారు. సమస్యలను మనసులోనే దాచుకోకుండా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని కోరారు. నలుగురితో పంచుకుంటే సమస్యకు ఏదో ఒక దారి తప్పకుండా దొరుకుతుంది. కష్టకాలంలో ఒంటరిగా బాధపడకుండా ఇతరుల సహాయం తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవేశపూరితమైన లేదా జీవితాన్ని ముగించుకునేలా తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దు అని ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి జీవితం ఎంతో విలువైనదని, కష్టాలు శాశ్వతం కావని, ఎంతటి సమస్యకైనా పరిష్కారం



వెతికే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో మాట్లాడి సహాయం పొందాలని సూచించారు. శ్రీశైలం ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం అవసరమైన సహాయ సహకారాలు అందించేలా తగిన చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు
# టెట్ రద్దు చేయాలి

**- యూటీఎఫ్ డిమాండ్.**

**ధర్మవరం ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్:**




విద్యా హక్కు చట్టం సెక్షన్ 23(1) ను సవరించి, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలు రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్ రద్దుపై యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన దశల వారీ పోరాటాల్లో భాగంగా ధర్మవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలి నందు యూటీఎఫ్ ధర్మవరం డివిజన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యు టీ ఎఫ్ నాయకులు మాట్లాడుతూ.... అనేక సంవత్సరాల పాటు విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వారిని ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దుతున్న ఉపాధ్యాయులను టెట్ పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తూ వారి యొక్క బోధనపై ప్రభావం చూపేలా చేయడం సరికాదని తెలిపారు. అందువల్ల విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1) ని సవరించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలను రద్దుచేసే విధంగా తమిళనాడు ప్రభుత్వం చేసిన విధంగానే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు.

ఒకవేళ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయాలని అనుకుంటే ప్రభుత్వం నిన్న విడుదల చేసిన స్పెషల్ టెట్ నోటిఫికేషన్ లో ఉపాధ్యాయులందరికీ పాస్ మార్కులు 40 శాతము కి తగ్గింపు చేయాలని, ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టు వారిగా పరీక్షలు నిర్వహించే విధంగా సిలబస్ లో మార్పు చేయాలని, అదేవిధంగా సీనియర్ ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని టెట్ పరీక్షను ఆన్లైన్లో కాకుండా ఆఫ్ లైన్ విధానంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి అమర్నారాయణ రెడ్డి, ధర్మవరం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింకా హరికృష్ణ, హెచ్ రామాంజనేయులు, సీనియర్ నాయకులు ఆంజనేయులు, రాంప్రసాద్, వెంకట కిషోర్, రఫీ అహమ్మద్, రవి శేఖర్, సాయి గణేష్, నాగిరెడ్డి, రామకృష్ణ, పెద్దకోట్ల సురేష్, వెంకట సురేష్, జనార్ధన్ పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడుగా "పులివారి " !



**- అభినందించిన ఉరవకొండ నియోజకవర్గం జర్నలిస్టులు**

**ఉరవకొండ, ఆగస్టు 25: అనంత జనశక్తి న్యూస్**

ఉరవకొండ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పులివారి హరిప్రసాద్ ఏపీడబ్ల్యూజేఎఫ్ ( ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ) జిల్లా ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నాడు అనంతపురం నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ భవనంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అనంతపురం జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. అనంతరం జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఉరవకొండ ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, అనంతపోరు" మంత్లీ మ్యాగజైన్ ఎడిటర్ పులివారి హరిప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన పులివారి హరిప్రసాద్ 1994లో ఈనాడు దినపత్రికలో విలేకరిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి 2001 వరకు పనిచేశారు. 2002లో ఆంధ్రజ్యోతి దినపత్రిక జర్నలిజం కళాశాలలో పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సు పూర్తి చేసి అనంతపురం, కర్నూలు డెస్క్ లలో సబ్ ఎడిటర్ గా, సీనియర్ సబ్ ఎడిటర్ గా, ట్రైనీ స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేశారు. అనంతరం"సాక్షి " దినపత్రికలో 2007 లో పత్రిక ప్రారంభానికి ముందే ట్రైనీ స్టాఫ్ రిపోర్టర్ గా చేరి గుంతకల్లు రైల్వే డివిజన్ ఇంచార్జి గా 2015 వరకు పనిచేశారు. ఆ తర్వాత ఆంధ్రప్రభ దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్ గా, విశాలాంధ్ర దిన పత్రిక బ్యూరో ఇంచార్జి గా జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించారు. 2023 నుంచి ఫ్రీ లాన్స్ జర్నలిస్టుగా... ధర్మ విజేత, అనంత పోరు వంటి మంత్లీ మ్యాగజైన్ లలో ఎడిటర్ గా పనిచేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా జర్నలిస్టుగా ఉంటూ సమాజ సేవ తో పాటు జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం తన కలంతో పోరాటాలు చేస్తూ వస్తున్నారు. జర్నలిజం రంగంపై హరిప్రసాద్ కు ఉన్న అవగాహనను దృష్టిలో ఉంచుకుని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఉరవకొండ ప్రాంతానికి చెందిన వివిధ దిన పత్రికల, ఎలెక్ట్రానిక్ ఛానళ్ల విలేకరులు రేగటి భీమప్ప, పీవై సుంకన్న, వీరేష్, నరసింహ నాయక్, సాల్మన్ రాజ్, హెచ్ సీ ఓబులేసు, జిటీ పాల్ , హెచ్.అశోక్ కుమార్, బెల్డోన రమేష్ , అమరేష్, వీ. గోవిందు, చాంద్ బాషా, బి. రాజేష్, పృథ్వీ రాజ్, ప్రదీప్, హరికృష్ణ, అది తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# మంత్రి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8న మెగా జాబ్ మేళా

- నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోండి.
- మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ కుమార్ వెల్లడి.

ధర్మవరం ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా తేదీలో మార్పు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... ముందుగా ఆగస్టు 28వ తేదీన నిర్వహించాల్సిన ఈ మెగా జాబ్ మేళాను సెప్టెంబర్ 8వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు సంస్కృతి సేవా సమితి సహకారంతో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళా ధర్మవరం యువతకు ఉద్యోగ అవకాశాలను నేరుగా అందించే వేదికగా నిలవనుందని పేర్కొన్నారు.

ఈ మెగా జాబ్ మేళాలో 100కు పైగా ప్రముఖ జాతీయ కంపెనీలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లోని కంపెనీలు తమకు అవసరమైన సిబ్బంది ఎంపిక కోసం అభ్యర్థులకు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగం కోసం యువత కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కంపెనీలనే ధర్మవరం యువత వద్దకు తీసుకురావడం ఈ మెగా జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంతో పాటు సమీప ప్రాంతాల నుంచి అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 8వ తేదీన ఉదయం 9 గంటలకు ధర్మవరం-బత్తలపల్లి రోడ్డు లోని సి ఎన్ బి ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హరీష్ బాబు వెల్లడించారు. అభ్యర్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని, జాబ్ మేళాకు హాజరయ్యే సమయంలో తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అవసరమైన ఇతర పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నైపుణ్యం పోర్టల్ ద్వారా లేదా పోస్టర్‌లో అందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: 8688466361, 9390176421,



9966682246, సంప్రదించాలన్నారు.

# అంగన్వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం

రాప్తాడు ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్



రాప్తాడు మండల కేంద్రంలో అంగనవాడి వర్కర్లకు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లికార్జున, సిడిపిఓ మా శంకరమ్మ, ఆదేశాల మేరకు "జ్ఞాన జ్యోతి .120" శిక్షణా కార్యక్రమం భాగంగా పిల్లల అసెస్మెంట్ అంచనా గురించి అనగా పిల్లలలో అభివృద్ధి గురించి ఏ పిల్లవాడు ఏ స్థాయిలో ఉంటాడు అనే వాటి మీద అంచనా వేయడం, అంగన్వాడీ టీచర్ ఈ పిల్లలను అంచనా వేయడానికి కావలసిన మెటీరియల్ను ఎలా సమకూర్చుకోవాలి. ఏమేమి పొందుపరచు పోవాలి వాటి గురించి తెలపడం జరిగింది. తర్వాత ఈ జ్ఞాన జ్యోతి శిక్షణ ట్రైనింగ్ లో భాగంగా ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఏమేమి శిక్షణ కార్యక్రమాలు జరిగినాయి అనే వాటి మీద టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ టిఎల్ఎం. తయారు చేయించడం జరిగినది. అలాగే అంగన్వాడీ కేంద్రం స్థాయి నుంచి , లింగ బేధం ,లింగ వివక్షత గురించి అనగా జెండర్ గురించి అంగన్వాడి వర్కర్లకు అంగన్వాడీ కేంద్రం పిల్లలకు పునాది స్థాయి నుంచి నేర్పించాలి అనే వాటి మీద అవగాహన కల్పించడం, అలాగే ఆడపిల్లలు ,మగ పిల్లలు ఒకటే ,ఒకే విధంగా చూసుకోవాలని విషయాల పైన కూడా అవగాహన కల్పించడమైనది. తర్వాత టి.ఎల్.ఎం . తయారు చేసే విషయంలో అంగన వాడి వర్కర్లను గ్రూపులుగా తయారు చేయడం జరిగినది .ఈ గ్రూపులలో బాగా టి.ఎల్.ఎం .తయారుచేసిన గ్రూప్కు బహుమతులు ప్రధానం చేయడం జరిగినది .

ఈ 6 వ రోజు జ్ఞాన జ్యోతి 120 శిక్షణా కార్యక్రమానికి ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చిన డిఆర్పి లు వెంకట నాయుడు, రామమూర్తి, సూర్యనారాయణ , ఐసిడి ఎస్ సూపర్వైజర్స్ లీలావతి ,శ్రీవాణి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొనడం జరిగినది.

# ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణను పరిశీలించిన డీపీఓ

రాప్తాడు ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియను డీపీఓ జి. నాగరాజు నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాబితా ప్రచురణలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ముసాయిదా జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అర్హులైన ఓటరు పేరు జాబితాలో గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే జాబితాలో పేర్లు, వివరాల నమోదులో తప్పులు లేకుండా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జాబితా ప్రచురణకు సంబంధించి చేపడుతున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని డీపీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అశోక్‌బాబు, రాప్తాడు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# 'స్థానికం'లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

- రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి సవిత
- న్యాయ పోరాటానికి కూటమి ప్రభుత్వం సిద్ధం
- బీసీ రిజర్వేషన్ల అమలుతో జగన్ లో గుబులు

బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

- 5 ఏళ్ల పాలనలో బీసీలను అణగదొక్కారు
- స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కుదింపుతో 16,800 పదవులకు బీసీలు దూరం
- జగన్ ధన దాహానికి బీసీలు బలి
- ఆనాడు బీసీల సంక్షేమం ఎందుకు రాలేదు..?
- స్థానిక ఎన్నికల కోసమే జగన్ మొసలి కన్నీరు
- వెనుకబడిన కులాలను అక్కున చేర్చుకున్న సీఎం చంద్రబాబు
- సామాజిక, రాజకీయ గుర్తింపునకు ప్రాధాన్యం : మంత్రి సవిత
- రొద్దం మండలం కొగిరలో ఇంటింటికీ తెలుగుదేశం
- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 5లక్షల చెక్ అందజేత

రొద్దం ఆగస్టు 25,అనంత జనశక్తి న్యూస్

'బీసీల గురించి మాట్లాడే అర్హత మీకు లేదు... మీ అయిదేళ్ల పాలనలో బీసీలను అణగదొక్కారు...ఇదేంటని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి జైల్లో బంధించారు... బీసీ బిడ్డను పెట్రోల్ పోసి తగులబెట్టారు... అక్రమ సంపాదనకు, అవినీతికి బీసీలను పావులుగా చేసుకున్నారు... చివరికి బీసీ బిడ్డలు చదువుకోవడం ఇష్టం లేక అయిదేళ్లలో బీసీ హాస్టళ్లను, గురుకులాలను గాలి కొదిలేశారు... ఆనాడు బీసీల సంక్షేమం ఎందుకు గుర్తుకు రాలేదా..?'అని జగన్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ప్రశ్నించారు. బీసీలను రాజకీయంగా జగన్ దెబ్బతీస్తే... వెనుబడిన వర్గాలను సీఎం చంద్రబాబునాయుడు అక్కున చేర్చుకున్నారన్నారు. బీసీలకు ఒకవైపు సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, రాజకీయంగా వారి ఉన్నతికి పదవులు కేటాయిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, ఇందుకోసం న్యాయ పోరాటం చేస్తామని మంత్రి సవిత స్పష్టంచేశారు. రొద్దం మండలం కొగిర గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, పెనుకొండ నియోజక వర్గంలో 85 శాతం మేర ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని, తమ నాయకులకు, కార్యకర్తలకు ఘన స్వాగతం పలుకుతున్నారని ఆమె ఆనందం వ్యక్తంచేశారు.

**బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు**

నా బీసీలంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బడుగు, బలహీన వర్గాల వారిని తన అయిదేళ్ల పాలనలో అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు. సంక్షేమం, స్వయం ఉపాధి పథకాలు నిలిపేసి ఆర్థికంగా నిలదొక్కుకోకుండా అడ్డుకున్నారన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి, బీసీలను రాజకీయంగా దెబ్బతీశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. బీసీ బిడ్డలు చదువుకోవడం ఇష్టం లేక బీసీ హాస్టళ్లను, గురుకులాలను గాలికొదిలేశారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బీసీ నాయకులను



అక్రమ కేసులు బనాయించి, జైల్లో నిర్బంధించారన్నారు. చివరికి బీసీలకు రక్షణ లేకుండా చేశారన్నారు. బీసీ బిడ్డపై పెట్రోల్ పోసి తగులబెట్టారన్నారు. వైసీపీ హయాంలో బీసీల జీవితం నరకప్రాయం మారిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండడంతో, బీసీలపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్ లేదని మంత్రిసవిత స్పష్టం చేశారు.

**జగన్ అవినీతికి బీసీలు బలి**

జగన్ అవినీతి, అక్రమార్జనకు వైసీపీకి చెందిన బీసీ నాయకులు బలైపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. బీసీ నాయకులకు పదవులు ఆశ చూపి, వారిని అక్రమ మద్యం తయారీ, మద్యం రవాణా, ఇసుక అక్రమ తవ్వకాలు ఇలాంటి కేసులు వారిని పావులుగా చేశారన్నారు. జగన్ ధన దాహానికి ఆయా కేసుల్లో బీసీలు ఇరుక్కోవడం బాధాకరమని మంత్రి సవిత అన్నారు. బీసీల మేలు కోరే సీఎం చంద్రబాబునాయుడు వారి రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు.

**34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం...**

స్థానిక సంస్థల్లో బీసీలకు మొట్టమొదటి సారిగా అన్న ఎన్టీఆర్ 27 శాతం మేర రిజర్వేషన్లు కల్పించారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. 2013లో జరిగిన ఎన్నికల్లో ఆ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయన్నారు. 2021లో బీసీ రిజర్వేషన్లను జగన్ 24 శాతానికి కుదించారన్నారు. దీనివల్ల బీసీలకు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బీసీల సంక్షేమం కోరే సీఎం చంద్రబాబునాయుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని నిర్ణయించారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామన్నారు. అంతకుముందు కొగిరి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఆంజనేయుల కుటుంబానికి మంత్రి సవిత పరామర్శించారు. రూ.5 లక్షల జీవిత బీమా చెక్ ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమమే మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఆయన ముందు చూపుతో అమలుచేసిన రూ.5 లక్షల జీవిత బీమా కష్ట కాలంలో ఉన్న బాధిత కుటుంబాలకు ఆసరాగా ఉంటోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొమ్మేపర్తిలో నూతన ఆలయ ప్రారంభోత్సవం

రాప్తాడు ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లా రాప్తాడు మండలం బొమ్మేపర్తి గ్రామంలో శ్రీ తాటిచెర్లప్ప స్వామి, శ్రీ రేణుక ఎల్లమ్మ స్వామి నూతన దేవాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది.కార్యక్రమానికి బందోబస్తు కోసం వచ్చిన రాప్తాడు సీఐ వెంకటేష్ స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భక్తులు, గ్రామ ప్రజలు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుడి పిన్న పెద్దలు డొక్కా ఉజ్జినప్ప, డొక్కా గోపాల్, డొక్కా రమణ, డొక్కా పెద్దయ్య, డొక్కా బాలకృష్ణ, డొక్కా భగవంతు, తదిత



# నారా లోకేష్‌కు ఘన స్వాగతం

- మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ....
- ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్.....
- పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు....

ధర్మవరం ఆగష్టు 25 అనంత జనశక్తి న్యూస్ :



అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను కనేకల్లులో టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. మంత్రి నారా లోకేష్‌తో జరిగిన ఈ భేటీలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది. పార్టీ బలోపేతం, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు పరస్పరం చర్చించారు. రాష్ట్ర అభివృద్ధిలో యువతకు పెద్దపీట వేస్తూ మంత్రి నారా లోకేష్ ముందుకు సాగుతున్నారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

# రాప్తాడు మండలానికి మరో విద్యుత్ సబ్ స్టేషన్



- హర్షం వ్యక్తం చేసిన బండమీదపల్లి గ్రామస్తులు
- ఎమ్మెల్యే పరిటాల సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు
- ఇప్పటికే 5సబ్ స్టేషన్లు నియోజకవర్గానికి వచ్చాయన్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తీర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పరిటాల సునీత అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి 5విద్యుత్ సబ్ స్టేషన్లను తీసుకురాగా... తాజాగా రాప్తాడు మండలం బండమీద పల్లి గ్రామానికి 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో బండమీదపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే పరిటాల సునీతను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం చేశారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని... సబ్ స్టేషన్ రావడం వలన చాలావరకు అ సమస్యలు తీరుతాయని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో విద్యుత్ కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే గ్రామాల్లో కూడా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నూతన సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు పెద్ద ఎత్తున నియోజకవర్గానికి తీసుకొస్తున్నట్లు ఆమె చెప్పారు. త్వరలోనే 3కోట్ల రూపాయలతో ఈ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.....

# అనారోగ్యంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే దగ్గుపాటి



- సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4.53లక్షల సాయం
- మృతుని భార్యకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం ఆగస్ట్ 25, అనంత జనశక్తి న్యూస్

అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబానికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అండగా నిలిచారు. అనంతపురం నగరంలోని 37వ డివిజన్ కు చెందిన శ్రీధర్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. లక్షలకు లక్షలు ఖర్చు పెట్టినప్పటికీ ఆయన మరణించాడు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేయించారు. దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. మృతుని కుటుంబానికి రూ.4.53లక్షలు వచ్చేలా చేశారు. ఈ చెక్కును మృతుడు శ్రీధర్ భార్య అరుణకుమారికి అందజేశారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఈ చెక్కును అందుకున్న అరుణకుమారి ఎమ్మెల్యే దగ్గుపాటికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పేదల వైద్య విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత ఖర్చు అయినప్పటికీ సాయం చేస్తున్నారని.. ఇప్పటికే అర్బన్ నియోజకవర్గంలో 7కోట్లకుపైగా సాయం చేసినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇంచార్జ్ దాదా ఖలందర్, కోనంకి భక్తవత్సలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల్లో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం



**- రూ.10లక్షల ఇన్సూరెన్స్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత**
**- పాపంపల్లి గ్రామానికి చెందిన మానసకు రూ.7.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

**రాప్తాడు ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

రోడ్డు ప్రమాదంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రూ.10లక్షల ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. రాప్తాడు మండలం, బండమీదపల్లి గ్రామానికి చెందిన అంకె భాస్కరప్ప, అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డి గ్రామానికి చెందిన దాసరి రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీత వారికి తెలుగు దేశం పార్టీ సభ్యత్వం ఉండటంతో పార్టీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పన ఇన్సూరెన్స్ పత్రం పార్టీ కార్యాలయం నుంచి వచ్చింది.అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రమాద బీమా పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మండలాల టిడిపి నాయకులు, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం ఆత్మకూరు మండలం ముట్టాల పంచాయతీ పాపంపల్లి గ్రామానికి చెందిన చవ్వా మానసకి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన మానస ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. భారీగా డబ్బు ఖర్చు కావడంతో ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి విషయాన్ని తీసుకొచ్చారు. దీంతో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా మాట్లాడి 7లక్షల 50వేల రూపాయలు మంజూరయ్యేలా చూశారు. మానసకు తన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మండల నాయకులతో కలిసి రూ.7.50లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మానస ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎప్పుడు ముందుంటారని అన్నారు. పార్టీ కోసం కష్టపడే ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా.. ఆ కుటుంబం ఇబ్బంది పడకూడదని కేవలం 100 రూపాయలతో ఐదు లక్షల రూపాయల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిన నాయకుడు నారా లోకేష్ అన్నారు. దీని ద్వారా ఎంతోమంది కార్యకర్తల కుటుంబాలకు న్యాయం జరుగుతోందని అన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యం విషయంలో ఉదారంగా స్పందిస్తున్నారని.. కొందరు ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే ఆయన సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారని వివరించారు....

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించుకోవాలి




**- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు,25:అనంత జనశక్తి న్యూస్**

తెలుగు భాషా వికాసానికి, పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల ప్రచార పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...
మాతృభాష అయిన తెలుగును కాపాడుకోవడం మరియు దాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా విశిష్టతను చాటేలా వివిధ పోటీలు, కార్యక్రమాలు నిర్వహించాలి.గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య,

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి మంత్రి సవితమ్మ పరామర్శ



**- ప్రమాదంలో మృతి చెందిన రాహుల్‌కు నివాళులర్పించిన మంత్రి**

**పెనుకొండ ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని కోగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గంగన్న కుమారుడు రాహుల్ ఇటీవల బైక్ ప్రమాదానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ కోగిరి గ్రామంలోని రాహుల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాహుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సవితమ్మ తెలిపారు. రాహుల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

# ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ

**- అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలి**
**- వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి**
**- విద్యార్థులకు ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షల నిర్వహించాలి**
**- వసతి గృహాలలో ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలి**
**- జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**

**అనంతపురం, ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు.మంగళవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని వివిధ శాఖల సంక్షేమ అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖల అధికారులు సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని వసతి గృహాలలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఆర్వో ప్లాంట్ లేని చోట గోరువెచ్చని నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతినెలా క్రమం తప్పకుండా ఆయా వసతి గృహాల సమీపంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లతో వైద్య పరీక్షలు తప్పక చేయించాలన్నారు. ప్రతి వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం ఇవ్వాలన్నారు. విద్యార్థుల భోజన విషయంలో ఎటువంటి సమస్యలు వచ్చిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం నాణ్యతగా ఉండాలన్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితులలో విద్యార్థులకు ఇవ్వకూడదన్నారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం ప్యాకెట్లు ఎప్పటికప్పుడు ఎక్స్పైర్ డేట్ చెక్ చేసి తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులందరు ఎత్తుకు తగ్గ బరువు, మరియు పౌష్టికాహార లోపం లేకుండా ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేటట్లు అక్కడి సిబ్బంది చూడాలన్నారు.ఈ ఏడాది పదవ తరగతిలో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఉత్తీర్ణత శాతం తగ్గకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య 100% ఉండేటట్లు చూడాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి చేర్పించే విధంగా సంక్షేమ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ అధికారులకు కూలంకుషంగా వివరించి దిశా, నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత..

**- హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా నీటి లభ్యతపై అధికారులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఉన్నత స్థాయి సమీక్ష..**
**- ఎల్.నినో నేపథ్యంలో జిల్లాలో రైతులు ఎక్కువ నీరు అవసరమయ్యే వరి, మిరప సాగు చేయవద్దు..**
**- రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్...**

**అనంతపురము, ఆగస్ట్ 25 : అనంత జనశక్తి ప్రతినిధి**



సూపర్ ఎల్.నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలో రైతులు వరి, మిరప సాగు చేయవద్దని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు.కనేకల్ మండలం నల్లంపల్లిలో మంగళవారం సాయంత్రం సూపర్ ఎల్.నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో తాగునీటి అవసరాలు మరియు ప్రస్తుత నీటి నిల్వలపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, హెచ్.ఎన్.ఎస్.ఎస్, హెచ్.ఎల్.సి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారు అత్యవసర ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి కూలంకషంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరిస్తూ తుంగభద్ర డ్యామ్ నుండి 16 టీఎంసీల నీరు కేటాయించడం జరిగిందని, తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఆవిరి నష్టాల (Evaporation Losses) కారణంగా జిల్లా వరకు చేరేసరికి సరాసరి 9 నుంచి 10 టీఎంసీల నీరు అందుతుందని తెలిపారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ నుండి కేటాయించిన 4 టిఎంసీల నీటి మోతాదు తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల దృష్ట్యా ప్రజల తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.తాగునీటి అవసరాలు తీరిన తర్వాత ఏమైనా స్వల్పంగా నీరు మిగిలితే, కనీసం జొన్న, మొక్కజొన్న, కంది వంటి ఆరుతడి పంటలకు అందించే వీలుందా అనే అంశంపై అధికారులతో మంత్రి చర్చించడం జరిగింది. ప్రస్తుతం సాగునీటి విడుదలపై అధికారులు నిస్సహాయత వ్యక్తం చేశారు.మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఎల్.నినో నేపథ్యంలో జిల్లాలో రైతులు వరి, మిరప సాగు చేయరాదన్నారు. తుంగభద్ర నుంచి వస్తున్న నీరు ప్రస్తుతం జిల్లా తాగునీటి అవసరాలకు సరిపోతోందని, హంద్రీనీవా (HNSS) నుంచి తాగునీటిని డ్రింకింగ్ వాటర్ కేటాయింపులకు అనుసంధానించడం, అప్పర్ రీచ్‌లో రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తాగునీటి సమస్య తీర్చవచ్చని తెలిపారు. నిన్న సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (KRMB) సమావేశం వాయిదా పడటంతో హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులపై తుది నిర్ణయం అధికారులు తీసుకోలేకపోయారని తెలిపారు. బోర్డు సమావేశం అనంతరం దీనిపై స్పష్టత రానుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నీటి ఎద్దడి దృష్ట్యా రైతులు వరి, మిరప వంటి అధిక నీటి వినియోగ పంటలు వేయవద్దని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని ఆరుతడి లేదా ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.రాబోయే రెండు మూడు రోజుల్లో 'ఈపంట' ఆధారంగా క్షేత్రస్థాయిలో బోర్‌వెల్ ఆధారిత పంటల సాగు ఎంత ఉందో, బోర్‌వెల్ సౌకర్యం లేని సాగు భూములు ఎన్నో స్పష్టమైన డేటా సేకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు, ప్రజలకు నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.నీటి లభ్యత మరియు విడుదలపై రైతులకు ఖచ్చితమైన సమాచారం చేరవేసేందుకు వాట్సాప్ గ్రూప్‌లు, రైతు సంఘాలు, మరియు గ్రామ స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల ద్వారా నిరంతరం కమ్యూనికేట్ చేయాలని మంత్రి ఆదేశించడం జరిగింది. సమగ్ర ప్రణాళికతో పూర్తిస్థాయి అభ్యాసం (abstract) సిద్ధం చేసిన పిమ్మట, అధికారులతో చర్చించి తదుపరి నిర్ణయాలను వెల్లడిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో హెచ్.ఎన్.ఎస్.ఎస్ ఎస్ఈ రాజగోపాల్, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, వ్యవసాయ శాఖ అధికారి సాలు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన




**- రూ.10వేల కోట్ల పెట్టుబడి, 1,325 మెగావాట్ల సామర్థ్యం**
**- 4వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్న సుజ్లాన్ సంస్థ**
**- సుజ్లాన్ S144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను ప్రారంభించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**

**రాయదుర్గం: ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

పవన విద్యుత్ రంగంలో ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామం వద్ద సుజ్లాన్ 1,325 మెగావాట్ల విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయా పవన విద్యుత్ ప్రాజెక్టులు రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యంతో నెలకొల్పనున్నారు. ఇందులో భాగంగా సుజ్లాన్ S144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. రూ.10వేల కోట్ల పెట్టుబడితో సుజ్లాన్ సంస్థ ఏర్పాటుచేయనున్న పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముందుగా కణేకల్లు మండలం హులికెరకు చేరుకున్న మంత్రి లోకేష్ కు సుజ్లాన్ కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సుజ్లాన్ 1,325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు సుజ్లాన్ S144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ఏవీని మంత్రి వీక్షించారు. అంతకు ముందు బళ్లారి సమీపంలోని హలకుంది గ్రామంలో సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించారు. సుజ్లాన్ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విండ్ టర్బైన్ పై సంతకం చేశారు. సుజ్లాన్ సంస్థ ప్రస్తుతం 1,700కు పైగా మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో ఏపీలో అతిపెద్ద విండ్ భాగస్వామిగా అవతరించింది. 2030 నాటికి 5వేల మెగావాట్ల అదనపు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపన లక్ష్యంగా సుజ్లాన్ సంస్థ ప్రణాళికలు రూపొందించి, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వీబీ రావు, టాటా పవర్ ఎండీ, సీఈవో సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హా అభయ్ సిన్హా పర్మార్, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.



# చంద్రబాబు అరెస్ట్ సమయంలో బళ్ళారి తెలుగువారు చూపిన ధైర్యాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా



- ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా వారి సంక్షేమమే టీడీపీ ధ్యేయం
- దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా దక్షిణ భారతదేశాన్ని నంబర్-1గా నిలబెట్టాలి
- ఆంధ్రప్రదేశ్‌లో తెలుగువారికి అద్భుతమైన అవకాశాలు.. రాష్ట్రానికి తిరిగి రండి!
- బళ్ళారిలోని తెలుగు ప్రజలకు మంత్రి నారా లోకేష్ పిలుపు

**బళ్ళారి,ఆగస్టు 25, అనంత జనశక్తి ప్రతినిధి**

బళ్ళారి మండలం కుడితినిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు స్థానిక తెలుగు ప్రజానీకం, యువత, టీడీపీ అభిమానులు ఘనస్వాగతం పలికారు. స్థానిక తెలుగు సంఘాల ఆధ్వర్యంలో భారీ గజమాలతో మంత్రిని సత్కరించి, పెద్దఎత్తున బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ...

**ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగువారి సంక్షేమమే టీడీపీ ధ్యేయం**

"దశాబ్దాల క్రితం ఉపాధి కోసం బళ్ళారికి వచ్చి స్థిరపడినా... మీ హృదయంలో ఆంధ్రప్రదేశ్ స్థానం ఎప్పటికీ పదిలమే. ఇక్కడ ఆర్థికంగా ఎదుగుతున్నప్పటికీ, మీ మనసంతా నిరంతరం మన రాష్ట్ర శ్రేయస్సు పైనే ఉంటుంది. నాడు ఆత్మగౌరవ నినాదంతో, తెలుగుజాతి ఐక్యత, ఉన్నతి కోసం నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ప్రపంచంలో తెలుగు వారు ఎక్కడున్నా వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ఏకైక పార్టీ తెలుగుదేశం. ఆనాడు ఉత్తరాఖండ్ విపత్తులో చిక్కుకున్న మనవారిని కాపాడేందుకు స్వయంగా చంద్రబాబు రెస్క్యూ బృందంతో వెళ్లారు. 'మీరు తెలుగువారైతే ధైర్యంగా విమానం ఎక్కండి... మిమ్మల్ని సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యత నాది' అని భరోసానిచ్చి వారిని కాపాడిన ఘనత ఆయనది. అన్ని రంగాల్లోనూ తెలుగువారు నంబర్ 1గా నిలవాలన్నదే మన అందరి లక్ష్యం. బళ్ళారిలో నివసిస్తూ కూడా ఐక్యతతో మెలుగుతూ, ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్న మీ కృషి అభినందనీయం" అని అన్నారు.

**బళ్ళారి గడ్డపై మీ పోరాటం మాకు కొండంత అండనిచ్చింది**

"2023 సెప్టెంబర్ 9న ఏ తప్పూ చేయని మన నాయకుడు చంద్రబాబు గారిని అరెస్ట్ చేసినప్పుడు మా కుటుంబం ఎంతో వేదనకు, ఆందోళనకు గురైంది. అలాంటి క్లిష్టమైన సమయంలో మా కుటుంబానికి కొండంత అభయంగా నిలిచింది మీరే. భయానక వాతావరణం నెలకొన్న ఆ రోజుల్లో, ధైర్యంగా బయటకు వచ్చి బళ్ళారి గడ్డపై మీరు చేసిన ధర్నా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరిలో కొత్త స్ఫూర్తిని నింపింది. మీరు అందించిన ఆ ధైర్యాన్ని మేము ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటాం. మిమ్మల్ని జీవితాంతం గుర్తుపెట్టుకుని, మీకు అండగా నిలబడే బాధ్యత నాది. ఆంధ్ర రాష్ట్రానికి రండి, మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం. తెలుగువారందరూ ఎక్కడున్నా ఐక్యంగా ఉండాలనేదే మా ఆశయం" అని అన్నారు.

**దక్షిణ భారత అభివృద్ధికి కర్ణాటక–ఆంధ్రప్రదేశ్ కలిసి ముందడుగు వేయాలి**

"కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఎప్పటినుంచో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నాయి. నాడు కర్ణాటక మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ , అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీతత్వమే నేడు బెంగళూరు, హైదరాబాద్ నగరాలను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. అదే స్ఫూర్తితో మనం మళ్లీ ముందడుగు వేయాలి. ఇటీవల దక్షిణ భారత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ "దక్షిణ భారతదేశమంతా ఒక్కటై కలిసికట్టుగా అభివృద్ధి సాధించాలి" అని పిలుపునిచ్చారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా మన రాష్ట్రాల మధ్య విబేధాలను పక్కనబెట్టి, దక్షిణ భారత దేశంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయాలని ఆకాంక్షించారు. చివరి ఎకరా వరకు సాగునీటిని అందిస్తేనే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని నొక్కి చెప్పారు. దీనికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సైతం స్పందిస్తూ, ఉత్తర భారతదేశంలో మాదిరిగానే దక్షిణాన కూడా నదుల అనుసంధానానికి సహకరిస్తామని స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశాన్ని అన్ని రంగాల్లోనూ దేశంలోనే నెంబర్ 1గా నిలబెట్టాలంటే మనమందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది" అని తెలిపారు.

**బళ్ళారి తెలుగు ప్రజల సేవాభావం, ఎన్టీఆర్‌పై అభిమానం అభినందనీయం**

"బళ్ళారిలో మీ సొంత నిధులతో 'అన్న క్యాంటీన్' ఏర్పాటు చేసి, ఎంతోమంది పేదల ఆకలి తీర్చడం ప్రశంసనీయం. ఇక్కడి స్థానిక ప్రభుత్వంతో పోరాడి, ఎన్టీఆర్ పేరుమీద 'ఎన్టీఆర్ సర్కిల్' ఏర్పాటుకు జీవో సాధించడం చూస్తుంటే ఆయనపై మీకు ఉన్న అభిమానం, గౌరవం స్పష్టమవుతున్నాయి. తెలుగుజాతి ఆత్మగౌరవానికి, ప్రగతికి ప్రతీక మన నందమూరి తారక రామారావు . ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా ఆయనకు ఘన నివాళిగా విగ్రహాలను ఏర్పాటు చేసుకుంటారు. త్వరలోనే ఇక్కడ కూడా ఎన్టీఆర్ గారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనే మీ సంకల్పానికి నా పూర్తి మద్దతు ఉంటుంది.





తెలుగువారు ఎక్కడున్నా వారికి అండగా నిలవడమే మా బాధ్యత. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. మీకు ఎంతో ఆప్తుడైన పయ్యావుల కేశవ్ గారు ఆర్థిక మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని సేవలు అందిస్తున్నారు. ఆయన మీకు నిరంతరం అందుబాటులో ఉంటారు. మీరు కూడా ఆంధ్ర రాష్ట్రానికి వచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నాను. మీ అభివృద్ధికి, సంక్షేమానికి మేము ఎల్లవేళలా అండగా ఉంటాం" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, బళ్ళారి టీడీపీ నాయకులు రాము, అనూప్ కుమార్ మరియు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

---

# స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే మన లక్ష్యం

- కూటమి ఐక్యతను కాపాడండి..
- అనంతపురం అభివృద్ధి నా బాధ్యత..
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం
- మై టీడీపీ యాప్‌లో కార్యకర్తల ఫీడ్‌బ్యాక్‌కు ప్రాధాన్యత..
- రాయదుర్గం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్





**రాయదుర్గం ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడమే తమ లక్ష్యమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్ మండలం నల్లంపల్లి వద్ద నిర్వహించిన నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**రాయదుర్గం ప్రజలకు ప్రేమ, పౌరుషం, అభిమానం ఎక్కువే**

"విజయనగరం రాజుల మూడో రాజధాని రాయదుర్గం. రాయదుర్గం కోటలో ఎంత పౌరుషం ఉందో.. ఇక్కడి ప్రజల్లోనూ అంతే పౌరుషం ఉంది. ఇక్కడ పట్టు చీరలు, జీన్స్ ఎంత ఫేమసో.. మీ ప్రేమ, అభిమానం, స్టైల్ కూడా అంతే ఫేమస్. అవన్నీ ఈరోజు ప్రత్యక్షంగా చూశాను. గత 11 ఎన్నికల్లో టీడీపీ కేవలం 4 సార్లు మాత్రమే గెలిచినా.. గెలిచినా, ఓడినా రాయదుర్గం నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ఓబుళాపురం గనుల పేరుతో అడ్డగోలుగా అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పుడు కమిటీ వేసి ప్రజల తరపున పోరాడింది టీడీపీ. నాడు మనం చేసిన పోరాటానికి ఫలితంగా తాజాగా తీర్పు వచ్చింది. ప్రజల కోసం పోరాడింది.. ప్రజల తరపున నిలబడింది తెలుగుదేశం పార్టీనే. మీ అందరి కష్టం, శ్రమతో 2024లో కాలవ శ్రీనివాసులు గారిని 43 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించుకున్నాం. పట్టుదల, క్రమశిక్షణతో నియోజకవర్గానికి నాయకత్వం వహిస్తున్న కాలవ శ్రీనివాసులు . ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధి గురించే మాట్లాడుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంది. ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాయదుర్గం ప్రాంతంపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా కాలవ శ్రీనివాసులు నిరంతరం కృషి చేస్తున్నారు. అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రానికి అవసరమైన అంశాలపై కూడా మాకు విలువైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు" అని తెలిపారు.

**కార్యకర్తలే పార్టీకి బలం**

"ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా వేదికపై కూర్చున్నామంటే దానికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే. అహర్నిశలు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా 201924 మధ్య కాలంలో దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు ఎదురైనా ఎత్తిన పసుపు జెండాను దించకుండా పార్టీ కోసం పోరాడారు. గొడ్డలి పార్టీ కుట్రలకు, అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం. అందుకే తెలుగుదేశం పార్టీ కార్యకర్తే అధినేత. దేశంలో మరే రాజకీయ పార్టీ కల్పించని విధంగా కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తున్న పార్టీ టీడీపీ. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటికే రూ.160 కోట్లు ఖర్చు చేశాం. కష్టపడి పని చేస్తున్న నిజమైన కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం కల్పించడమే మా లక్ష్యం" అని అన్నారు.

**మైటీడీపీ యాప్‌లో మీ ఫీడ్ బ్యాక్ ఇవ్వండి.. నేను పరిష్కరిస్తాను**

"యువగళం పాదయాత్రలో కార్యకర్తలను కలిసినప్పుడు.. "పార్టీ కోసం పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వండి.. మమ్మల్ని గుర్తించండి" అని చాలామంది కోరారు. అందుకే మైటీడీపీ యాప్‌ను తీసుకొచ్చాం. మీరు పాల్గొనే ప్రతి పార్టీ కార్యక్రమం, మీరు సొంతంగా చేపట్టే ప్రతి కార్యక్రమం పార్టీకి తెలియాలంటే మైటీడీపీ యాప్‌లో ఫీడ్ చేయండి. క్లస్టర్, యూనిట్, బూత్ సమావేశాల్లో మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను మేము చదువుతున్నాం. మీరు చెప్పే సమస్యలు, సూచనలు మాకు చేరడం లేదనే అపోహ వద్దు. కొత్త పెన్షన్లు, ఇళ్లు ఇవ్వాలని కార్యకర్తలే ఫీడ్‌బ్యాక్‌లో కోరారు. కొత్త పెన్షన్ లు ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. ఇలా మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే నేను నిర్ణయాలు తీసుకుంటాను. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కచ్చితంగా గుర్తింపు దక్కుతుంది. మీరు మమ్మల్ని వెతుక్కుంటూ రావాల్సిన అవసరం లేదు.. మేమే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాం. కోటి మంది సభ్యులతో కూడిన కుటుంబం మనది. సముద్రం లాంటి ఈ కుటుంబంలో సమస్యలు సహజం. మనలో మనమే చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలి. ఎక్కడైనా మీ సమస్య పరిష్కారం కాకపోతే మా దగ్గరకు రండి. మీకు అండగా నేను ఉంటాను. కార్యకర్తల కోసం, పార్టీ కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తాం" అని హామీ ఇచ్చారు.

**టీడీపీలో కార్యకర్తే అధినేత**

**ముఖ్యమంత్రి చంద్రబాబు గ**

ఏ నియోజకవర్గానికి వెళ్లినా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అనంతరం కార్యకర్తలను కలవడానికే ప్రాధాన్యత ఇస్తారు. ప్రతి కార్యకర్తతో మాట్లాడి, ఫొటో దిగి, వారి సమస్యలను తెలుసుకున్న తర్వాతే అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చే విలువకు ఇదే నిదర్శనం. 2025 మహానాడులో ప్రవేశపెట్టుకున్న ఆరు శాసనాల్లో "కార్యకర్తే అధినేత" అనేది అత్యంత ముఖ్యమైనది. టీడీపీలో కార్యకర్తే అధినేత. అందుకే మహానాడు, అసెంబ్లీ, మండలి సహా పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో కార్యకర్తలు ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి వేదికను పంచుకుంటున్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించడం టీడీపీ బాధ్యత. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. పార్టీ కోసం ప్రాణాలు వదిలిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు చట్టాన్ని సవరించి బిల్లు తీసుకొచ్చాం. వైసీపీ ఎమ్మెల్సీలు అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు బిల్లును చట్టంగా చేసి చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన గౌరవానికి ఇదే నిదర్శనం.

అనంత అభివృద్ధి నా బాధ్యత

"ఉమ్మడి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీకి కంచుకోట. మా కుటుంబాన్ని ఆశీర్వదించి గెలిపించిన ప్రజలు అనంతపురం జిల్లా ప్రజలు. నాడు ఎన్టీఆర్ గారిని గెలిపించి అసెంబ్లీకి పంపించిన గొప్ప నేల ఇది. మా హరిమామను శాసనసభకు, పార్లమెంట్‌కు, మా ముద్దుల మామ బాలకృష్ణని మూడు సార్లు అసెంబ్లీకి పంపించిన ఘనత అనంతపురం ప్రజలది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. అహర్నిశలు మీ కోసం కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను. అందుకే అనంతపురం జిల్లాకు ప్రత్యేక సంస్థలు, పరిశ్రమలు తీసుకొచ్చి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతిష్ఠాత్మకమైన ఫైటర్ జెట్ తయారీ సంస్థ కూడా అనంతపురం ప్రాంతానికి సొంతమైంది. ఏ రంగంలో అయినా ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. అదే పోటీతత్వం ఎమ్మెల్యేల మధ్య కూడా ఉండాలి. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై "మేడ్ ఇన్ ఉరవకొండ" అని మంత్రి కేశవ్ పెట్టుకుంటున్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాలకు కంపెనీలు తీసుకురావాలి.. తమ నియోజకవర్గానికి పేరు రావాలని పోటీతత్వంతో పనిచేయాలి" అని కోరారు.

**రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

"రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధికంగా పెన్షన్లు అందిస్తున్నాం. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. తల్లికి వందనం, చేనేతలకు ఉచిత విద్యుత్, చేనేత సేవ, మత్స్యకార సేవ, ఆటోవాలా సేవ వంటి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆర్థిక సహాయం అందిస్తున్నాం. పెన్షన్ల కోసం ఏటా రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ ఫైల్‌పైనే చేశారు. వెంటనే దాన్ని కార్యాచరణలోకి తీసుకొచ్చి 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. ఎన్ని కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా నియామకాలు పూర్తి చేశాం. కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. పరిశ్రమలను ఆకర్షిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నేడు పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. ఈ అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు. గొడ్డలి పార్టీలో గొడ్డలి బ్యాచ్, ఫ్యాక్షనిస్టులు, దొంగలు ఉంటారు కాబట్టే వారి ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. కానీ చంద్రబాబు ఆలోచన ఎప్పుడూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం చుట్టూనే ఉంటుంది. ఆ మార్పును మనమంతా ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం" అని అన్నారు.

**గొడ్డలి పార్టీవి అన్నీ డ్రామాలే**

"నేడు మనం గొడ్డలి పార్టీతో రాజకీయంగా పోరాడుతున్నాం. వారిలో వారే హత్యలు చేసుకుని.. ఆ నిందను మనపై వేసే నైజం వారిది. సొంత బాబాయిని హత్య చేసిన ఘటనలో ప్రొడక్షన్, డైరెక్షన్, ఫైనాన్స్ మొత్తం వాళ్లదే. 2019లో గొడ్డలి పార్టీకి చెందిన దొంగ పత్రికలో "నారాసుర రక్త చరిత్ర" అంటూ ఫొటో ప్రచురించి చంద్రబాబు గారిపై నిందలు వేశారు. ఆ ప్రచారాన్ని చూసి బాబాయి కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా నమ్మారు. కానీ ఇప్పుడు ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటకు వస్తున్నాయి. తాజాగా వారి ఎంపీ ఇంట్లోనే నోట్ల కట్టలు బయటపడటం దీనికి మరో ఉదాహరణ. కోడి కత్తి డ్రామా.. గులకరాయి డ్రామా. గులకరాయి వ్యవహారమైతే మరో హైలైట్. టెన్నిస్ బాల్ కంటే వేగంగా తిరిగిన ఆ రాయి.. జగన్‌కు తగిలి కింద పడాల్సింది పోయి పక్కనే ఉన్న ఓ నటుడికి తగిలిందట. మరీ విచిత్రంగా ఆ నటుడు ఒకరోజు ఒకవైపు, మరోరోజు మరోవైపు కట్టుకట్టుకుని కనిపించాడు. 201924 మధ్య గొడ్డలి పార్టీ హయాంలో కల్తీ మద్యం కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో జరిగిన లిక్కర్ స్కామ్‌పై ప్రస్తుతం ఈడీ విచారణ కొనసాగుతోంది. పూర్తి ఆధారాలతో గొడ్డలి పార్టీ మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే.. దానిపై కూడా మనల్ని తప్పుబడుతున్నారు. ఈడీ కేంద్ర దర్యాప్తు సంస్థ.. మనం చెబితే అరెస్టు చేసే జేబు సంస్థ కాదు. గొడ్డలి పార్టీ నుంచి భవిష్యత్‌లో ఇంకా ఎన్ని డ్రామాలు చూడాల్సి వస్తుందో!" అని ఎద్దేవ చేశారు.

**పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలి**

"జగన్ ప్రెస్‌మీట్ పెడితే మనందరికీ పండగే. చంద్రబాబు గారి ప్రెస్‌మీట్‌లో ఆయన చెప్పే విషయం ఏమీ తెలియని వారికి కూడా సులభంగా అర్థమయ్యేలా ఉంటుంది. కానీ మాజీ సీఎం జగన్‌కు డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియదు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ రెండూ ఒకటేనంటారు. జగన్ రెడ్డికి మరోసారి సవాల్ చేస్తున్నా. టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చేయి.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. అసెంబ్లీలోనూ ఎన్ని రోజులైనా చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. నా సవాల్‌ను స్వీకరించి ఎందుకు రావడం లేదు? ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించకుండా, ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదనే వాస్తవం బయటపడుతుందనే భయమా? ప్రెస్‌మీట్లు ఎందుకు.. అసెంబ్లీకి రా! పులివెందుల ప్రజలు నిన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వారి సమస్యలను అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించడం లేదు? రెండేళ్లలో జగన్ అసెంబ్లీకి వచ్చింది ఒక్కసారి మాత్రమే. అది కూడా ప్రమాణస్వీకారానికి వచ్చి వెళ్లిపోయారు. జగన్‌లా నేను కంచుకోటలో గెలిచిన వ్యక్తిని కాదు. 1988 తర్వాత టీడీపీ ఎప్పుడూ గెలవని మంగళగిరిలో తొలిసారి ఓడినా వెనక్కి తగ్గకుండా పోరాడి విజయం సాధించాను. కుప్పంలో పోటీ చేయమని చెప్పినా మంగళగిరిలోనే నిలబడి 91 వేల మెజార్టీతో గెలిచి ఆ విజయాన్ని చంద్రబాబు గారికి గిఫ్ట్ గా ఇచ్చాను. మంగళగిరి ప్రజల రుణం తీర్చుకుంటున్నాను. నీకు కూడా చిత్తశుద్ధి ఉంటే.. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా..!" అని సవాల్ విసిరారు.

**కూటమి ఐక్యతను కాపాడండి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే మన లక్ష్యం**

"కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి కూటమిలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలి. వాళ్ల ప్రచారాన్ని నమ్మి ఆవేశపడకుండా కూటమి ఐక్యతను కాపాడాలి. మనమంతా ఐక్యంగా ఉండి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుంది. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి కూటమి బలాన్ని మరింత పెంచాలి" అని పిలుపునిచ్చారు.

కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత నాది

"మీ అభిమానానికి నేను ధన్యుడిని. యువగళం పాదయాత్రలో కణేకల్‌కు రాలేకపోయిన లోటు నేడు తీరిపోయింది. మీరు ఇచ్చిన ఘన స్వాగతం, చూపించిన ప్రేమ, అభిమానం ఎప్పటికీ మరిచిపోలేను. పట్టణ అధ్యక్షుడి ఆత్మీయ పలకరింపు నా గుండెను హత్తుకుంది. వీలైతే మీ ఇంటికి భోజనానికి వస్తాను. గతంలో కణేకల్‌కు సీఎం చంద్రబాబు గారు వచ్చినప్పుడు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తిస్థాయిలో జరగడం లేదు. కానీ కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత నాది. నిధులు సమకూర్చే బాధ్యత మంత్రి కేశవ్ గారిది. రెండు సంవత్సరాల్లో అడ్మిషన్లు పూర్తిస్థాయికి తీసుకెళ్లే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జీ.లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి, అనంతపురం పార్లమెంట్ ప్రెసిడెంట్ పూల నాగరాజు, అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్ చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు బి. గురప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# డ్రంక్ అండ్, డ్రైవ్, తనిఖీలో పట్టుబడిన వ్యక్తి 7,రోజులు రిమండ్

**ఆమడగూరు ఆగస్టు 25 (అనంత జనశక్తి న్యూస్ )**

మండలంలోని వెంకట్ నారాయణ పల్లి క్రాస్,మూడు రోడ్ల కూడలి లో ఎస్ఐ గోపాల్ కృష్ణ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలానికి చెందిన లింగన్న అనే వ్యక్తి ఐచర్ వాహనం నడుపుతూ మద్యం సేవించి పోలీసులు తనిఖీ చేస్తుండగా అతనిని పరీక్ష చేయగా మద్యం సేవించినట్లు డ్రింకింగ్ డ్రైవ్ లో తేలింది అతనిని కదిరి కోర్టులో హాజరుపరచగా అతనికి 10000 జరిమానా విధించారు అతను 10000 జరిమానా చెల్లించకపోవడంతో అతనికి ఏడు రోజులు రిమాండ్ ఆదేశించారని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిబ్బంది, రమేష్ చంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు



---

# మరో మండల్ ఉద్యమానికి బీసీలు సిద్ధం కావాలి

- దేశవ్యాప్త ఉద్యమానికి సన్నాహాలు: డాక్టర్ పోతుల నాగరాజు

**అనంతపురం: ఆగస్టు 25,అనంత జనశక్తి న్యూస్**



బీసీల హక్కుల సాధన కోసం మరో మండల్ ఉద్యమానికి సిద్ధం కావాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు.దేశ జనాభాలో బీసీలు 56 శాతం ఉన్నప్పటికీ రిజర్వేషన్లు జనాభా నిష్పత్తికి అనుగుణంగా అమలు కావడం లేదని ఆయన అన్నారు. కేంద్రంలో 27 శాతం, కొన్ని రాష్ట్రాల్లో 25 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం, మరికొన్ని రాష్ట్రాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. బీసీలకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన రిజర్వేషన్ విధానం ఎందుకు లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు.మండల్ కమిషన్ సిఫార్సుల ప్రకారం బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టసభలు, విద్య, ఉద్యోగాలు, న్యాయ వ్యవస్థ, స్థానిక సంస్థలు, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.బీసీల హక్కుల కోసం అన్ని కుల, ప్రజా సంఘాలు ఏకమై దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని నాగరాజు పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు.

# బీసీల ఆత్మగౌరవ పరిరక్షకుడు చంద్రన్న

- చంద్రబాబు నాయుడు బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించారు
- బీసీలపై కక్ష సాధింపు జరిగిందని మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదు
- మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి ఆగస్టు 25, అనంత జనశక్తి ప్రతినిధి**

బీసీల ఆత్మగౌరవ పరిరక్షకుడిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చరిత్రలో నిలిచిపోతారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బీసీలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అవకాశాలు కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి ఉన్న చరిత్ర మరే రాజకీయ పార్టీకి లేదని స్పష్టం చేశారు. బీసీలపై కక్ష సాధింపు జరుగుతోందంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమన్నారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు సంస్థలు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుంటే వాటిని బీసీలపై కక్షగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై, ముఖ్యంగా బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలపై బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా తనకు బాధ్యత ఉందని భావించి ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి చేశారు :**
సమాజానికి, ప్రజలకు హాని కలిగించే వ్యక్తిని క్రిమినల్‌గా పరిగణిస్తామని, అలాంటి వ్యక్తి రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి అధికారాన్ని అడ్డం పెట్టుకొని వ్యవహరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు గత పరిణామాలను పరిశీలించాలని అచ్చెన్నాయుడు అన్నారు. 2004 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను ప్రజలు గమనించారని తెలిపారు. తప్పులు చేసే వ్యక్తి తన తప్పులను ఇతరులపై మోపి వారికి శిక్షలు పడేలా వ్యవహరించే విధానం అవలంబిస్తాడని ఆరోపించారు. అలాంటి రాజకీయ సంస్కృతికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడే ప్రతినిధిగా ఉన్నారని విమర్శించారు. తాను చెబుతున్న అంశాల్లోని వాస్తవాలను ప్రజలు ఒక్కసారి ఆలోచించి, పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2004లో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొన్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆ అవినీతి వ్యవహారాల్లో ఐఏఎస్ అధికారులను, మంచి పేరున్న పారిశ్రామికవేత్తలను, సామాన్యులను కూడా బలి చేశారని ఆరోపించారు. పలువురిని జైలుకు పంపిన గతాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ఆ తర్వాత ప్రజలకు మాయమాటలు చెప్పి, ఆచరణలో పెట్టలేని హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి 2019లో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకొని రాష్ట్రంలోని ప్రకృతి వనరులను దోపిడీ చేశారని ఆరోపించారు. అధికారాన్ని ఉపయోగించుకోవడమే కాకుండా అమాయకులైన బలహీన వర్గాల మెడమీద కత్తి పెట్టి పాలన సాగించారని అన్నారు. అప్పట్లో జరిగిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు.

**బలహీన వర్గాలపై కక్ష సాధింపు ఎవరు చేశారు? :**
వైసీపీకి చెందిన బలహీన వర్గాల నాయకులు గత రెండు రోజులుగా గొంతు చించుకొని చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ బలహీన వర్గాలపై కక్ష కట్టారని మాట్లాడుతున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. తప్పులు చేసి, అవినీతి, అక్రమాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కొని జైలుకు వెళ్తున్నప్పుడు దానిని బలహీన వర్గాలపై కక్షగా చిత్రీకరించడం సరికాదన్నారు. 2019-24 మధ్య బలహీన వర్గాలపై దమనకాండ జరిగిందని ఆరోపించారు. వైసీపీ నాయకులు బీసీల గురించి మాట్లాడే ముందు అప్పట్లో తమ ప్రభుత్వం బీసీ నాయకుల పట్ల ఎలా వ్యవహరించిందో గుర్తు చేసుకోవాలని సూచించారు. “నేను బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిని కాదా? మా సోదరుడు కొల్లు రవీంద్ర బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి కాదా? రాజకీయ చరిత్ర కలిగిన వెలమల రామకృష్ణ బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి కాదా? అయ్యన్నపాత్రుడు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి కాదా?” అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడికి అండగా నిలవడం, 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ దోపిడీ, ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచకాలను గొంతెత్తి ప్రశ్నించడమే తమ తప్పా అని ప్రశ్నించారు.

**తనపై రెండుసార్లు కేసులు పెట్టి జైలుకు పంపారు :**
తనను రెండుసార్లు జైలుకు పంపించారని అచ్చెన్నాయుడు తెలిపారు. తెలుగుదేశం పార్టీలో బలమైన గొంతుకగా ఉన్న తనను కేసులు పెట్టి జైలుకు పంపిస్తే భయపడి ఇక ఎవరూ బయటకు వచ్చి మాట్లాడరనే ఉద్దేశంతోనే చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. తనపై 80 రోజుల పాటు కేసు నడిపినా, తాను ఒక్క పైసా తీసుకున్నట్లు ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారన్నారు. ఆధారాలు లేకపోవడంతో ఆ కేసులన్నీ కొట్టివేయబడ్డాయని తెలిపారు. తాను చేసిన తప్పేమిటో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ధర్మాన ప్రసాద్‌పై అచ్చెన్నాయుడు ప్రశ్నలు :**
ధర్మాన ప్రసాద్ అప్పట్లో రెవెన్యూ మంత్రిగా ఉన్నారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తాను తన గ్రామంలో, ఇంట్లో, కార్యాలయంలో ఉన్నానని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తన వద్దకు వచ్చిన వారితో “మీలో మీరు కూర్చొని రాజీ చేసుకొని ఏకగ్రీవం చేసుకోండి” అని మాత్రమే చెప్పానని అన్నారు. తాను ఎవరినీ ప్రలోభపెట్టలేదని, ఎవరినీ బెదిరించలేదని, ఎవరినీ బాధపెట్టలేదని స్పష్టం చేశారు. తాను చెప్పిన మాటలకు సంబంధించిన రికార్డు కూడా బయటకు వచ్చిందని, ఆ రికార్డులోనూ తనపై ఆరోపణలకు ఆధారం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్ ఆదేశాలతో తనపై హత్యాయత్నం కేసు పెట్టి శ్రీకాకుళం జైలుకు పంపించారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ధర్మాన ప్రసాద్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీసీ నాయకులపై కేసులు పెట్టలేదా? :**
కొల్లు రవీంద్రకు ఒక ఫోన్‌కాల్ వచ్చిందనే కారణంతో ఆయనపై హత్య కేసు పెట్టి జైలుకు పంపారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. యనమల రామకృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని, అయ్యన్నపాత్రుడిపై అత్యాచారం కేసు పెట్టారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో బలహీన వర్గాల నాయకులు ఏ విధంగా బలయ్యారో వైసీపీ నాయకులు గుర్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు తమ కుటుంబాలకు సంబంధించిన వ్యవహారాల్లో దర్యాప్తు జరుగుతుంటే దానిని చంద్రబాబు, లోకేశ్‌పై కక్షగా మోపడం సరికాదన్నారు.

**కారుమూరి అరెస్టుకు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు :**
మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును ప్రస్తావించిన అచ్చెన్నాయుడు, ఆయన్ను అరెస్టు చేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేసి చర్యలు తీసుకుందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు చేరినట్లు దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఈడీ విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే దానిని బలహీన వర్గాలపై కక్షగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌పై మద్యం వ్యవహారాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు జరిగి అరెస్టు చేసినా దానిని కూడా చంద్రబాబు, లోకేశ్‌కు ఆపాదించడం రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న ప్రయత్నమని విమర్శించారు.



**కుటుంబ వ్యవహారాలను చంద్రబాబు, లోకేశ్‌కు ఆపాదించొద్దు :**
వైసీపీ నాయకులు తమ కుటుంబ వ్యవహారాల్లో తలెత్తిన సమస్యలను చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌కు ఆపాదిస్తూ విమర్శలు చేయడాన్ని అచ్చెన్నాయుడు తీవ్రంగా తప్పుబట్టారు. చంద్రబాబు, లోకేశ్ తమ రాజకీయ ప్రత్యర్థుల కుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే సంస్కృతి కలిగిన వారు కాదన్నారు. తమపై వస్తున్న ఆరోపణలకు ముందుగా వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని కోరారు. బలహీన వర్గాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు ఉందా..? అని ప్రశ్నించారు.

**బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప.. :**
స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తయినా, దేశంలోనూ రాష్ట్రంలోనూ అనేక రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నా బలహీన వర్గాలను ఓటు వేసే యంత్రాలుగా మాత్రమే ఉపయోగించుకున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతిపై వాస్తవంగా ఆలోచించి కార్యక్రమాలు అమలు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత బలహీన వర్గాలకు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అవకాశాలు పెరిగాయని తెలిపారు. అందుకే రాష్ట్రంలోని బలహీన వర్గాలు తెలుగుదేశం పార్టీని సొంత పార్టీగా భావించాయన్నారు. “బలహీన వర్గాలు అంటే తెలుగుదేశం.. తెలుగుదేశం అంటే బలహీన వర్గాలు” అనే స్థాయిలో బీసీలతో ఆ పార్టీకి అనుబంధం ఏర్పడిందని పేర్కొన్నారు.

**బీసీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వాల ప్రాధాన్యం :**
బలహీన వర్గాల రిజర్వేషన్లు, అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యం, స్వయం ఉపాధి వంటి అంశాల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయని అచ్చెన్నాయుడు తెలిపారు. 2014-19 మధ్య బలహీన వర్గాల సంక్షేమానికి స్వర్ణయుగం లాంటి కార్యక్రమాలు అమలు చేశామని అన్నారు. బీసీలకు విద్య, వైద్యం, స్వయం ఉపాధి కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రిజర్వేషన్ల విషయంలోనూ గతంలో ఎన్నడూ లేని విధంగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 2014లో తాను బీసీ మంత్రిగా ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ పాఠశాల చొప్పున 175 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు.

**ఆదరణ పథకం పరికరాలను గోదాముల్లోనే ఉంచారు :**
బీసీల సంప్రదాయ కులవృత్తులను ప్రోత్సహించేందుకు ఆదరణ పథకం కింద పనిముట్లు అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత లబ్ధిదారులకు అందించాల్సిన పరికరాలను గోదాముల్లోనే ఉంచి తుప్పు పట్టించారని ఆరోపించారు. బీసీలకు ఉపయోగపడే పరికరాలను అందిస్తే వారికి స్వయం ఉపాధి లభిస్తుందని తెలిసినా, కేవలం రాజకీయ కక్షతోనే వాటిని పక్కన పెట్టారని విమర్శించారు. బీసీల గురించి మాట్లాడుతున్న వైసీపీ నాయకులు ఐదేళ్ల పాలనలో బీసీల కోసం వాస్తవంగా ఏం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నాడు 54 బీసీ కార్పొరేషన్లకు నిధులు నిల్? :
వైసీపీ ప్రభుత్వం 54 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ప్రకటించిందని, అయితే వాటికి నిధులు ఇచ్చారా అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఒక్కో కార్పొరేషన్‌కు ఒక్క పైసా అయినా కేటాయించారా, కనీసం కూర్చోవడానికి కుర్చీలు అయినా ఇచ్చారా అని నిలదీశారు. బీసీలకు మంత్రులు, ఉపముఖ్యమంత్రులు ఉన్నారని చెప్పినా వారికి స్వేచ్ఛ ఉందా, మాట్లాడే అవకాశం ఉందా..? అని ప్రశ్నించారు. పదవులు ఇచ్చినంత మాత్రాన బీసీలకు రాజ్యాధికారం వచ్చినట్లు కాదని, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సి ఉంటుందన్నారు.

**బీసీలకు స్వేచ్ఛ లేకుండా చేశారు :**
వైసీపీ పాలనలో రాష్ట్రంలోని కీలక ప్రాంతాలను కొంతమంది వ్యక్తులకు అప్పగించి బీసీలకు స్వేచ్ఛ లేకుండా చేశారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఉత్తరాంధ్ర, గుంటూరు-కృష్ణా, ప్రకాశం నుంచి నెల్లూరు ప్రాంతాలు, రాయలసీమ వంటి ప్రాంతాల్లో ఆధిపత్య వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. బీసీలు కనీసం చిన్న పని కూడా స్వేచ్ఛగా చేసుకోలేని పరిస్థితిని గత ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. ఇప్పుడు అదే నాయకులు బీసీల హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

**ఎన్టీఆర్‌తోనే బీసీలకు రిజర్వేషన్లకు శ్రీకారం :**
స్వాతంత్ర్యం అనంతరం 1982 వరకు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు లేవని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 1984లో నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. 1985లో మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీల్లో బీసీలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం లభించిందని అన్నారు. బీసీలకు ఈ అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీ, ఎన్టీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.

**20 నుంచి 34 శాతానికి రిజర్వేషన్లు పెంచిన చంద్రబాబు :**
1994-95లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణలు చేసిన తర్వాత 1995లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని అచ్చెన్నాయుడు తెలిపారు. అప్పటివరకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లు బీసీల జనాభాకు సరిపోవని భావించి వాటిని 34 శాతానికి పెంచారని పేర్కొన్నారు. బీసీల జనాభా సమాజంలో సగభాగం ఉన్నందున వారికి మరింత రాజకీయ ప్రాతినిధ్యం అవసరమని భావించిన చంద్రబాబు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. దీనికి సంబంధించిన జీవోలు, చట్టాలు ఉన్నాయని, ఇందులో ఎలాంటి దాపరికం లేదని స్పష్టం చేశారు. 1995, 2001, 2009, 2013 సంవత్సరాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు 34 శాతం రిజర్వేషన్లతోనే జరిగాయని తెలిపారు. ఆ తర్వాత కూడా బీసీ రిజర్వేషన్లు కొనసాగాయని గుర్తు చేశారు.

**34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించారు?**
2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి ఎందుకు తగ్గించారో ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. 1994-95లో ఏర్పడిన చట్టం ప్రకారం 34 శాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నప్పుడు, దానిని సవరించకుండా కేవలం జీవో ద్వారా రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారని ఆరోపించారు. చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ అలా చేయకుండా తొందరపాటుగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. దీని వల్ల బీసీలకు సుమారు 16 వేల రాజకీయ పదవులు దూరమయ్యాయని పేర్కొన్నారు. ఇది బీసీలకు జరిగిన అన్యాయం కాదా అని ప్రశ్నించారు.

**హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదు? :**
బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసిన తర్వాత కనీసం సుప్రీంకోర్టుకు వెళ్లే ప్రయత్నం కూడా అప్పటి ప్రభుత్వం చేయలేదని అచ్చెన్నాయుడు విమర్శించారు. బీసీల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, ఆ విషయంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. బీసీ నాయకులు, వైసీపీ నేతలు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతే బీసీల గురించి మాట్లాడాలన్నారు.

**పాత చట్టం ప్రకారమే రిజర్వేషన్ల కోసం జీఓ :**
ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఎలాంటి రిజర్వేషన్ల చట్టాన్ని తీసుకురాలేదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 1994-95లో ఏర్పడిన పంచాయతీరాజ్ చట్టం రద్దు కాలేదని, అందులో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. ఆ చట్టం అమల్లోనే ఉన్నందున దాని ప్రకారమే ప్రభుత్వం జీవో జారీ చేసి ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. బీసీలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల్లో వారికి రాజకీయ అధికారాన్ని అందించాలన్న ప్రయత్నాలను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

**బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు :**
బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఎస్సీల రిజర్వేషన్లు ఎస్సీలకు, ఎస్టీల రిజర్వేషన్లు ఎస్టీలకు, మైనారిటీలకు ఉన్న హక్కులు వారికి కొనసాగుతాయని తెలిపారు. “ఏ ఒక్క వర్గానికీ బీసీలు వ్యతిరేకం కాదు. ఏ ఒక్క రిజర్వేషన్‌కు బీసీలు వ్యతిరేకం కాదు. మీ హక్కులు మీకు ఉంటాయి. బలహీన వర్గాల హక్కులు కూడా అవసరం” అని అన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిచేసి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తోందని, దీనికి ఎవరూ అడ్డంకులు సృష్టించవద్దని కోరారు.

**కోర్టుల్లోనూ చివరి వరకు పోరాటం :**
బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో కేసులు వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టులో న్యాయపోరాటం చేస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్తామని స్పష్టం చేశారు. చివరి నిమిషం వరకు బీసీల రిజర్వేషన్ల కోసం పోరాడుతామని అన్నారు. ఇది కొత్త రిజర్వేషన్లు కాదని, పాత చట్టంలో ఉన్న హక్కులను అమలు చేయడమేనని స్పష్టం చేశారు. 34 శాతం రిజర్వేషన్లు ఉన్న పాత చట్టాన్ని సవరించకుండా 24 శాతానికి తగ్గించినప్పుడే చట్టపరమైన సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. ఆ చట్టం ఇప్పటికీ అమల్లోనే ఉందని, చనిపోలేదని, అందుకే దాని ప్రకారమే జీవో ఇచ్చామని తెలిపారు.

**బీసీల హక్కులను కోర్టుల్లో అడ్డుకోవద్దు :**
బీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేసి వారి హక్కులను అడ్డుకోవద్దని అచ్చెన్నాయుడు అన్ని వర్గాల ప్రజలను కోరారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తుందని తెలిపారు. బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. బీసీలు గత పరిణామాలను గుర్తు పెట్టుకొని వాస్తవాలను అర్థం చేసుకోవాలని కోరారు.

**చంద్రబాబు, లోకేశ్‌పై ఆరోపణలు సరికాదు :**
బీసీలకు చెందిన నాయకులను చంద్రబాబు నాయుడు కక్షతో జైలుకు పంపిస్తున్నారని ఆరోపించడం సరికాదని అచ్చెన్నాయుడు అన్నారు. తాను బీసీ నాయకుడినేనని, తప్పు చేయకపోయినా గతంలో తనపై కేసులు పెట్టి జైలుకు పంపారని మరోసారి గుర్తుచేశారు. ఐదేళ్లపాటు భూతద్దంతో వెతికినా తమపై చిన్న తప్పును కూడా నిరూపించలేకపోయారని అన్నారు. ఇప్పుడు దర్యాప్తు సంస్థలు చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటుంటే వాటిని చంద్రబాబు నాయుడిపై మోపి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ బీసీలు తెలివైనవారని, వాస్తవాలను అర్థం చేసుకున్నారని, తెలుగుదేశం పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు బీసీల కోసం చేస్తున్న ప్రయత్నాలను గుర్తిస్తున్నారని తెలిపారు.

**రెడ్‌బుక్‌పై విమర్శలకు సమాధానం :**
నారా లోకేశ్ ప్రస్తావిస్తున్న రెడ్‌బుక్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే దానిని కక్షగా ఎందుకు భావిస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు తమ కుటుంబ వ్యవహారాలను తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు నాయుడు, లోకేశ్‌పై మోపడం సరికాదన్నారు. తమ నాయకులు ప్రత్యర్థుల కుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని కుటుంబాలను విడదీసే సంస్కృతికి పాల్పడరని స్పష్టం చేశారు.

**తప్పు ఉంటే సమాధానం చెప్పాలి :**
తాను బహిరంగంగానే మాట్లాడుతున్నానని, తన

## గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

- 15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం.. ఎలక్ట్రానిక్ నిఘా కొనసాగింపు
- డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్ పరిసరాల్లోనూ గాలింపు విస్తరణ
- మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని అవకాశాలను వినియోగిస్తున్నాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, ఆగస్టు 25:అనంత జనశక్తి న్యూస్**



అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం (ICG), నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (MRCC) ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు.పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటోందని అచ్చెన్నాయుడు చెప్పారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు.

## నల్లమడలో ‘కమ్యూనిటీ వాటర్ షేరింగ్’కు శ్రీకారం

– బోర్లున్న రైతులు నీటి వసతి లేని రైతులకు ఉచితంగా సాగునీరు అందించడం అభినందనీయం: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**నల్లమడ, ఆగస్టు 25,అనంత జనశక్తి న్యూస్**

భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు పక్కా ప్రణాళికతో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. మంగళవారం నల్లమడ మండలం గోపేపల్లి గ్రామంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ‘కమ్యూనిటీ వాటర్ షేరింగ్’ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.గోపేపల్లికి చెందిన బోర్లున్న రైతులు వేమన్న, భాస్కర్, రామకృష్ణ, నరసప్ప తమ బోర్ల నీటిని నీటి వసతి లేని మరో పది మంది పేద రైతులకు పైప్‌లైన్ ద్వారా ఉచితంగా అందించేందుకు ముందుకు రావడాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ తరహా నీటి పంపిణీ విధానం ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు.వర్షాభావ పరిస్థితుల్లో అవగాహన లేకుండా ఇష్టానుసారంగా బోర్లు వేసి రైతులు నష్టపోతున్నారని కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న భూగర్భ జలాలతో ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని స్పష్టం చేశారు. తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉలువలు వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సిద్ధం చేశామని తెలిపారు. రైతులు తమ పొలాల్లో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఆదేశించారు.పడే ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టేలా రైతులు తమ పొలాల్లో వీలైనంత మేర నీటి కుంటలు తవ్వుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని సూచించారు.కమ్యూనిటీ వాటర్ షేరింగ్ ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులు తమ అనుభవాలను కలెక్టర్‌తో పంచుకున్నారు. వినూత్నంగా నీటి పంపిణీ విధానాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న రెడ్స్ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నవీన్, నల్లమడ తహసీల్దార్ మనోజ్, ఎంపీడీఓ అంజనప్ప, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజ, మండల వ్యవసాయ అధికారి, రెడ్స్ సంస్థ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- జిల్లావ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు

**అనంతపురం ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు మంగళవారం జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రానున్న మిలాద్ ఉన్ నబీ పండుగ నేపథ్యంలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో మతపెద్దలు, స్థానిక ప్రముఖులతో శాంతి సమావేశాలు నిర్వహించారు. పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఊరేగింపులు, వేడుకల సమయంలో పోలీసు నిబంధనలు పాటించాలని సూచించారు.జిల్లాలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై పగలు, రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకున్నారు. హెల్మెట్, సీటు బెల్టు లేకుండా ప్రయాణించిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానాలు విధించారు.గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన వీధి సమావేశాల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, మహిళల రక్షణకు సంబంధించిన యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 112కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.



## రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి..

- వ్యవసాయ అధికారి లక్ష్మీప్రియ

**నల్లచెరువు ఆగస్టు 25 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని కే.పూలకుంట,దాంవాండ్ల పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం లో భాగంగా రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి లక్ష్మీప్రియ ఒక ప్రకటనలో తెలిపారు ఈ పంట నమోదుతో పంట భీమా క్లెయిమ్,ఇన్ పుట్ సబ్సిడీ రుణాలు,కనీస మద్దతు ధర కరువు సహాయం వంటి ప్రయోజనాలు పొందవచ్చని అలాగే ప్రభుత్వం నుండి సహాయం పొందాలంటే ప్రతి రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని వివరించారు రైతులు తమకు సమీపంలో వున్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్,పట్టా పాసుబుక్,బ్యాంక్ అకౌంట్ వివరాలతో ఈ పంట నమోదు చేసికోవచ్చని తెలిపారు మండలంలో సాగు చేసిన వివిధ పంటలు శెనగ, మొక్కజొన్న, వరి తదితర పంటల చీడ పీడలు వాటి నివారణ గురించి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమం లోఏవో లక్ష్మి ప్రియా, ఏఈఓ సింధు,ఎంపిఈఓ ఉదయ మరియు రైతులు పాల్గొన్నారు.



# సుజ్లాన్ రాకతో ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ పెరిగింది

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆలోచన చాలా సింపుల్. భారతదేశ ఆర్థిక స్వావలంబనకు ఇంధన స్వావలంబన అత్యంత అవసరం. ఆ దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడింది.

**అనంతలో 1,260 మెగావాట్ల సామర్థ్యం సుజ్లాన్ సొంతం**

201924 మధ్య రాష్ట్రంలో పవన విద్యుత్ అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. కేవలం 6 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. నేడు అనంతపురంలోని సుజ్లాన్ యూనిట్‌కు ఏడాదికి సుమారు 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉంది. ప్రత్యక్షంగా సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70 శాతానికి పైగా స్థానికులే. ఏపీ వ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలను సృష్టించింది. పారిశ్రామికీకరణ అంటే ఇలాగే ఉండాలి. ఒక జిల్లాకు పెట్టుబడులు రావాలి. ఆ జిల్లాలో తయారీ రంగం అభివృద్ధి చెందాలి. ఆ జిల్లాలో నైపుణ్యాలు పెరగాలి. యువతకు వారి సొంత జిల్లాలోనే ఉద్యోగాలు లభించాలి.

**విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటింది సుజ్లాన్**

భారతదేశ పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థల్లో సుజ్లాన్ ఒకటి. పట్టుదల, పునరుద్ధరణ సామర్థ్యంతో సుజ్లాన్ సంస్థ అత్యున్నత విజయాలను చూసింది. అత్యంత క్లిష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ సుజ్లాన్ ఎప్పుడూ కనుమరుగుకాలేదు. ఎందుకంటే నిబద్ధతతో కూడిన ఈ సంస్కృతిని తులసి తంతి గారు ఏర్పరచగా, ప్రస్తుత నాయకత్వం దానిని ముందుకు తీసుకెళ్లింది.

**రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4వేలకు పైగా ఉద్యోగాల కల్పన**

ఈ రోజు మనం ముందుకు తీసుకెళ్తున్న ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకురానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగావాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఏపీలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి.




**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం**

మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా AI ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌది అరేబియాగా ఏపీని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఓడరేవులు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ల్యాండ్ ఉంది. మెరుగైన కనెక్టివిటీ ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయి. ఈ ప్రయోజనాలన్నింటినీ ఒకచోటకు తీసుకురావడానికి అవసరమైన పాలసీ ఎన్విరాన్‌మెంట్ ను మేం సృష్టిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం**

పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మాణంలో భాగంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు దిశగా ముందుకు వెళ్తున్నాం. క్లస్టర్లు ఎందుకంటే.. కంపెనీలు ఒంటరిగా పెట్టుబడులు పెట్టవు. అవి ఎకోసిస్టమ్ లో పెట్టుబడులు పెడతాయి. అందుకే మా విధానం చాలా సులభం. కేవలం ఒక కంపెనీని తీసుకురావడం కాదు.. ఆ కంపెనీ చుట్టూ పూర్తి ఎకోసిస్టమ్ ను నిర్మించాలి. ఒక కంపెనీ సప్లయర్స్ ను తీసుకొస్తుంది. సప్లయర్స్ మరిన్ని కంపెనీలను తీసుకొస్తారు. కంపెనీలు ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఉద్యోగాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీంతో పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తాయి.




**ఏపీ-సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

ఈ భాగస్వామ్యంలో గర్వంగా అనిపించే మరో అంశం నైపుణ్యాభివృద్ధి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ తులసి తంతి గారి వారసత్వం మరోసారి కొనసాగుతోంది.

**అనంతపురం కొత్త కేరాఫ్ అడ్రస్ ఇదే..**

అనంతపురం జిల్లా అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ. ఒకప్పుడు అనంతపురం జిల్లా నుంచి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగాలు వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వచ్చే రోజులు వచ్చాయి. ఇదంతా మన ఏపీ బ్రాండ్, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి వల్లే సాధ్యమైంది.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. మన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కూడా మన రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తున్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి. అందుకే నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం**

ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. మన యువత ప్రతిభను, ఆశయాలను తీసుకువస్తారు. మనమంతా కలిసి అభివృద్ధిని సృష్టిస్తాం. ఏపీపై విశ్వాసం ఉంచిన గిరీష్‌తంతి, అజయ్ కపూర్ కు, మొత్తం సుజ్లాన్ బృందానికి ధన్యవాదాలు. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం. ఈ రోజు ఇక్కడ ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి, పారిశ్రామికవేత్తలకు ప్రముఖుడికి నా సందేశం ఒక్కటే.. మా స్పీడ్, స్టెబిలిటీ, కమిట్ మెంట్, ఎగ్జిక్యూషన్ ను నమ్మండి. ఎందుకంటే మీరు ఏపీలో విజయవంతమైతే, ఏపీ కూడా మీతో కలిసి విజయవంతమవుతుంది. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం అని మంత్రి చెప్పారు.

# ఏపీ మున్సిపల్ శాఖ – యూకే ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం

**- పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి గవర్నమెంట్ - గవర్నమెంట్ ఎంఓయూ**
**- అమరావతిని వరల్డ్ క్లాస్ స్మార్ట్, లివబుల్ సిటీగా అభివృద్ధి చేయడంలో యూకే నైపుణ్యం, సాంకేతిక సహకారం**
**- సస్టైనబుల్ అర్బన్ డెవలప్‌మెంట్, ఆధునిక టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీపై కలిసి పనిచేయనున్న ఏపీ–యూకే**
**- మునిసిపాలిటీల్లో రూ.40 వేల కోట్ల మౌలిక వసతుల పనులకు ప్రపంచస్థాయి సాంకేతికత వినియోగం**
**- మీడియాతో మంత్రి నారాయణ.**

**అమరావతి ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలిక వసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (MoU) మంగళవారం అమరావతిలో కుదిరింది. వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, యూకే ప్రభుత్వ డిపార్ట్ మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ నాయకత్వంలో ఏపీ ప్రతినిధి బృందం, యూకే ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి.

**అమరావతితో పాటు రాష్ట్ర పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం**

ఈ భాగస్వామ్యంలో అమరావతి కీలక సహకార రంగంగా నిలవనుంది. ఆధునిక, సుస్థిర, పర్యావరణహిత, మెరుగైన కనెక్టివిటీతో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి యూకే నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం మరింత బలం చేకూర్చనుంది. అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రాథమిక మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను టేకప్ చేసి, అనేక పనులకు టెండర్లు పిలిచి అమలు చేస్తున్నామని మంత్రి శ్రీ పి. నారాయణ తెలిపారు. ఈ పనుల్లో యూకేకు చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ విధానాలను వినియోగించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం**

ఆంధ్రప్రదేశ్-యూకే భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ-ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి.

రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యూకే నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు. సుస్థిర పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక పట్టణ ప్రణాళిక, సమర్థవంతమైన మౌలిక వసతుల రూపకల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యూకే నైపుణ్యం**

అమరావతి అభివృద్ధిలో యూకే సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ + పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది. అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యూకే నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం**

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ (ITS), బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (BIM), డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన-అభివృద్ధి (R&D) వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు. యూకేలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పట్టణ రవాణా వ్యవస్థలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఏపీ-యూకే కలిసి పనిచేయనున్నాయి. మెట్రో రైలు, బస్సు వ్యవస్థలు, విమానాశ్రయాల అనుసంధానం, పాదచారుల మౌలిక వసతులు, డేటా ఆధారిత రవాణా ప్రణాళిక వంటి అంశాలపై సహకారం కొనసాగనుంది. దీని ద్వారా పట్టణాల్లో కనెక్టివిటీ మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పెట్టుబడుల సమీకరణకు అవకాశాలు**

మౌలిక వసతుల ప్రాజెక్టులకు కొత్త ఆర్థిక నమూనాలు, పెట్టుబడుల సమీకరణ అవకాశాలను కూడా ఈ ఒప్పందం కల్పిస్తుంది. అర్హత కలిగిన ప్రాజెక్టులకు నిర్దేశిత ఆర్థిక అర్హతలు, డ్యూ డిలిజెన్స్, యూకే కంటెంట్ తదితర నిబంధనలకు లోబడి యూకే ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్ (UKEF) ద్వారా ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పరిశీలించవచ్చు. ఈ సందర్భంగా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.



నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యూకే డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యూకే సహకారం అందించనుందని తెలిపారు. బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్, సస్టైనబుల్ సిటీస్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీ వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం అందనుందని చెప్పారు. యూకేలోని వివిధ కంపెనీల బెస్ట్ ఎక్స్‌పర్టైజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేయడం ఈ భాగస్వామ్యం ద్వారా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ అమరావతి ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్‌లో భాగస్వామ్యం కావడం ఇప్పటికే ఉన్న సహకారానికి నిదర్శనమన్నారు. యూకేలో ఉన్న అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు ఈ ఒప్పందం మరింత అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు యూకే ప్రతినిధులు ముందుకు వచ్చారని, యూకే డిప్యూటీ హై కమిషనర్, బిజినెస్ విభాగం డైరెక్టర్ జనరల్ సహా ప్రతినిధులు అమరావతికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకే యూకే ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలోని టాప్ ఫైవ్ సిటీల్లో ఒకటిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి లక్ష్యంలో భాగంగా ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమరావతి అభివృద్ధిలో వినియోగించుకోవడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. రోడ్లు, డ్రైన్లు, వాటర్ సప్లై, సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తదితర రంగాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన పనులను చేపట్టామని, యూకే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే ఈ పనులను మరింత మెరుగైన ప్రమాణాలతో పూర్తి చేసే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ శ్రీ విజయ రామరాజు, ఐఏఎస్; ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ రాహుల్, సీడీఎంఏ, ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యూకే ప్రతినిధి బృందంలో దక్షిణాసియా ట్రేడ్ కౌన్సిలర్ మార్క్ బిరెల్, డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, నేషనల్ లీడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిషికేష్ చందా, సౌత్ ఇండియా రీజినల్ హెడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోహిత్ చంద్రగిరి, గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ చాజ్ వాలియా పాల్గొన్నారు.

# నాలెడ్జ్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం

**- డిసెంబర్ చివరికి క్వాంటం కంప్యూటింగ్ భవనం పూర్తి**
**- జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభించే దిశగా చర్యలు**
**- అమరావతి పర్యటన తర్వాత మీడియాతో మంత్రి పొంగూరు నారాయణ**

**అమరావతి ఆగస్టు 25, అనంత జనశక్తి న్యూస్**

అమరావతి రాజధానిని నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన తరహాలో అమరావతిని క్వాంటం కంప్యూటింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా సుమారు 45,216 చదరపు అడుగుల విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవన నిర్మాణంలో ప్రధాన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. క్వాంటం ల్యాబ్ కోసం ప్రత్యేకమైన నిర్మాణ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. 'రూమ్ విథిన్ రూమ్' కాన్సెప్ట్‌తో ల్యాబ్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. భూమి నుంచి వచ్చే సీస్మిక్ వైబ్రేషన్స్, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్ తదితర శబ్దాలు క్వాంటం కంప్యూటింగ్ పరికరాల పనితీరుపై ప్రభావం



చూపకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జర్మన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. క్వాంటం చిప్‌లను అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలకు చల్లబరచేందుకు హీలియం కంప్రెసర్లు, క్రయోజెనిక్ డైల్యూషన్ రిఫ్రిజిరేటర్ వంటి అధునాతన వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా డ్యూయల్ యాక్టివ్ ఫీడర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒక ఫీడర్‌లో అంతరాయం ఏర్పడినా మరో ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగించేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రిడ్ నుంచి వచ్చే హార్మోనిక్ డిస్టర్బెన్స్‌లను నియంత్రించేందుకు K13 రేటెడ్ ఐసోలేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు వినియోగిస్తున్నామని చెప్పారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్‌ను కూడా అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు.

**డిసెంబర్ చివరి నాటికి పూర్తి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన దిశానిర్దేశం మేరకు డిసెంబర్ చివరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం ప్రధాన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో ఎంఈపీ (మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్) పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. సెప్టెంబర్ 15 నాటికి ఎల్అండ్‌టీ సంస్థ ఎంఈపీ పనుల కోసం భవనాన్ని అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి భవనాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, క్వాంటం కంప్యూటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసే ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను ప్రారంభించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.

## క్వాంటం వ్యాలీలో రెండు భారీ టవర్లు

**క్వాంటం కంప్యూటింగ్ భవనం పక్కనే రెండు భారీ టవర్లను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. ఒక్కో టవర్ 48 అంతస్తులతో, 202 మీటర్ల ఎత్తు ఉండేలా డిజైన్ చేసినట్లు చెప్పారు. రెండు టవర్లకు కలిపి సుమారు 37 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి రానుందని తెలిపారు. ఈ టవర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఎల్-1 కూడా ఖరారైనట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో సైబర్ టవర్స్ ద్వారా వివిధ కంపెనీలు, సంస్థలకు స్థలాన్ని అందించిన విధంగానే అమరావతిలోని క్వాంటం వ్యాలీ టవర్లలోనూ స్టార్టప్‌లు, టెక్నాలజీ సంస్థలు, వివిధ కంపెనీలను ఆకర్షించి వారికి అవసరమైన స్పేస్ అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ సైబర్ టవర్స్ తరహాలోనే కాకుండా, అంతకంటే మెరుగైన స్థాయిలో క్వాంటం వ్యాలీ టవర్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి నారాయణ తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ సంస్థలను అమరావతికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందంజలో నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.**

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రేపటి రామాంజనేయులు ఏకగ్రీవ ఎన్నిక

**అనంతపురం, ఆగస్టు 25:అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఐ న్యూస్ బ్యూరో సీనియర్ జర్నలిస్టు రేపటి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం మెడికల్ కళాశాల సమీపంలోని ఐఎంఏ హాల్లో మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) జిల్లా కమిటీల ఎన్నికలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాయలసీమ ఇన్‌చార్జి జయరాజ్, ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. అంతకుముందు వందలాది మంది జర్నలిస్టులు నగరంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి, తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐఎంఏ హాల్‌కు చేరుకుని ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టు తలారి రామాంజనేయులు, సహాయ ఎన్నికల అధికారిగా ప్రతిమ వ్యవహరించారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ జిల్లా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రేపటి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా టీ. శివప్రకాశ్ (ప్రజాశక్తి), కోశాధికారిగా సుదర్శన్‌రెడ్డి (ఎన్ టీవీ) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకటేశులు (అనంత జనశక్తి), వై. కన్న (వార్త), పి. హరిప్రసాద్ (అనంత పోరు) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కే. రవీంద్రనాథ్ (ఐ న్యూస్), కే. సతీష్‌బాబు (వార్త), ఎస్. గోవింద్‌రెడ్డి (నేటి వార్త), ప్రచార కార్యదర్శిగా కె. అమర్ బ్రహ్మచారి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బి. షేర్ఖాన్, కే. భాస్కర్, డి. తిమ్మప్ప, వై. కుల్లాయప్ప, కే.సి. తిమ్మప్ప, జి. రామాంజనరెడ్డి, ఎన్. అస్లం బాషా, కే. శరత్‌కుమార్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తలారి రామాంజనేయులు కొనసాగనున్నారు. అదేవిధంగా ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడిగా బి. మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.కే. సూర్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన జిల్లా అధ్యక్షుడు రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీతో కలిసి నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. జర్నలిస్టులకు పింఛన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు సానుభూతి మాత్రమే కాకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు. నిజాయితీగా వార్తలు రాసే జర్నలిస్టులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పోరాడుతామని స్పష్టం చేశారు. రేపటి రామాంజనేయులు ఏకగ్రీవ ఎన్నికపై జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.



# అప్పుడే నాలోని చిత్రకారిణిని మేల్కొలుపుతా



వైవిధ్యభరితమైన కథలకు చిరునామాగా నిలుస్తూ.. నటనా ప్రాధాన్యమున్న పాత్రలతో మెప్పిస్తూ వరుస విజయాలతో జోరు చూపిస్తోంది నటి సాయిపల్లవి. అయితే ఆమెలో సహజ నటితో పాటు ఓ అద్భుతమైన చిత్రకారిణి కూడా ఉందంట. కానీ, తనలోని ఆ మరో కళని నైట్ షూట్‌స్‌లోనే చూసే అవకాశముందని చెబుతోంది. దీనికి వెనకున్న ఆసక్తికర విషయాన్ని తను ఇటీవల పంచుకుంది. "నాకు రాత్రిపూట చిత్రీకరణలు సవాల్‌గా అనిపిస్తాయి. ఎందుకంటే నేను నిద్రకి ఆగలేను. అందుకే నైట్ షూట్‌స్‌లో మేల్కొని ఉండేందుకు నాలోని చిత్రకారిణికి పని చెబుతుంటా. నా బ్యాగ్‌లో ఎప్పుడూ డ్రాయింగ్ బుక్, స్కెచెస్, క్రేయాన్స్ కచ్చితంగా ఉంటాయి. రాత్రిపూట షూట్‌స్‌లో నిద్రొస్తుందంటే చాలు.. వెంటనే ఆ బుక్ బయటకు తీసి బొమ్మలేయడం.. వాటికి రంగులు దిద్దడం లాంటివి చేస్తుంటా. అలా నన్ను నేను పెయింటింగ్‌లో బిజీగా ఉంచడం వల్ల నిద్ర దరి చేరకుండా ఉంటుంది. అలా ఇప్పటి వరకు చాలా డ్రాయింగ్ బుక్‌స్‌ని నింపాను" అని సాయిపల్లవి ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది.

# ఐఏఎస్ కావాలనుకున్నా



అవకాశం వస్తే చాలు.. సినీరంగంలోకి వచ్చి తెరపై తమని తాము చూసుకొని మురిసిపోవాలనుకుంటుంటారు చాలా మంది. కానీ బాలీవుడ్ నాయిక యామీ గౌతమ్ మాత్రం.. చిత్రపరిశ్రమకు రావాలని అనుకోలేదట. ఐఏఎస్ అధికారి కావాలని అనుకుందట. శక్తిమంతమైన పాత్రలు, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే కథానాయికీమె. తనదైన నటనతో మెప్పించే ఈ తార.. ఓ సందర్భంలో కెరీర్ తొలినాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

"కెరీర్ గురించి పలు ఆలోచనలు ఉండటంతో చిత్రపరిశ్రమ ఎప్పుడూ నా ప్రాధాన్యతగా ఉండేది కాదు. ఒక భిన్నమైన రంగంలో రాణించాలనుకుంటున్నానని నాన్నతో చెప్పా. అందుకే న్యాయశాస్త్రం కూడా చదివాను. నేను మంచి విద్యార్థినిని. నటన గురించి బయట పెద్దగా మాట్లాడేదాన్ని కాదు. కానీ సినిమాలంటే అమితమైన ఇష్టం ఉండేది. సినిమాలు చూస్తూ.. ఆ పాత్రలను నేను పోషిస్తున్నట్లు మనసులో ఊహించుకునేదాన్ని. నా ఊహలు కలలుగానే మిగిలిపోతాయనుకున్నా. ఎందుకంటే నటన దిశగా అడుగులు వేసే ధైర్యం నాకుంటుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆ తర్వాత ఒక టెలివిజన్ షో కోసం ఆడిషన్ ఇవ్వమని కుటుంబ సభ్యులు, స్నేహితులు చాలా ప్రోత్సహించారు. మా నాన్న ఇంట్లోనే నా ఆడిషన్‌ను ఫోన్లో చిత్రీకరించి.. దర్శకుడికి పంపించార"ని ఆనాటి సంగతుల్ని గుర్తుచేసుకుంది యామి. ప్రస్తుతం ఆమె 'నయీ నవేలి'తో బిజీగా ఉంది.

# నాది రాతి గుండె.. అలాంటిది 'ఇరుముడి' చూసి ఏడ్చేశా : రవితేజ

"హిందీలో రాజ్‌కుమార్ హిరాణీ చిత్రాలు చూస్తే భావోద్వేగంతో కన్నీళ్లు వచ్చేస్తాయి. తెలుగులో అలాంటి భావోద్వేగానికి గురి చేసిన సినిమా 'ఇరుముడి" అన్నారు కథానాయకుడు రవితేజ. ఆయన.. ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన ఈ సినిమాని శివ నిర్వాణ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. బేబీ నక్షత్ర, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలై విజయవంతంగా నడుస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ.. "కరోనా సమయంలో ఓటీటీలో తమిళ, మలయాళ సినిమాలు చూసి.. ఇలాంటి కథలు మనకు రావేంటని అనుకునేవాళ్లం. ఇప్పుడీ చిత్రం ఆ మూలాలున్న కథతోనే వచ్చింది. నిజానికి నాది రాతి గుండె. నాకు సాధారణంగా ఏడుపు రాదు. అలాంటిది ఈ చిత్రం చూసి ఏడ్చేశాను. శివ నాకు ఈ కథ, త్రినాథ్ పాత్ర చెప్పి.. టైటిల్ వినిపించగానే సూపర్ అన్నా. ఇలాంటి మంచి ఫీల్ ఉన్న సినిమాని ప్రేక్షకులకు అందించినందుకు తనకు అభినందనలు. జీవీ ప్రకాశ్ సంగీతం ఈ చిత్రానికి ఆత్మ. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఆ మ్యూజిక్‌తో అప్రయత్నంగా ప్రేక్షకులకు కళ్లలో నీళ్లు వచ్చేస్తున్నాయి. వాళ్ల స్పందన చూస్తుంటే నా కళ్లు చెమర్చాయి. మా అమ్మాయి మోక్ష కూడా ఈ చిత్రం చూస్తూ కన్నీళ్లు పెట్టుకుంది. ఎప్పుడో 20ఏళ్ల క్రితం థియేటర్‌కి వచ్చిన వాళ్లు మళ్లీ ఈ సినిమా చూడటానికి థియేటర్‌కి రావడం కూడా చాలా భావోద్వేగానికి గురి చేసింది. నిజంగా ఈ ఆనందం మామూలుది కాదు" అన్నారు. "నిన్ను కోరి', 'మజిలి' నన్ను తెలుగు వారి ఇళ్లలోకి తీసుకెళ్తే.. ఈ 'ఇరుముడి' నన్ను వాళ్ల హృదయాల్లోకి తీసుకెళ్లింది. ఈ చిత్రం కోసం మేమంతా ఒక యుద్ధంలా పని చేశాం. సమష్టి కృషి వల్లే ఇంతటి విజయం సాధ్యమైంది. దర్శకుడికి హీరో స్వాతంత్ర్యం ఇస్తే ఇలాంటి మంచి చిత్రాలు వస్తాయి. ఈ సినిమాలో ఇంటర్వెల్‌కి ముందు రవితేజని కొడతారు. 'నన్ను కొడితే అభిమానులు ఒప్పుకుంటారా' అని ఆయన అనుంటే ఇలాంటి చిత్రం వచ్చేది కాదు. మేము కథ చెప్పేటప్పుడు ఎలాంటి లెక్కలేసుకోలేదు. ప్రేక్షకుడికి కథని కనెక్ట్ చేయాలన్న ఉద్దేశంతో పని చేశాం. దీంట్లో మణెమ్మ పాత్రలో నక్షత్ర ఎంతలా జీవించిందో ప్రేక్షకుల రియాక్షన్స్ చెప్తున్నాయి. అలాగే కావేరి పాత్రని ప్రియా చాలా సహజంగా చేసింది" అన్నారు దర్శకుడు శివ నిర్వాణ. నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ మాట్లాడుతూ.. "ఒక సినిమా విడుదలైన రోజున్నరలోనే లాభాల్లోకి రావడం గత 50ఏళ్లలో ఎప్పుడూ జరగలేదని డిస్ట్రిబ్యూటర్లు చెప్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని మేము చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. దీనికి ఎదురు లేదు. మరో నాలుగు వారాలు ఇది వెళ్తూనే ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, ప్రియా భవానీ, స్వసిక, విష్ణు శర్మ, అనంత శ్రీరామ్, నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.



# 100 మీటర్లు 9.39 సెకన్లలో..




9.58 సెకన్లలో 100 మీటర్ల పరుగు.. జమైకా దిగ్గజ స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్ 2009లో నెలకొల్పాడు ఈ రికార్డు. ఇన్నేళ్లలో ఎవరూ దీని దరిదాపుల్లోకి కూడా రాలేదు. మనుషులకు అసాధ్యంగా మారిన ఈ వేగాన్ని మరమనిషి అధిగమించడం విశేషం. బీజింగ్‌లో జరిగిన ప్రపంచ హ్యూమనాయిడ్ రోబో క్రీడల 100 మీటర్ల పరుగును ఒక రోబో 9.39 సెకన్లలోనే పూర్తి చేసింది. ఈ మర మనిషిని బీజింగ్ హ్యూమనాయిడ్ రోబో ఇన్నోవేషన్ సెంటర్ తయారు చేసింది. ఈ రేసులో మరో రోబో (హానర్స్ లైట్నింగ్) 9.47 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది. గత ప్రపంచ హ్యూమనాయిడ్ రోబో క్రీడల కంటే ఈసారి 100 మీటర్లలో ప్రదర్శన ఎంతో మెరుగైంది. నిరుడు ఈ 100 మీటర్ల రేసును టియాన్‌గాంగ్ అల్ట్రా తయారు చేసిన రోబో 21.50 సెకన్లలో పూర్తి చేయగలిగింది. ఇంతకుముందు చైనాకు చెందిన షెన్‌జెన్ హనర్స్ కంపెనీ రూపొందించిన 'ఫ్లాష్' అనే రోబో.. హాఫ్ మారథాన్‌లో 50 నిమిషాల 26 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరింది. ఉగాండా రన్నర్ జకోబ్ పేరిట ప్రపంచ రికార్డు (57 నిమిషాల 20 సెకన్లు) ఉంది.

# ఆ స్థానం కోసం పోరాడతాం



ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరే అవకాశం కొద్దిలో చేజారడం భారత జట్టును తీవ్రంగా నిరాశపరిచిందని కెప్టెన్ సలీమా టెటె చెప్పింది. "ప్రపంచకప్ సెమీఫైనల్ బెర్తుకు చాలా సమీపంగా వచ్చి ఆగిపోయాం. ఈ టోర్నీ కోసం ఎంతో కష్టపడ్డాం. మెరుగైన ప్రదర్శనే చేశాం. కానీ అనుకున్న ఫలితాన్ని సాధించలేకపోయాం. ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకూడదనే విషయాన్ని నేర్చుకున్నాం. ఇక అయిదో స్థానం కోసం పోటీపడనున్నాం. కచ్చితంగా పుంజుకుంటాం. మాలో ఆ పోరాటతత్వం అలాగే ఉంది. అయిదో స్థానాన్ని అయినా సాధిస్తే జట్టు ఆత్మస్థైర్యం పెరుగుతుంది" అని సలీమా చెప్పింది. మూడో ప్రపంచకప్ ఆడుతున్న సవిత పునియా కూడా ఆస్ట్రేలియాతో మ్యాచ్ ఫలితంతో తీవ్ర నిరాశకు గురైంది. "భారత్‌కు ఇదే అత్యుత్తమ అవకాశం. చాలా దగ్గరగా వచ్చాం. మళ్లీ ఇలాంటి ఛాన్స్ వస్తుందో లేదో" అని సవిత పేర్కొంది. ప్రస్తుత ప్రపంచకప్‌లో 11 మంది భారత ప్లేయర్లు తొలిసారి ఆడారు. ఆస్ట్రేలియాతో మ్యాచ్ డ్రా అయి.. జట్టు నిష్క్రమించడంతో భారత అమ్మాయిలు కన్నీళ్లు పెట్టుకున్నారు.

# అబ్బాయిలూ.. అమ్మాయిల బాటే



హాకీ ప్రపంచకప్‌లో భారత దశాబ్దాల పతక నిరీక్షణకు ఈసారీ తెరపడలేదు. పురుషుల జట్టుకు మళ్లీ రిక్తహస్తమే మిగిలింది. పతక అంచనాలతో బరిలో దిగిన హర్మన్‌ప్రీత్ బృందం సెమీఫైనల్ చేరడంలో విఫలమైంది. సెమీస్ రేసులో ఉండాలంటే ఘనంగా (కనీసం 3 గోల్స్ తేడా) నెగ్గాల్సిన పూల్-ఇ పోరులో సోమవారం భారత్ 3-5తో అర్జెంటీనా చేతిలో ఓడింది. టోర్నీ రెండో దశలో ఆడిన రెండు మ్యాచ్‌లూ ఓడి రేసు నుంచి నిష్క్రమించింది. అర్జెంటీనా (6 పాయింట్లు) సెమీస్ చేరింది. అన్నే పాయింట్లు సాధించిన నెదర్లాండ్స్ ఇప్పటికే ముందంజ వేసింది. ఇంగ్లాండ్ (3) మూడో స్థానంలో నిలిచింది. ఇక భారత్ 5-6 స్థానాల వర్గీకరణ మ్యాచ్ ఆడనుంది.

అర్జెంటీనాతో మ్యాచ్‌లో ఆరంభం నుంచి భారత్‌ది వెనుకడుగే. తొలి క్వార్టర్ తొలి నిమిషంలోనే అర్జెంటీనా గోల్ కొట్టేసింది. గోల్‌కు ఎడమవైపు నుంచి దూసుకొచ్చిన టాస్కని కీపర్ మోహిత్‌ను బోల్తా కొట్టిస్తూ బంతిని నెట్‌లోకి పంపించాడు. కాసేపటికే భారత్‌కు ఇంకో షాక్! నికోలాస్ డెలా (6వ నిమిషం) పెనాల్టీకార్నర్‌ను గోల్‌గా మలిచి అర్జెంటీనా ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. కాసేపటికి భారత్ పుంజుకుంది. సుఖ్‌జీత్ సింగ్ (10వ నిమిషం) ఓ సూపర్ ఫీల్డ్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచాడు. రెండో క్వార్టర్‌లోనూ అర్జెంటీనా దూకుడు కొనసాగినా.. ఆ జట్టు దాడులను భారత డిఫెండర్లు కాచుకున్నారు. మూడో క్వార్టర్‌లోనూ అర్జెంటీనా వద్దే బంతి ఎక్కువగా కనబడింది. హర్మన్‌ప్రీత్ బృందానికి ప్రత్యర్థిని కాచుకోవడమే సరిపోయింది. ఎదురుదాడికి అవకాశం లేకుండాపోయింది. భారత కష్టాలను పెంచుతూ థామస్ (33, 45 నిమిషాలు) తక్కువ సమయంలో రెండు గోల్స్ కొట్టడంతో అర్జెంటీనా 4-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు వరుసగా 4 పెనాల్టీకార్నర్లు దక్కినా ఉపయోగించుకోలేకపోయింది. పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తూ అర్జెంటీనా ఆధిక్యం 5-1గా మారిపోయింది. ఈసారి లుకాస్ (53వ) గోల్ కొట్టాడు. దీంతో భారత్‌కు ఘోర పరాభవం తప్పదనిపించింది. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా సుఖ్‌జీత్ (58వ), హార్దిక్ (60వ) సఫలం కావడంతో జట్టు కాస్త గౌరవప్రదంగా ఓడింది. భారత్ ఆఖరి గోల్.. పెనాల్టీ స్ట్రోక్ ద్వారా లభించింది. పెనాల్టీ కార్నర్లను వీలైనన్ని సద్వినియోగం చేసుకోలేకపోవడం, పాసింగ్‌లో గందరగోళం, ఫినిషింగ్ లేకపోవడం, బలహీనమైన ఎటాకింగ్ హర్మన్‌ప్రీత్ బృందాన్ని ముంచింది.

# మిక్‌స్‌డ్ డబుల్‌స్‌కు స్టార్ పవర్



యుఎస్ ఓపెన్‌లో సింగిల్స్ ఆట ఆరంభానికి ముందే ప్రేక్షకుల్ని అలరించేందుకు టెన్నిస్ స్టార్లు కార్లోస్ అల్కరాస్, నొవాక్ జకోవిచ్, సెరెనా విలియమ్స్, అరీనా సబలెంకా సిద్ధమయ్యారు. మంగళవారం ప్రారంభంకానున్న మిక్‌స్‌డ్ డబుల్‌స్‌లో వీళ్లు బరిలో దిగనున్నారు. అల్కరాస్- సెరెనా జోడీగా పోటీ పడుతున్నారు. వైల్డ్‌కార్డు ద్వారా అవకాశం దక్కించుకున్న ఈ ద్వయం.. మంగళవారం తొలి రౌండ్లో తలపడనుంది. సెరెనా 2022 తర్వాత యుఎస్ ఓపెన్లో ఆడటం ఇదే మొదటిసారి. జకోవిచ్, సబలెం కా జంట టాప్ సీడ్‌గా బరిలో దిగనుంది. రెండో సీడ్ దక్కించుకున్న జెస్సికా పెగులా- టేలర్ ఫ్రిట్జ్ జోడీ దియానా ష్నైడర్- కాస్పర్ రూడ్ జంటతో పోటీ పడనుంది. తొలి రౌండ్, క్వార్టర్‌ఫైనల్స్ మంగళవారమే జరగనుండగా.. సెమీస్, ఫైనల్ బుధవారం ఉంటాయి. గత ఏడాది యుఎస్ ఓపెన్ మెయిన్ డ్రా ఆరంభానికి ముందు మిక్‌స్‌డ్ డబుల్స్ టోర్నీని తొలిసారి ప్రయోగాత్మకంగా నిర్వహించారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314